# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

సంపుటి : 09 సంచిక : 121 పేజిలు : 08, వెల రూ. 5రూ/ బుధవారం- 07 - మే - 2025


## తెలంగాణకు 4000 సోలార్ పవర్ ప్లాంట్లు కేటాయించండి..

### కేంద్రానికి డీసీఎం భట్టి వినతి



- అన్ని రంగాల్లో సత్తా చాటుతున్న తెలంగాణ రాష్ట్రానికి తగు రీతిలో కేంద్రం సహాయ, సహకారాలు అందించాలని
- పీరియడ్ ప్రకారం పునః సమీక్ష అనంతరం కేటాయింపులను 4000 మెగావాట్ల నుండి 1000 మెగావాట్లకు తగ్గించి ఇవ్వాలని సమాచారం

తెలంగాణలో వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా పునరుత్పాదక ఇంధన రంగాన్ని బలోపేతం చేసేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట కార్యాచరణను అమలుచేస్తున్నది. ఇందులో భాగంగా నేడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

## కేసీఆర్‌ను దూషిస్తే

# నాలుక చీరేస్తాం..

## రేవంత్ రెడ్డికి కేటీఆర్ వార్నింగ్

- మింగ మెతుకు లేదు కానీ మీసాలకు సంపెంగ నూనెనట అని రేవంత్ పనితీరును ఉద్దేశించి కేటీఆర్ విమర్శించారు.
- ఒక్క హామీ అమలు చేసేందుకు పైసల్లేవ్ అని అంటున్నరు.
- కచ్చితంగా ప్రజల తరపున అడుగుతాం.. వదిలిపెట్టం. పరిపాలన చేతగాకపోతే తప్పుకో..
- కేసీఆర్‌ను ఇప్పటిదాకా ఎన్ని మాటలు అన్న పడ్డాం. ఇక నుంచి కేసీఆర్‌ను వ్యక్తిగతంగా దూషిస్తే మాత్రం నాలుక చీరేస్తాం..



వివరాలు 2లో..

హైదరాబాద్ : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను వ్యక్తిగతంగా దూషిస్తే నాలుక చీరేస్తామని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. మింగ మెతుకు లేదు కానీ మీసాలకు సంపెంగ నూనెనట అని రేవంత్ పనితీరును ఉద్దేశించి కేటీఆర్ విమర్శించారు. ఇదే బీద అరుపులు అరుస్తున్నాడు సీఎం. ఇంకో దిక్కు తెలంగాణ రైజింగ్, ఫ్యూచర్ సిటీ.. లక్షన్నర కోట్లు మూసీ.. 420 హామీలు ఇచ్చారు. ఒక్క హామీ అమలు చేసేందుకు పైసల్లేవ్ అని అంటున్నరు. కచ్చితంగా ప్రజల తరపున అడుగుతాం..

## కేటీఆర్‌పై నిప్పులు చెరిగిన

# మంత్రి సీతక్క



- కేసీఆర్ హయాంలో చేసిన అప్పులు తెలంగాణ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేలా ఉన్నాయని
- 6 వేల కోట్లు వడ్డీ రూపంలో చెల్లించాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.
- తమ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని సీతక్క స్పష్టం చేశారు.
- ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తామని సీతక్క హామీ ఇచ్చారు.

## రష్యా రాజధానిపై 100 డ్రోన్లతో విరుచుకుపడిన ఉక్రెయిన్



- ఉక్రెయిన్, రష్యా మధ్య కొనసాగుతున్న దాడులు, ప్రతిదాడులు
- మాస్కో సమీపంలో నాలుగు, ఇతర ప్రాంతాల్లో 9 విమానాశ్రయాలు మూసివేత
- ఖార్కివ్‌పై రష్యా డ్రోన్ల దాడి... పౌరులకు గాయాలు, ఆస్తి నష్టం.

రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం ముగింపు దిశగా అమెరికా వంటి దేశాలు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు ఆగడం లేదు. తాజాగా ఉక్రెయిన్ దళాలు రష్యా భూభాగంపై భారీ స్థాయిలో

## అమరావతి రాజధానిపై

# సీఆర్డీయే భేటీ

## చంద్రబాబు కీలక నిర్ణయాలు..!

- మోడీ శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఇవాళ సమావేశమైన సీఆర్డీయే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.
- రాజధానిని జాతీయ రహదారితో అనుసంధానం చేసేందుకు వీలుగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు.
- ఆయా భవనాల వద్ద అదనపు మౌలిక సదుపాయాలు కల్పన కోసం రూ.194 కోట్లకు సీఆర్డీఏ అథారిటీ అనుమతి ఇచ్చిందన్నారు.
- 1050 ఎకరాల మేర భూ కేటాయింపులు రాజధాని ప్రాంతంలో జరిగాయని మంత్రి నారాయణ వెల్లడించారు.



వివరాలు 2లో..

అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభానికి ప్రధాని మోడీ శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఇవాళ సమావేశమైన సీఆర్డీయే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన

## కొత్త రేషన్ కార్డులకు అప్లై చేసుకోండి - నెల రోజులు మాత్రమే గడువు



- బుధవారం నుంచి రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరిస్తామన్న మంత్రి నాదెండ్ల మనోహర్
- కొత్త కార్డులు, మార్పులు-చేర్పులు, చిరునామా మార్చుకోవచ్చని వెల్లడి
- కుటుంబసభ్యుల పేర్లు అన్నీ చక్కగా కనిపించేలా స్మార్ట్ కార్డు జారీ ఉంటుందని మంత్రి వెల్లడించారు.

అమరావతి : కొత్త రేషన్ కార్డుల జారీ ఈ-కేవైసీ కోసం ఆలస్యం అయ్యిందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

## రాజధాని అమరావతిలో

# భూ కేటాయింపులపై కీలక నిర్ణయం

గెజిటెడ్ అధికారుల నివాస భవనాలను రూ. 514 కోట్లతో నిర్మాణం చేపడతామని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు.

వాటిలో అదనపు మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 194 కోట్లు మంజూరు చేసేందుకు సీఆర్డీఏ అనుమతి ఇచ్చిందన్నారు.

ఈ 15,13 రహదారులను జాతీయ రహదారికి అనుసంధానం చేసేలా నిర్ణయం తీసుకున్నామన్నారు.

రాజధాని ప్రాంతంలో 1050 ఎకరాల మేర భూ కేటాయింపులు జరిగాయని మంత్రి పి.నారాయణ వివరించారు.



2లో

అమరావతి, మే 06: గెజిటెడ్ అధికారుల నివాస భవనాలను రూ. 514 కోట్లతో నిర్మాణం చేపడతామని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు. వాటిలో అదనపు మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 194 కోట్లు మంజూరు చేసేందుకు సీఆర్డీఏ అనుమతి ఇచ్చిందన్నారు. తొమ్మిది టవర్లలో నాన్ గెజిటెడ్ అధికారుల నివాసాలు, మౌలిక సదుపాయాలకు అనుమతి సైతం ఇచ్చిందని తెలిపారు. మంగళవారం జరిగిన సీఆర్డీయే 47వ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు జీవోఎం కూడా సమావేశమై.. రాజధానిలో భూ కేటాయింపులపై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అందుకు సంబంధించిన వివరాలను మంత్రి పి నారాయణ వెల్లడించారు. రూ. 517 కోట్లతో టెండర్లకు అనుమతి ఇచ్చిందని చెప్పారు. మొత్తంగా రూ. 1732. 31 కోట్లకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. అలాగే 190 ఎంఎల్డీల వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు రూ. 568. 57 కోట్లతో టెండర్ పిలిచామన్నారు. 15 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అందుకు రూ. 494 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతి ఇచ్చిందన్నారు.

## పూర్తి సహకారం

# అందిస్తాం



2లో

File Photo

- ప్రధాని మోదీకి ఖతార్ అమీర్ షేక్ తమీమ్ హామీ
- పహల్గామ్‌లో ఉగ్రదాడి... ఖతార్ అమీర్ షేక్ తమీమ్ నుంచి ప్రధాని మోదీకి ఫోన్
- బాధిత కుటుంబాలకు ఖతార్ అమీర్ ప్రగాఢ సంతాపం
- ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ
- దాడి సూత్రధారులను చట్టం ముందు నిలబెట్టడంలో పూర్తి సహాయం

# యుద్ధానికి సిద్ధమా..



న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్?లో ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్??ల మధ్య తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఈ రెండు దేశాల మధ్య యుద్ధం తప్పదనే వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైతే గెలుపు ఓటములు అనేవి తర్వాత సంగతి.. ముందుగా యుద్ధం చేయాలంటే భారీగా నిధులు కలిగి ఉండాలి. అది కూడా బిలియన్లు, ట్రిలియన్లలో నగదు ఉండాలి. మరి భారత్, పాకిస్థాన్ దేశాలకు అంత భారీగా నిధులు ఉన్నాయా? అదీకాక యుద్ధాల వల్ల భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సైతం సంభవిస్తుంది. అలాగే భారీగా ఆయుధ సంపత్తి సైతం కలిగి ఉండి తీరాలన్నది సుస్పష్టం. అంతేకాదు.. ఈ యుద్ధం తర్వాత ఏ దేశమైనా మళ్లీ తిరిగి కోలుకోవాలంటే చాలా ఏళ్లు పడుతుంది. అది కూడా అంత ఆషామాషీ వ్యవహారం కాదన్న సంగతి అందరికీ తెలిసిందే.

యుద్ధం ప్రారంభమే కాకూడదు..

- భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధం జరిగితే పరిస్థితి ఏమిటి?
- ఆ ప్రభావం ఇరు దేశాల మీద.. మరి ముఖ్యంగా ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతోంది.
- యుద్ధాల వల్ల భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సైతం సంభవిస్తుంది.
- పాకిస్థాన్ తో సుమారు 1000 గంటలపాటు భారత్ యుద్ధం చేస్తే.. అందుకు రూ. 27 వేల కోట్ల ఖర్చవుతుందని ఓ అంచనా.

ఇక యుద్ధం అనేది ప్రారంభమే కాకూడదు. ఓ వేళ ప్రారంభమైతే.. మిగతా..2లో

## రష్యా రాజధానిపై

# 100 డ్రోన్లతో విరుచుకుపడిన ఉక్రెయిన్

డ్రోన్లతో విరుచుకుపడగా, రష్యా కూడా తీవ్రంగా ప్రతిస్పందించింది. ఈ దాడుల నేపథ్యంలో మాస్కో సహా పలు ప్రాంతాల్లో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఉక్రెయిన్ నేడు రష్యాలోని డజనుకు పైగా ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని వందకు పైగా డ్రోన్లతో దాడులు చేపట్టింది. ఈ దాడుల ధాటికి మాస్కో సమీపంలోని నాలుగు ప్రధాన విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పలు డ్రోన్లను తమ వాయు రక్షణ వ్యవస్థలు సమర్థవంతంగా కూల్చివేశాయని రష్యా అధికారులు తెలిపారు. అయినప్పటికీ, ఈ దాడుల కారణంగా మరో తొమ్మిది ప్రాంతీయ విమానాశ్రయాలు కూడా స్వల్పంగా దెబ్బతిన్నాయని, వాటి కార్యకలాపాలను కూడా నిలిపివేయాల్సి వచ్చిందని రష్యా పౌర విమానయాన సంస్థ 'రోసావియాట్సియా' ఒక ప్రకటనలో పేర్కొంది. మరోవైపు, రష్యా దళాలు కూడా ఉక్రెయిన్‌పై తమ దాడులను కొనసాగించాయి. రష్యా సరిహద్దుకు సమీపంలో ఉన్న ఉక్రెయిన్‌లోని ఖార్కివ్ నగరంపై రష్యా బలగాలు 20కి పైగా డ్రోన్లను ప్రయోగించినట్లు సమాచారం. ఈ దాడిలో నలుగురు పౌరులు గాయపడగా, స్థానిక మార్కెట్‌లోని దాదాపు 100 స్టాళ్లు ధ్వంసమయ్యాయని ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. మరో ప్రాంతంలో రష్యా జరిపిన బాంబు దాడుల్లో ఏడుగురు పౌరులు గాయపడినట్లు స్థానిక వర్గాలు తెలిపాయి. కాగా, రెండో ప్రపంచ యుద్ధ విజయం 80వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 'విక్టరీ డే' సందర్భంగా మే 8 నుంచి 10 వరకు మూడు రోజుల పాటు ఉక్రెయిన్‌పై తాత్కాలిక కాల్పుల విరమణను పాటిస్తున్నట్లు రష్యా ప్రకటించింది.

# అమరావతి రాజధానిపై సీఆర్డీయే భేటీ

సీఆర్డీయే 47వ భేటీలో రాజధానిలో భూముల కోసం వచ్చిన ప్రతిపాదనలపై చర్చించడంతో పాటు కేటాయింపులకు ఆమోద ముద్ర వేశారు. అలాగే రాజధానిని జాతీయ రహదారితో అనుసంధానం చేసేందుకు వీలుగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. ఇవాళ జరిగిన సీఆర్డీఏ భేటీలో మొత్తం 10 అంశాలపై సీఎం చంద్రబాబు, మున్సిపల్ మంత్రి నారాయణ, ఇతర అధికారులు చర్చించారు. అనంతరం ఈ భేటీలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి నారాయణ వెల్లడించారు. ఇందులో గెజిటెడ్ అధికారుల క్వార్టర్ల పూర్తికి రూ.514.41 కోట్లతో టెండర్లు పిలిచేందుకు అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఆయా భవనాల వద్ద అదనపు మౌలిక సదుపాయాలు కల్పన కోసం రూ.194 కోట్లకు సీఆర్డీఏ అథారిటీ అనుమతి ఇచ్చిందన్నారు. 9 టవర్ ల నాన్ గెజిటెడ్ అధికారుల నివాసాలు, మౌలిక సదుపాయాలకు కూడా సీఆర్డీఏ అనుమతి మంజూరు చేసింది. రూ.517 కోట్లతో టెండర్లకు అనుమతి ఇచ్చారు. మొత్తంగా రూ.1732.31 కోట్ల విలువైన పనులకు ఆమోదం తెలిపారు. 190 ఎంఎల్డీల వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.568.57 కోట్ల తో టెండర్ పిలిచేందుకు కూడా సీఆర్డీఏ అనుమతిచ్చింది. 15 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి ఆమోదముద్ర వేశారు. అలాగే అమరావతిలో 3.5 కిలోమీటర్ల ఈ3 రోడ్డును ఎలివేటెడ్ రోడ్డుగా చేసేందుకు అనుమతి ఇచ్చారు. అలాగే ఈ15, ఈ13 రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానం చేసేలా అనుమతి ఇచ్చారు. అటు లా యూనివర్సిటీ కి 55 ఎకరాలు,క్వాంటం వ్యాలీకి 50 ఎకరాలు, బసవ తారకం ఆస్పత్రికి అదనంగా మెడికల్ కాలేజీ కి మరో 6 ఎకరాలు కేటాయించారు. గతంలో ఈ సంస్థకు 15 ఎకరాలు కేటాయించారు. మరోవైపు అమరావతిలో ఆదాయపు పన్ను శాఖ కార్యాలయానికి 0.78 ఎకరాలు,రెడ్ క్రాస్ సొసైటీ కి 0.78ఎకరాలు,కోస్టల్ బ్యాంకు కు 0.40 ఎకరాలు, ఐఆర్సీటీసికి ఎకరా భూమి కేటాయించారు. గతంలో 64 సంస్థలకు ఇక్కడ భూ కేటాయింపులు జరిగాయి. ఇప్పటి వరకూ 1050 ఎకరాల మేర భూ కేటాయింపులు రాజధాని ప్రాంతంలో జరిగాయని మంత్రి నారాయణ వెల్లడించారు.

# కేటీఆర్‌పై నిప్పులు చెరిగిన మంత్రి సీతక్క

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విమర్శలకు మంత్రి సీతక్క తనదైన శైలిలో ఘాటుగా స్పందించారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పులు తెలంగాణ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేలా ఉన్నాయని ఆమె తీవ్రంగా విమర్శించారు. ఆయన చేసిన అప్పుల భారం కారణంగానే, నేడు రాష్ట్రం ప్రతి నెలా రూ. 6 వేల కోట్లు వడ్డీ రూపంలో చెల్లించాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ నిజంగా సత్తా కలిగిన నాయకుడే అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఆయన ఎక్కడికి పత్తా లేకుండా పోయారని ఆమె సూటిగా ప్రశ్నించారు. 40 మంది ఆర్టీసీ కార్మికుల మరణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యత వహించదా? వారి ప్రాణాలను బలిగొన్నది బీఆర్ఎస్ కాదా? అని ఆమె నిలదీశారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, దీని నుంచి బయటపడటానికి తమ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని సీతక్క స్పష్టం చేశారు. కేటీఆర్ విమర్శలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని, ప్రజలను తప్పుదారి పట్టించేలా ఉన్నాయని ఆమె మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై తమ ప్రభుత్వం విచారణ జరుపుతోందని, దోషులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆమె తేల్చి చెప్పారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తామని సీతక్క హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది, రాష్ట్రానికి మంచి భవిష్యత్తును అందించడమే తమ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

## పూర్తి సహకారం అందిస్తాం:

## ప్రధాని మోదీకి ఖతార్ అమీర్ షేక్ తమీమ్ హామీ

ఢిల్లీ : జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి ఘటనపై ఖతార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ క్లిష్ట సమయంలో భారత ప్రజలకు తమ పూర్తి సంఘీభావం తెలుపుతున్నట్లు ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్-థానీ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఫోన్ ద్వారా సంభాషించి, ఈ మేరకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్-థానీ మధ్య జరిగిన సంభాషణలో పహల్గామ్ ఉగ్రదాడి ప్రధానంగా చర్చకు వచ్చింది. ఈ దాడిని ఖండించిన అమీర్, ఉగ్రవాదంపై పోరాటంలో భారతదేశానికి తమ దేశం సంపూర్ణ మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. దాడికి పాల్పడిన దుండగులను గుర్తించి, వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు భారత్ చేసే అన్ని ప్రయత్నాలకు పూర్తి సహకారం ఉంటుందని ఆయన ప్రధాని మోదీకి హామీ ఇచ్చారు. ఈ కష్టకాలంలో ఖతార్ అమీర్ చూపిన సంఘీభావానికి, అందించిన మద్దతుకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరు దేశాల నేతలు తమ సంభాషణ సందర్భంగా భారత్-ఖతార్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలన్న తమ నిబద్ధతను మరోసారి చాటుకున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ఖతార్ అమీర్ భారత పర్యటన సందర్భంగా తీసుకున్న కీలక నిర్ణయాలను త్వరితగతిన అమలు చేయాలనే సంకల్పాన్ని కూడా వారు పునరుద్ఘాటించారు.

## రాజధాని అమరావతిలో

# భూ కేటాయింపులపై కీలక నిర్ణయం

ఇక 3. 5 కిలోమీటర్ల ఈ3 రోడ్డు ఎలివేటెడ్ రోడ్డుకు సైతం అనుమతి ఇచ్చిందని ఆయన వివరించారు. ఈ 15,13 రహదారులను జాతీయ రహదారికి అనుసంధానం చేసేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. వీటిని రూ.70, రూ.387 కోట్లలో చేపట్టేందుకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. జీవోఎంలోనూ వివిధ సంస్థలకు భూ కేటాయింపులు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. అయితే లా యూనివర్సిటీకి 50 ఎకరాలు.. క్వాంటం వ్యాలీకి 50 ఎకరాలు.. బసవ తారకం ఆస్పత్రికి అదనంగా మెడికల్ కాలేజీకి 6 ఎకరాలు కేటాయింపులు చేయాలని నిర్ణయించామని చెప్పారు. గతంలో ఈ సంస్థకు 15 ఎకరాలు కేటాయింపు జరిగిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆదాయపు పన్ను శాఖకు 0.78 ఎకరాలు, రెడ్ క్రాస్ సొసైటీకి 0.78, కోస్టల్ బ్యాంకుకు 0. 40 ఎకరాల కేటాయించామన్నారు. ఐఆర్సిటీసికి ఎకరా భూమి కేటాయింపు చేశామని తెలిపారు. ఈ రోజు 7 సంస్థలకు భూ కేటాయింపులను మంత్రుల కమిటీ నిర్ణయించిందన్నారు. గతంలో 64 సంస్థలకు భూ కేటాయింపులు జరిగాయని చెప్పారు. ఇప్పటి వరకూ రాజధాని ప్రాంతంలో 1050 ఎకరాల మేర భూ కేటాయింపులు జరిగాయని మంత్రి పి.నారాయణ వివరించారు.

# కేసీఆర్‌ను దూషిస్తే నాలుక చీరేస్తాం..

మొదటి పేజి తరువాయి



పరిపాలన చేతగాకపోతే తప్పుకో.. రాజీనామా పెట్టు నాతో అయితలేదు అని.. ఢిల్లీకి మూటలు పంపుడు.. ఇక్కడ మేనేజ్ చేసుడు నాతోటి అయితలేదు అని, చేతులేత్తేస్తున్నా.. ఐపీ డిక్లేర్ చేస్తున్న అని వెళ్లిపో. అంతేకానీ తెలంగాణను తిడుతా అంటే ఇన్నాళ్లు ఉపేక్షించాం.. ఇక నుంచి ఊరుకోం అని కేటీఆర్ తేల్చిచెప్పారు. చివరిసారి చెబుతున్నాం.. కేసీఆర్‌ను ఇప్పటిదాకా ఎన్ని మాటలు అన్న పడ్డాం. ఇక నుంచి కేసీఆర్‌ను వ్యక్తిగతంగా దూషిస్తే మాత్రం నాలుక చీరేస్తాం.. ఆ రోజు కూడా వస్తది.. తప్పకుండా యాది పెట్టుకో. ఎవ్వడు వందల సంవత్సరాల కోసం పుట్టలేదు.. ఎవ్వడు వేల సంవత్సరాలు ఉండడు. పక్కా చెబుతున్నాం ముమ్మాటికీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే. నీ దిక్కుమాలిన పరిపాలన వల్ల అతలాకుతలమైన తెలంగాణను మళ్లా గాడిన పెట్టే సత్తా ఉన్న నాయకుడు కేసీఆరే. అడ్డమైన హామీలు ఇచ్చినందుకు క్షమాపణ చెప్పి తప్పుకో.. రాష్ట్రాన్ని నిందించడం, దూషించడం మానుకోవాలని చెబుతున్నాను అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు.

# యుద్ధానికి సిద్ధమా.. తర్వాత పరిస్థితి ఏమిటి

మొదటి పేజి తరువాయి

దానిని ఆపే శక్తి ఆ యుద్ధాన్ని ప్రారంభించిన ఆ దేశాల చేతుల్లో ఉండదన్న విషయం కూడా విధితమే. అందుకు గత చరిత్రలోనే కాదు.. ప్రస్తుతం రష్యా, ఉక్రెయిన్ల మధ్య జరుగుతోన్న యుద్ధాన్ని పరిశీలిస్తే పరిస్థితులు ఇట్టే బోధపడతాయి. దాదాపు 1990లో ఓ సంస్థ సర్వే ప్రకారం పాకిస్థాన్ తో సుమారు 1000 గంటలపాటు భారత్ యుద్ధం చేస్తే.. అందుకు రూ. 27 వేల కోట్ల ఖర్చవుతుందని ఓ అంచనా. దాదాపు 4 దశాబ్దాల క్రితం జరిగిన తర్వాత ఈ సర్వేను పరిశీలిస్తే.. ప్రస్తుతం ఇదే సమయంలో పాక్ తో యుద్ధానికి దిగితే భారత్ కు అయ్యే ఖర్చు విలువ దాదాపు కొన్ని వందల రెట్లు పెరిగే అవకాశముంది. నాడు యుద్ధ ఖర్చు వేల కోట్లలో ఉంటే.. నేడు అది లక్షల కోట్లలోకి ఎగబాకిందన్నది సుస్పష్టం. అలాగే పాకిస్థాన్ కు సైతం దాదాపుగా ఇదే రీతిలో ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కానుంది.

### ఆ రంగానికే భారీగా నిధులు..

అలాగే ప్రతి ఏటా బడ్జెట్ కేటాయింపుల్లో రక్షణ రంగానికి భారీగా కేంద్రం నిధులు కేటాయిస్తుందన్న సంగతి అందరికీ తెలిసిందే. గతేడాది అంటే.. 2024-25 మధ్య రక్షణ రంగానికి రూ. 6.21 లక్షల కోట్లు కేటాయించింది. ఒకవేళ యుద్ధం జరిగితే మాత్రం ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుదన్నది ఎవరు కాదనలేని సత్యం. ఇక భారత్ లో విదేశీ మారక నిల్వలు సైతం రూ.681.15 బిలియన్ డాలర్లు ఉన్నాయి. ఇవి కూడా యుద్ధ అగ్ని గుండంలో సమిధ కాక తప్పదనే వాదన కూడా వినిపిస్తోంది.

### ఒక వేళ యుద్ధం జరిగితే మాత్రం..

ఈ యుద్ధం కారణంగా రెండు దేశాల్లోని దాదాపు అన్ని రంగాలపై పన్నులు విధించే అవకాశముంది. ఇది సామాన్యుడిపై సైతం భారం పడే అవకాశముంది. ఇది ప్రపంచ మార్కెట్ లో భారత్ తయారు చేసే ఉత్పత్తులపై పడే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్ లో జీఎస్టీ పేరిట ప్రతి దానిపై పన్ను పోటు తప్పడం లేదు. ఇక యుద్ధం జరిగితే మాత్రం పన్ను పోటు అలా ఇలా కాదు.. ఓ రేంజ్ లో ఉంటేందనే వాదన ఉంది.



అలాగే సబ్సిడీ మీద ప్రభుత్వం పలు పథకాలను అందిస్తోంది. వీటికి సైతం దాదాపుగా కోత పడే అవకాశముంది. అలాగే రుణాల కోసం అంతర్జాతీయ ద్రవ్య నిధుతోపాటు ప్రపంచ బ్యాంకుల ముందు ఈ దేశాలు మోకరిల్లే పరిస్థితి ఏర్పడుతోంది.

### వార్ ట్యాక్స్ అంటే..

యుద్ధం అంటేనే విపత్కర పరిస్థితుల్లో చోటు చేసుకుంటుంది. సాధారణ సమయంలో ప్రజలపై పన్నులను ప్రభుత్వం విధిస్తోంది. కానీ యుద్ధం జరిగితే మరిన్ని నిధులు ప్రభుత్వానికి అత్యవసరమవుతాయి. అలాంటి వేళ.. వార్ ట్యాక్స్‌ను ప్రభుత్వం విధిస్తుంది. అది కూడా ఎందుకంటే.. ఇంకా సోదాహరణగా చెప్పాలంటే.. సైనికులు కోసం.. యుద్ధ సామాగ్రి కోసం, వారికి ఆహారం అందించడం కోసం, సైనికులను తరలించేందుకు తదితర అంశాలు చాలా ఖర్చుతో కూడిన వ్యవహారం. అందుకు భారీగా నిధులు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వార్ ట్యాక్స్ విధించే అవకాశముంది.

### ఇప్పటికే పరిస్థితి దారుణం..

ఇప్పటికే భారత్, పాకిస్థాన్ ల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇరుదేశాలూ పలు ఆంక్షలు విధించుకున్నాయి. అందులో భాగంగా ఇరు దేశాలు తమ గగనతలంలో ప్రత్యర్థి దేశాల విమాన రాకపోకలపై నిషేధం విధించుకున్నాయి. ఈ కారణంగా భారత్ నుంచి యూరప్, బ్రిటన్, ఉత్తర అమెరికా దేశాలకు వెళ్లే విమానాలు.. పాక్ గగన తలం నుంచి కాకుండా.. మరో మార్గం ద్వారా పయనిస్తున్నాయి. ఈ విధంగా నిషేధం విధించిన కొద్ది రోజులకే ఇరు దేశాల విమానయాన సంస్థలకు బిలియన్ల డాలర్ల మేర నష్టం వాటిల్లిన సంగతి అందరికీ తెలిసిందే. ఆయా విమానాల దూరాభారం పెరగడం, అధిక సమయం ప్రయాణించడంతోపాటు విమానయాన సంస్థలకు అదనపు సిబ్బందిని ఉద్యోగాల్లోకి తీసుకోవాల్సి ఉంది. తద్వారా ఏడాదికి రూ. 6 వందల మిలియన్ల మేర ఖర్చవుతోందని అంచనా వేస్తున్నారు.

ఒక్కటి కాదు.. అన్ని రంగాలకు దెబ్బే..

మరోవైపు గతంలో పాక్ తో చేసుకున్న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది. ఈ సింధు జలాలతోపాటు దాని ఉపనదుల నీటిని సైతం పాక్ లో పంటల సాగుకు వినియోగిస్తారు. ఈ నీరు ఆ దేశానికి వెళ్లక పోవడంతో.. ఆ దేశంలో పంట భూములు ఏడారిగా మారే అవకాశముంది. యుద్ధం జరిగితే.. అది కాశ్మీర్ పర్యటకంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కాశ్మీర్ పర్యాటకంపై వేలాది కుటుంబాలు జీవనోపాధిని పొందుతున్నాయి. అవి సైతం కోల్పోయే పరిస్థితి ఏర్పడనుంది. దీంతో రాష్ట్రంలో ఆదాయం భారీగా తగ్గనుంది. ఏదీ ఏమైనా యుద్ధం జరిగితే మాత్రం.. ఆ ప్రభావం ప్రజలపై పన్నుల రూపంలో నడ్డి విరచనున్నాయన్నది ఎవరి కాదనలేని సత్యం. ఎందుకంటే.. యద్దంలో గెలిచినా.. ఓడినా ఆ ప్రభావం ఆ దేశ ప్రజలపై ఏదో రూపంలో ప్రభావం చూపనున్నదన్నది సుస్పష్టం.

### ఆ దిశగా భారత్ చర్యలు..

ఇక యుద్ధం ప్రారంభించడం కంటే.. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశం తాలుకా ఆర్థిక మూలాలపై వేటు పడేలా చర్యలు తీసుకోవాలి. అలా అయితేనే ఆ దేశం తాలుకా ఉగ్ర వాద కోరలను పీకినట్లవుతోంది. ఆ దిశలోనే భారత్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులోభాగంగానే.. ఇప్పటికే సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. పాక్ విమానాలను భారత్ గగనతలంలోకి రాకుండా అడ్డుకొంది. అలాగే అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి నిధులు సరఫరా ఆగిపోయేలా భారత్ అడుగులు వేస్తోంది.

## కొత్త రేషన్ కార్డులకు అప్లై చేసుకోండి

# - నెల రోజులు మాత్రమే గడువు

మొదటి పేజి తరువాయి

బుధవారం నుంచి (మే 7వ తేదీ) రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు జారీకి దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. కొత్త కార్డులు జారీ, రేషన్ కార్డులు స్ప్లిట్, కొత్త సభ్యుల చేరిక, చిరునామా మార్పులు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. 3.28 లక్షల దరఖాస్తులు రేషన్ కార్డు మార్పు కోసం వచ్చాయని తెలిపారు. నెల పాటు కొత్తగా దరఖాస్తులు చేసుకోవచ్చు: స్మార్ట్ రేషన్ కార్డు, క్యూ ఆర్ కోడ్?తో జారీ చేస్తామన్నారు. కుటుంబసభ్యుల పేర్లు అన్నీ చక్కగా కనిపించేలా స్మార్ట్ కార్డు జారీ ఉంటుందని మంత్రి వెల్లడించారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే గడిచిన ఆరు నెలలుగా రేషన్ తీసుకున్న వివరాలు కనిపించేలా ఉంటుందన్నారు. దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఈ కార్డు వెసులుబాటు కల్పిస్తుందన్నారు. ఒక నెల పాటు కొత్తగా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. వచ్చే నెల నుంచే స్మార్ట్ కార్డులు: గ్రామ వార్డు సచివాలయాలకు వెళ్లి పౌరులు తమ వివరాలు తెలుసుకోవచ్చన్నారు. 4.24 కోట్ల మందికి స్మార్ట్ కార్డు జారీ అవుతుందని అన్నారు. జూన్ మాసం నుంచే స్మార్ట్ కార్డులు జారీ అవుతాయన్నారు. ప్రస్తుతం 95 శాతం మేర ఈ-కేవైసీ పూర్తి అయ్యిందని, ఈ-కేవైసీ పూర్తి అయిన వాళ్లు కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని అన్నారు. వాట్సప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు: వాట్సప్ గవర్నెన్స్ ద్వారాను ఈ నెల



12వ తేదీ తర్వాత దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రేపటికి పూర్తి వివరాలు అందుతాయని తెలిపారు. అకాల వర్షంతో రైతులకు పంట నష్ట పరిహారం అందరికీ అందజేస్తామన్నారు. ఇప్పటి వరకూ 1.50 కోట్ల మందికి దీపం పథకం ద్వారా లబ్ధి కలిగిందన్నారు. పాఠశాలలకు 25 కేజీల ఫైన్ క్వాలిటీ రైస్ ఈ ఏడాది నుంచి సరఫరా చేయబోతున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడంచారు. రైతులు ఆందోళన చెందొద్దు: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతుల ఆందోళన చెందవద్దని నాదెండ్ల మనోహర్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని కలెక్టరేట్?లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ధాన్యం కొనుగోలుపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు సందర్భంగా ఎదురవుతున్న ఇబ్బందులపై అధికారులతో చర్చించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పశ్చిమగోదావరిలో 7.5 లక్షల టన్నులు ధాన్యం ఉత్పత్తి అంచనా వేయగా, ఇప్పటివరకు 5.5 లక్షల టన్నులు కొనుగోలు చేశామని అన్నారు. రైతులకు రూ.1180 కోట్లు జమ చేశామన్నారు. అదనంగా లక్ష టన్నులు కొనుగోలు చేయడానికి అనుమతించామన్నారు. ఏలూరు జిల్లాలో 3.55 లక్షల టన్నులు పుట్టపర్తి అవుతుందని అంచనా వేయగా, ఇప్పటివరకు 2.20 లక్షల టన్నులు కొనుగోలు చేసి, రైతులకు రూ.487 కోట్లు జమ చేశామని మంత్రి మనోహర్ తెలిపారు. అదనంగా 50 వేల టన్నులు కొనుగోలుకు అనుమతి మంజూరు చేశామని తెలిపారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, దీనిపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

# తెలంగాణకు 4000 సోలార్ పవర్ ప్లాంట్లు కేటాయించండి..

మొదటి పేజి తరువాయి

నేడు కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ని కలిసి మూడు ముఖ్యమైన వినతిపత్రాలు అందజేశారు. దేశంలోనే అత్యంత వేగంగా పురోగమిస్తూ, అన్ని రంగాల్లో సత్తా చాటుతున్న తెలంగాణ రాష్ట్రానికి తగు రీతిలో కేంద్రం సహాయ, సహకారాలు అందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర మంత్రిని కోరారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమర్పించిన వినతుల వివరాలు ముందే నిర్ణయించిన విధంగా పిఎం కుసుం కంపోనెంట్ ఎ కింద 500 నుండి 2 ల సామర్థ్యం కలిగిన మొత్తం 4 వేల మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన కోసం విజ్ఞప్తి ఎంఎన్ఆర్ఈ ముందే నిర్ణయించినట్లుగా పిఎం కుసుం కంపోనెంట్ ఎ కింద 500 ల సామర్థ్యం కలిగిన మొత్తం 4 వేల మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి విన్నవించారు. ఎంఎన్ఆర్ఈ ఈఓఐ పీరియడ్ ప్రకారం పునః సమీక్ష అనంతరం కేటాయింపులను 4000 మెగావాట్ల నుండి 1000 మెగావాట్లకు తగ్గించి ఇవ్వాలని సమాచారం అందిందని అలా తగ్గించి ఇస్తే రాష్ట్రం నిర్ధారించుకున్న లక్ష్యాల పై తీవ్ర ప్రభావం పడే పరిస్థితులున్నందున కేంద్రం ఆచుతూచి వ్యవహరించాలని కోరారు. పునరుత్పాదక ఇందన రంగంలో తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ఫలితాలను దృష్టిలో వుంచుకుని కేటాయింపులు చేయాలని డిప్యూటీ సీఎం కేంద్రమంత్రిని కోరారు.



### పిఎం కుసుం కంపోనెంట్ (బి) కింద ఒక లక్ష సౌర పంపు సెట్ల కేటాయింపుల కోసం వినతి

రాష్ట్రంలోని వ్యవసాయరంగానికి సాగునీటి కల్పనకు శాశ్వత పరిష్కారంగా సౌర పంప్‌సెట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్రం భావిస్తున్నదనీ ఈ నేపథ్యంలో పిఎం కుసుం కంపోనెంట్ బి కింద 1 లక్ష సౌర పంపు సెట్లను స్థాపించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కోరారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డిపిఆర్ ను ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని తెలిపారు. రాష్ట్ర వాటా నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్లు కేంద్రమంత్రికి వివరించారు. గిరిజనుల సాగు భూముల్లో విద్యుత్ లైన్ల స్థాపనకు అటవీ చట్టాలు ఆటంకంగా వున్నందున ఈ దిశగా కేంద్రం సహృదయంతో సహకరించాలని ఉప ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరారు.

3. పిఎం కుసుం కంపోనెంట్ సి కింద 2 లక్షల పంపు సెట్ల కేటాయింపు కోసం వినతి

పిఎం కుసుం కంపోనెంట్ సి కింద తెలంగాణ రాష్ట్రానికి 2 లక్షల పంపు సెట్లన కేటాయించాలని ఉప ముఖ్యమంత్ర భట్టి విక్రమార్క కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో 28 వ్యవసాయరంగ సాగునీటి అవసరాల కోసం లక్షల పంపు సెట్లు వినియోగంలో వున్నందున సాంప్రదాయ విద్యుత్ రంగం పై భారాన్ని నివారించేందుకు గాను వీటి అవసరాన్ని కేంద్రమంత్రికి వివరించారు. వ్యవసాయరంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యుత్తమ వార్షిక పురోగతి రేటును సాధించడంతో పాటు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో రైస్ బౌల్ ఆఫ్ ఇండియా గా అవతరించిన విషయాన్ని ఉప ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. రైతు భరోసా వంటి ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలను అమలు చేస్తూ, వ్యవసాయరంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా నిబద్ధతతో పనిచేస్తున్న రాష్ట్రానికి కేంద్ర సహకారం తోడైతే మరిన్ని అద్భుతాలు చేసేందుకు వీలవుతుందని వివరించారు.

# రేషన్ కార్డులు లేనివారికి శుభవార్త చెప్పిన ఏపీ ప్రభుత్వం

రేపటి నుంచి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూడా అనుమతి

క్యూఆర్ కోడ్, ప్రభుత్వ చిహ్నంతో స్మార్ట్ కార్డుల జారీ

నెల రోజుల పాటు దరఖాస్తు ప్రక్రియ...

గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు

ఈ నెల 12 నుంచి వాట్సాప్

గవర్నెన్స్ ద్వారా కూడా దరఖాస్తుల స్వీకరణ

ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ కార్డులు లేని వారికి కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రేపటి (మే 7) నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. దీంతో పాటు, ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులలో అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకునేందుకు కూడా వీలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించిన వివరాల ప్రకారం, కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు, ఇప్పటికే ఉన్న కార్డులలో సభ్యుల చేరిక, తొలగింపు, చిరునామా మార్పులు, కార్డుల విభజన వంటి సవరణలకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రేషన్ కార్డులలో మార్పుల నిమిత్తం



ఇప్పటికే 3.28 లక్షల దరఖాస్తులు అందాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, తగిన మార్పులు చేపట్టనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, ప్రభుత్వం జారీ చేయనున్న నూతన స్మార్ట్ రేషన్ కార్డుల గురించి మంత్రి వివరిస్తూ, "ఈ కార్డులు క్యూఆర్ కోడ్ సెక్యూరిటీ ఫీచర్‌తో వస్తాయి. గతంలో మాదిరిగా ప్రభుత్వాధినేతల ఫోటోలు లేకుండా, కేవలం ప్రభుత్వ అధికారిక చిహ్నంతోనే ఈ స్మార్ట్ కార్డులను జారీ చేస్తాం" అని తెలిపారు. కుటుంబ సభ్యుల పేర్లు స్పష్టంగా కనిపించేలా కార్డుల రూపకల్పన ఉంటుందని, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా గత ఆరు నెలల రేషన్ తీసుకున్న వివరాలు తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నెల రోజుల పాటు కొనసాగుతుందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియజేశారు. అర్హులైన పౌరులు తమ సమీపంలోని గ్రామ లేదా వార్డు సచివాలయాలను సందర్శించి, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ నెల నుంచి కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటికే 95 శాతం ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిందని, ఈ-కేవైసీ పూర్తి చేసుకున్న వారు కార్డుల్లో మార్పుల కోసం కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి వాట్సాప్ గవర్నెన్స్ విధానం ద్వారా కూడా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మంత్రి తెలిపారు. అంతేకాకుండా, దేశంలో ఎక్కడైనా రేషన్ సరుకులు పొందేందుకు వీలు కల్పించినట్లు ఆయన గుర్తుచేశారు.

# సంపాదకీయం

## సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా

ఈ మధ్య విడుదలైన 'వార్షిక విద్యాస్థితి నివేదిక 2021) ప్రకారం తెలంగాణలో ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న దాదాపు సగం మంది విద్యార్థులు రెండో తరగతి పుస్తకాన్ని చదవడంలో విఫలం అయ్యారు. 2014లో కేవలం 27 శాతంగా ఉన్న ఈ పరిస్థితి 2024 నాటికి 50 శాతానికి పెరిగింది. విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు ఏ మేరకు సాధించబడ్డాయో ఈ నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. ఈ నివేదికలో బిహార్, ఛత్తీస్ గఢ్, జార?ండ్ వంటి రాష్ట్రాల కంటే తెలంగాణ దిగువ స్థానంలో నిలవడం విచారకరం. జాతీయస్థాయిలో ప్రతి ఏడాది నిర్వహించే 'నేషనల్ అచీవ్మెంట్ సర్వే'లోనూ మన రాష్ట్రానిది ఇదే పరిస్థితి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 'పాఠశాలల పనితీరు గ్రేడింగ్ సూచిక'లో తెలంగాణ క్రింది నుంచి ఆరో స్థానంలో ఉండడం మన విద్యావ్యవస్థపై జరిగిన విధ్వంసం స్థాయిని కళ్లకు కట్టి నట్లుగా చూపుతోంది. కర్ణుడి చావుకి సవాలక్ష కారణాలు అన్నట్టు విద్యారంగంలో ఈ పరిస్థితి నెల కొనడానికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో ప్రధానమైనది. విద్యపై గత పాలకుల నిర్లక్ష్యం. టీచర్ల నియామకాన్ని బీఆర్ఎస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇక ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల సంగతి సరేసరి, డీఈవో, డిప్యూటీ ఈవో, ఎంఈఓ వంటి పర్యవేక్షణాధికారుల పోస్టులను భర్తీ చేయలేదు. దీంతో బడులపై పర్యవేక్షణ కరువైంది. నాటి ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించిన కేజీ టు పీజీ విద్య కేవలం ఆ పార్టీ నాయకుల జేబులు నింపడానికే అన్నట్టు మారింది. కేజీబీవీ, సర్వశిక్షా అభియాన్, అంగన్వాడీలలో పని చేస్తున్న ఉద్యోగులను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల పట్ల అవమానకరంగా వ్యవహరించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంతో నాది ప్రత్యేక అనుబంధం. నేను ఎమ్మెల్యేగా గెలిచాక ఓ కార్యక్రమం కోసం యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీకి వెళ్ళాను. ఒకప్పుడు నేను చూసిన ఓయూ వేరు. ఇప్పటి ఓయూ వేరు. గురువులు లేక చాలా డిపార్ట్మెంట్లు మూతపడ్డాయి. ఉస్మానియా యూనివర్సిటీ పరిస్థితే ఇలాఉంటే ఇక మిగిలిన కాకతీయ, తెలంగాణ, పాలమూరు,మహాత్మాగాంధీ వంటి యూనివర్సిటీల పరిస్థితి చెప్పనవసరం లేదు. ఉద్యమ సమయంలో ప్రొఫెసర్లతో కలిసి నడిచిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక కనీసం అపాయింట్ మెంట్ కూడా ఇవ్వకుండా వారిని అవమానపరిచారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదం ప్రాతిపదికనే తెలంగాణ ఉద్యమం కొనసాగింది. కేసీఆర్ ఇంట్లో అందరికీ నియామకాలు జరిగాయి. కానీ రాష్ట్రంలోని నిరుద్యోగులకు మాత్రం శూన్యమే మిగిలింది. 'అణగారిన బతుకుల్లో వెలుగులు నింపేది విద్య' అనే అంబేద్కర్ సిద్ధాంతాన్ని బలంగా నమ్మే కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న విద్యారంగాన్ని చక్కదిద్దే ప్రయత్నాలు మొదలుపెట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్లో విద్యాశాఖకు 23,108 కోట్లు కేటాయించడం ఈ ప్రభుత్వానికి విద్యారంగం పట్ల ఉన్న చిత్త శుద్ధికి నిదర్శనం. టీచర్స్ పదోన్నతులు, బదిలీలను చేపట్టింది. విద్యా రంగాన్ని పునరుద్ధరించడానికి 2024 సెప్టెంబర్ 4న తెలంగాణ విద్యా కమిషన్ను ఏర్పాటు చేసింది. దీనికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని చైర్మన్ గా నియమించింది.అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే దాదాపు యాభై వేలకు పైచిలుకు ఉద్యోగా లకు పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చింది. అందులో టీచర్, లెక్చరర్ ఉద్యోగాలు కూడా ఉన్నాయి. చరిత్రలో నిలిచేలా రాష్ట్రంలో 58 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల'లను నెలకొల్పాలని సంకల్పించడం ఓ శుభ పరిణామం, రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లు, కస్తూర్బా పాఠశాలల్లో డైట్ చార్జీలను పెంచింది. రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు వీసీలను నియమించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి సంబంధించిన మార్గదర్శకాలకు కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కేంద్రీయ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లతో సమానంగా మన రాష్ట్ర ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయస్సును 6న కు పెంచింది. యువతలో నైపుణ్యాలు పెంపొం దించాలనే ప్రణాళికతో రాష్ట్రంలో "స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రారంభించింది. ఉద్యోగ నియామకాల క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాల కల్పనపై తనకున్న చిత్తశుద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం చాటుకుంది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. అయితే.. విద్య అనేది సమాజ ఉమ్మడి ప్రయత్నాల ద్వారా విజయవంతమయ్యే కార్యక్రమం. కాంగ్రెస్ పాలనలో ఒక యజ్ఞంలా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో విద్యావంతులు, మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలి. అప్పుడే సంపూర్ణ ఫలాలు

# బడుగుల బంధువు కాదు.. బరువు



బడుగు, బలహీన వర్గాల పోరాటానికి, ఆకాంక్షలకు కులగుణన రూపంలో పాక్షిక విజయం లభించింది. ఎవరు ఎంతో వారికంత అన్న న్యాయమైన డిమాండ్ సాధన కోసం ఈ దేశంలోని బహుజనులు దశాబ్దాల నుంచి గళమెత్తుతున్నారు, ఉద్యమిస్తున్నారు. ఏ రాజకీయ ప్రయోజనాల కోసమైతేనేమీ ఎట్టకేలకు కులగణనకు కేంద్రం ఒప్పుకోవడం బీసీలు సాధించిన చరిత్రాత్మక విజయమే. అయితే ఈ గెలుపును తమ ఖాతాలో వేసుకోవడానికి కాంగ్రెస్, బీజేపీలు ఆడుతున్న క్రెడిట్ గేమ్‌ను, పడుతున్న తాపత్రయాన్ని చూస్తుంటే నవ్వొస్తున్నది. అగ్రవర్ణాల ప్రయోజనాలే పరమావధిగా ఉన్న ఈ రెండు జాతీయ పార్టీలకు బహుజనుల పట్ల కొత్తగా పుట్టుకొచ్చిన ప్రేమలోని ఆంతర్యాన్ని, బీసీ హక్కులు, డిమాండ్ల అమలు విషయాల్లో ఆయా పార్టీలు వేసిన రాజకీయ కుప్పిగంతులను బడుగు బలహీన వర్గాలు గుర్తించడం లేదనుకోవడం ఆ రెండు పార్టీల అమాయకత్వానికి నిదర్శనం. స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్ల నుంచి దళిత, గిరిజనులతో పాటు అటుఇటు గా బడుగుల జీవితాలు కూడా పేదరికంలో మగ్గిపోతుండటం, రాజకీయ-ఉద్యోగ అవకాశాలకు ఆమ డదూరంలో నిలవడమన్నది జగమెరిగిన సత్యం. కులగణన పేరుతో బడుగుల పట్ల ప్రేమ నటిస్తున్న కాంగ్రెస్, బీజేపీలు ఏడున్నర దశాబ్దాల నుంచి దేశాన్ని పాలిస్తున్నాయి. కానీ బడుగుల సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ, ఉద్యోగ, విద్యా అవకాశాల కల్పనను ఆ రెండు పార్టీలు ఓటు బ్యాంకుగా మాత్రమే చూశాయనడంలో ఎలాంటి సందేహం లేదు. బీసీల ఆకాంక్షలు, సమస్యల పట్ల ఈ రెండు పార్టీలకు సైద్ధాంతిక అవగాహన, ప్రాతిపదిక లేనే లేవు. దాదాపు 50 ఏండ్ల పాటు మైనారిటీలు, దళితులను ఓటు బ్యాంకుగా వాడుకున్న కాంగ్రెస్, ఆయా సెక్షన్లలో తమ ఆటలు సాగడం లేదని తెలిసిన తర్వాతే, ఇప్పుడు బహుజన వాదాన్ని నెత్తికెత్తుకుని కపట నాటకానికి శ్రీకారం చుట్టింది. 60 ఏండ్ల పాటు బహుజన వాదం గురించి పల్లెత్తు మాట కూడా మాట్లాడకుండా బీసీలకు కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచింది. తమ హయాంలో 11 సార్లు జనాభా లెక్కలు తీసినప్పటికీ ఒక్కసారి కూడా కులగణన చేపట్టాలనుకోకపోవడం ఆ పార్టీ సైద్ధాంతిక ఆత్మవంచనకు నిదర్శనం. తమ ప్రభు త్వం కూలిపోయాక వచ్చిన మండల్ కమిషన్, దాని సిఫారసుల అమలుపై 1990 సెప్టెంబర్ 6న లోక్‌సభలో రాజీవ్‌గాంధీ చేసిన ప్రసంగాన్ని ఈ దేశంలోని ఏ బీసీ కూడా కలలో కూడా మరిచిపోడు. మండల్ కమిష న్ సిఫారసులను అమలు చేసి 27 శాతంబీసీలకు రిజర్వేషన్ ఇస్తే దేశం విచ్ఛిన్నమవుతుంది, కులయుద్ధాలు వస్తాయన్న రాజీవ్‌గాంధీ వ్యాఖ్యలు బహుజన చరిత్రలో అతిపెద్ద ద్రోహంగా మిగిలిపోతాయి. ఇంతేకాదు కులాల ఆధారంగా కాకుండా ఆర్థిక ప్రమాణాల ఆధారంగా రిజర్వేషన్లు ఉండాలని రాజీవ్ సూచించారు. రాజీవ్ ప్రసంగం తర్వాతనే ఉత్తర భారతదేశంలో ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బీహార్‌లలోని ఓబీసీలు కాంగ్రెస్‌కు దూరమయ్యారు. అక్కడ కొత్త ఓబీసీ రాజకీయశక్తులు పుట్టుకొచ్చాయి. కులాలవారీగా కాకుండా ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండాలని మూడున్నర దశాబ్దాల కింద ప్రకటించిన కాంగ్రెస్‌కు రిజర్వేషన్ల అసలు లక్ష్యం, ఉద్దేశం ఇప్పటికీ అర్థం కాలేదు. ఈ రోజు బహుజనుల పట్ల ఎక్కడ లేని ప్రేమను నటిస్తున్న కాంగ్రెస్, 50 ఏండ్ల క్రితమే బీసీలకు తగిన రాజకీయ, విద్య, ఉపాధి అవకాశాలు కల్పించి ఉంటే ఈనాడు రాహుల్‌గాంధీ పాదయాత్ర చేయాల్సిన అవసరం ఉండేది కాదు. కులగణన ప్రకటనను కేంద్ర ప్రభు త్వం చేసిన వెంటనే రాహుల్‌గాంధీ ఒక్కడితోనే ఇది సాధ్యమైందన్న కాంగ్రెస్ వాదనలో ఆవగింజంత నిజం కూడా లేదు. బీజేపీ మత ఎజెండాను ఎదుర్కోవడానికి, తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు గతాన్ని మరచిపోయి, బహుజనవాదంతో లభించే ఓట్ల కోసమే రాహుల్‌గాంధీ ఈ డ్రామాలు ఆడుతున్నాడు. రాహుల్‌గాంధీ కులగణన రాగం ఎత్తుకున్న తర్వాత రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్‌లో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ ఆయా రాష్ట్రాల్లో కులగణన ఎందుకు చేపట్టలేదో కర్ణాటకలో పదేండ్ల కిందట జరిగిన కులగణనను ఇప్పటికీ ఎందుకు బయటపెట్టడం లేదో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణ న సర్వేను మోడల్‌గా రాహుల్‌గాంధీ చెప్పడం ఆ పార్టీ సిగ్గులేనితనానికి నిదర్శనం. జనాభాకు అనుగుణంగా అవకాశాల కేటాయింపునే కోరుతున్న బహుజనుల దీర్ఘకాలిక డిమాండ్‌ను తుంగలో తొక్కి, అనుకూల సామాజికవర్గాల సంఖ్యను కృత్రిమంగా పెం చేందుకు సర్వేను వాడుకున్నారు. లక్షలాది మంది బహుజనుల సంఖ్యను తక్కువగా చూపించి జరిగిన అన్యాయాన్ని తెలంగాణ మోడల్‌గా దేశవ్యాప్తంగా ప్రచారం చేయడం విడ్డూరం. 75 ఏండ్లుగా బహుజనుల ఆకాంక్షలను పట్టించుకోకుండా దారుణంగా మోసం చేసినందుకు బీసీలకు రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి. అప్పుడే కాంగ్రెస్ చేసిన పాపాలకు కొంతైనా ప్రాయశ్చిత్తం కలుగుతుంది. ఒక వ్యక్తిని, వ్యవస్థను అర్థం చేసుకోవాలంటే వారి చరిత్ర కూడా అధ్యయనం చేయాలి. అప్పుడే వారి నినాదాల వెనుకున్న ప్రయోజనాలు, అజెండాల వెనుకున్న మర్మాలను గుర్తించవచ్చు. కాంగ్రెస్ కొత్తగా ఎత్తుకున్న బహుజన నినాదం పట్ల ఈ దేశ బీసీలు జాగ్రత్తగా ఉండాలి. అట్లనే మోదీ కులగణన అజెండాలోని మర్మాన్ని అర్థం చేసుకోవాలి. మహా త్మా పూలే సినిమా విడుదల విషయంలో కేంద్రంలో ని బీజేపీ ప్రభుత్వ యంత్రాంగం, వ్యవస్థలు వ్యవహరించిన తీరును చూసిన తర్వాత కులగణన నిర్ణయం, ఆ తర్వాతి ఫలితాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవడానికి పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు. ఇప్పటికే అనేకసార్లు ఆ రెండు పార్టీల చేతిలో మోసపోయిన బీసీ బిడ్డలు తమ నిజమైన మిత్రులు ఎవరో తెలుసుకోవాలి. లేదంటే ఇంకో వందేండ్లు అయినా అగ్రవర్ణ జాతీయ పార్టీల ఎన్నికల అస్త్రాలుగా మాత్రమే బీసీలు మిగిలిపోతారు. తస్మాత్ జాగ్రత్త..


# కగార్‌ను నిలిపివేయాల్సిందే!



మావోయిస్టుల పేరుతో దేశవ్యాప్తంగా సాగుతున్న ఎన్‌కౌంటర్ హత్యాకాండ పతాకస్థాయికి చేరింది. పట్టుకొని బంధించి కాల్చి చంపి ఎన్‌కౌంటర్ అని ప్రకటించే ఆనవాయితీ దేశంలో కొనసాగుతున్నది. ఇలా ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేయడమనేది ఉమ్మడి ఏపీ భూభాగంలో 1924 నుంచి కొనసాగుతున్నది. 1975 ఎమర్జెన్సీ కాలంలో జలగం వెంగళరావు కొనసాగించిన ఎన్‌కౌంటర్ హత్యాకాండతో శ్రీకాకుళంసాయుధ రైతాంగ పోరాటం పూర్తి అణచివేతకు గురైంది. అక్కడినుంచి జగిత్యాల, సిరిసిల్ల జైత్రయాత్రలు అణచివేయడానికి తెలంగాణలోని కొన్ని ప్రాం తాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి 127 సాయుధ క్యాంపులతో అణచివేతను కొనసాగించారు. ఆ తర్వాత వచ్చిన పీపుల్స్‌వార్ ఉద్యమంపై చివరికి నల్లమలలో కొనసాగిన ఉద్యమాలపై ఎన్‌కౌంటర్ హత్యాకాండ కొనసాగుతూ ఉద్యమాలను ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లోనే ఉనికిలో లేకుండాచేసింది. ఆ క్రమంలోనే 1980ల ప్రాం తంలో దండకారణ్యంలో ప్రవేశించిన పీపుల్స్‌వార్ 2004లో మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్‌తో కలిసి మావోయిస్టు పార్టీగా అవతరించిన తర్వాత జార?ండ్, బీహార్, పశ్చిమబెంగాల్ ప్రాంతాల్లో బలమైన ఉద్యమ ప్రాంతాలను నెలకొల్పుకొన్నది. ఆ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం 185 జిల్లాలలో మావోయిస్టు ఉద్యమ ప్రభావం ఉన్నదని ప్రభుత్వ లెక్కలే ప్రజల ముందు పెట్టాయి. కానీ 1990ల నుంచి ప్రారంభమైన దండకారణ్యంలోని ఉద్యమ అణచివేత సల్వాజుడుం, గ్రీన్ హంట్, ఆపరేషన్ సమాధాన్‌లను దాటుకొని నేడు ఆపరేషన్ కగార్‌లో వేలాది బలగాలు చుట్టుముట్టి కాల్చివేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తున్న అత్యంత కడుహీన స్థితికి ప్రభుత్వాలు దిగజారిపోయాయి. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ద్వారా ప్రజలకు ప్రాథమిక హక్కులను హామీ పడ్డ ప్రభుత్వాలు ఆచరణలో ఏమీ లేకుండా చేస్తున్నాయి. చివరికి ఆర్టికల్ 21 ప్రసా దించే జీవించే హక్కు కూడా లేకుండా ఎన్‌కౌంటర్ పేరు తో వేటాడుతున్నాయి. ఇప్పటికే రెండున్నర దశాబ్దాల్లో 16 వేలకు పైగా మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో ప్రభుత్వాలు కాల్చిచంపాయి. ఏ ఎన్‌కౌంటర్‌పై కూడా ఏ రాష్ట్రంలో సరైన న్యాయ విచారణ జరుగకుండానే కేసులు మూతబడిపోతున్నాయి. దీనితో ప్రభుత్వాలు యథేచ్ఛగా పోలీసు బలగాలతో కాల్చి చంపించి ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తున్నాయి. అందుకు అనేక మిలిటరీ ఆపరేషన్ల పేర్లను సాకుగా వాడుతున్నాయి. కానీ, ఇదే ఎన్‌కౌంటర్ హత్యాకాండకు వ్యతిరేకంగా ఉమ్మడి ఏపీలో 1997లో కన్నాభిరాన్ ఆధ్వర్యంలో న్యాయస్థానంలో పోరాటం ప్రారంభించారు. దాని తీర్పులో భాగంగా 2009, ఫిబ్రవరి 6న భాగంగా ఉమ్మడి ఏపీ విస్తృత ధర్మాసనం ఒక బలమైన తీర్పును వెలువరించింది. అది వెలువడిన 6 నెలల కాలం అంటే ఆ తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇచ్చేంత వరకు ఎన్‌కౌంటర్లు జరుగలేదు. ఆ తర్వాత 2014లో పీయూసీఎల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేస్‌లో 16 గైడ్‌లైన్లతో ఇచ్చిన తీర్పును సుప్రీం కూడా ఖరారు చేసి ఉమ్మడి ఏపీ తీర్పును వెనక్కి నెట్టేసింది. ఈ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలోనే ఎన్టీఆర్ కాలంలో 1989లో ఆ ఏడాదే అత్యంత ఎక్కువ గా 275 ఎన్‌కౌంటర్ హత్యలు జరిగాయి. ఆ నేపథ్యంలో తెలంగాణ యువత ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపబడుతున్న స్థితిలోనే రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ ఎస్.ఆర్.శంకరన్ చేసిన దశాబ్దకాల కృషిలో భాగంగానే 2004లో వైఎస్‌ఆర్ ప్రభుత్వానికి, పీపుల్స్‌వార్ పార్టీకి మధ్య శాంతి చర్చలు జరిగాయి. కానీ, ఆ చర్చల్లో కీలక భూమికను పోషించిన భూమి విషయం వచ్చేసరికి రెండవ దఫా చర్చల్లో పరిష్కరించుకుందామని మొదటి దఫా చర్చలను ముగించారు. రెండవ దఫా చర్చలేమో కానీ మళ్లీ నల్లమల అంతా రక్తం ఏరులై పారి చర్చల వాతావరణమే లేకుండా పోయింది. మొత్తంగా ప్రభుత్వాలు ఎవరినైనా చంపాలనుకుంటే ఎన్‌కౌంటర్ ఆయుధాన్ని చాలా బలంగా ఉపయోగించుకుంటాయి. ఇప్పుడు 2024లో ప్రారంభమైన ఆపరేషన్ కగార్ ఒక ఏడాదిలోనే 350కి పైగా ఆదివాసీల హత్యలు, 45 ఎన్‌కౌంటర్లతో మేధావులను, ప్రజా సంఘాలను, ప్రతిపక్ష పార్టీలను ఆందోళను గురిచేయడం గర్హనీయం. ఈ నేపథ్యంలో మధ్య భారతంలో ఒక బలమైన ఉద్యమాన్ని కొనసాగిస్తున్న మావోయిస్టు పార్టీ కూడా తన పేరుతో ఆదివాసీల నర సంహారాన్ని కొనసాగించడాన్ని చూడలేక, సహించలేక చర్చల ప్రక్రియలో తానే ముం దుగా కాల్పుల విరమణ ప్రకటించి నెల రోజులుగా శాంతికోసం ప్రయత్నిస్తున్నది. కానీ, కేంద్రం ఇప్పటివరకు ఆ శాంతి ప్రక్రియపై స్పందించలేదు. ఈ నేపథ్యంలో 20 25, ఏప్రిల్ 27న తెలంగాణలోని ప్రతిపక్ష బీఆర్ఎస్ స్పష్టంగా ఆపరేషన్ కగార్‌ను ఆపాలని ప్రకటించింది. ఈ నేపథ్యంలో చర్చలు కూడా కొనసాగించాలని లక్షలాది జనం ముందు కేసీఆర్ ప్రకటించారు. నిజంగా ఒక ప్రజాస్వామ్య దేశంలో మనుషులను ఎన్‌కౌంటర్ పేరుతో వేటాడి హత్య చేయడమనేది సరైంది కాదు. రాజ్యాం గానికి విరుద్ధం. కార్పొరేట్ల కోసం తన సొంత ప్రజలను శత్రుదేశ ప్రజలుగా చిత్రించి యుద్ధం చేస్తున్న బీజేపీ ప్రభుత్వ హత్యాకాండను అడ్డుకోవాల్సిందే. ఆ నేపథ్యంలోంచే దేశంలోని బుద్ధిజీవులు ప్రజాస్వామికవాదులు, మేధావులు ఆపరేషన్ కగార్‌ను ఆపివేయాలని పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారు. ఆ వైపుగా ప్రభుత్వం ఆలోచించాలి. లేకుంటే ప్రజా తిరుగుబాటు తప్పదు.

# మితవాదానికి మరో ఓటమి

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గమనించుకుంటున్నారో లేదో గానీ ప్రపంచంలో ఎక్కడ ఎన్ని కలు జరిగినా ఆయన చర్చనీయాంశం అవుతున్నారు. గెలుపోటముల్ని ప్రభావితం చేస్తున్నారు. ఇటీవల కెనడా ఎన్నికల్లో ట్రంప్ పట్ల మెతకగా వ్యవహరించిన కన్సర్వేటివ్‌లు ఓటమిపాలై, ఊహించని రీతిలో అధికార లిబరల్ పార్టీ గెలుపొందింది. ఇప్పుడు ఆస్ట్రేలియాలోనూ అదే జరిగింది. అచ్చం ట్రంప్ విధానాలనే అనుకరిస్తూ ఆస్ట్రేలియా ఎన్నికల్లో తిరుగులేని గెలుపు సాధించాలనుకున్న విపక్ష కన్సర్వేటివ్ పార్టీ అపజయాన్ని మూటకట్టుకోవటమే కాదు... ఆ పార్టీ గెలిస్తే ప్రధాని అవుతారనుకున్న నాయకుడు పీటర్ డటన్ సైతం ఓటమి పాలయ్యారు. 2004 తర్వాత వరసగా రెండోసారి కూడా అధికారం నిలబెట్టుకున్న పార్టీగా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ నేతృత్వంలోని లేబర్ పార్టీ చరిత్ర సృష్టించింది. ఇక సింగపూర్‌లో ఎప్పటిలా పద్నాలుగోసారి సైతం అధికార పీపుల్స్ యాక్షన్ పార్టీ (పీఏపీ) తిరిగి అధికారంలోకి రావటం వింతేమీ కాదుగానీ... ఆ పార్టీ నేత, ప్రధాని లారెన్స్ వాంగ్ ప్రచారసభల్లో ట్రంప్‌పై రణభేరి మోగించారు. అమెరికా విధించిన సుంకా లకు ప్రతీకార సుంకాలుంటాయని ప్రకటించారు. అసలు అమెరికాకు సింగపూర్ నుంచి ఎగుమతులు చేసేదే లేదని స్పష్టం చేశారు. 97 స్థానాలున్న సభలో ఆ పార్టీ 87 స్థానాలు గెల్చుకోవటం గతంలో కూడా జరిగినా ఈసారి వోటు శాతాన్ని సైతం 66.57కి పెంచుకుని చరిత్ర సృష్టించింది. ఇక రుమేనియాలో మాత్రం ట్రంప్‌ను తలకెత్తుకున్న తీవ్ర మితవాదపక్షం అలయెన్స్ ఫర్ ది యూనిటీ ఆఫ్ రుమేనియన్స్ (ఏయూఆర్) నాయకుడు జార్జి సైమన్ తొలి రౌండ్‌లో గెలుపొందారు. ఈ నెల 18న జరగబోయే రెండో రౌండ్ ఎన్నికల్లో సైతం ఆయనదే విజయమన్న అంచనాలున్నాయి. వచ్చే సెప్టెంబర్‌లో ఎన్నికలు జరగబోయే నార్వేలో కూడా ట్రంప్ ప్రభావం కనబడుతోంది. అక్కడి అధి కార లేబర్ పార్టీకి ఓటమి తప్పదని జనవరిలో వివిధ సర్వేలు ప్రకటించగా, ఆ మరుసటి నెలకల్లా అంతా మారిపోయింది. ఇప్పుడు లేబర్ పార్టీయే గెలుపుగుర్రంగా కనబడుతోంది. కరోనా దాపురించినప్పటి నుంచీ ఆస్ట్రేలియా ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ ఇన్నీ కాదు. ముఖ్యంగా మూడేళ్లుగా ఆ దేశంలో ఉత్పాదకత తీవ్రంగా



దెబ్బతింది. ద్రవ్యోల్బణం పెరిగింది. దాన్ని తగ్గించటానికి ఆస్ట్రేలియా రిజర్వ్‌బ్యాంక్ 13 సార్లు వడ్డీరేట్లు పెంచింది. ఫలితం లేకపోగా అధిక ధరల కారణంగా కొనుగోళ్లు ఆగిపోయి గృహనిర్మాణ రంగం పడకేసింది. వీటన్నిటి వల్ల జీవన ప్రమాణాలు పడిపోయాయి. ఇవన్నీ చూసి తదుపరి ఎన్నికల్లో తమదే విజయమని కన్సర్వే టివ్ పార్టీ కలలుగంది. అమెరికాలో ట్రంప్‌కు పెరుగుతున్న మద్దతు చూసి అదే తరహా ప్రకటనలు చేసి ఆ పార్టీ నాయకుడు డటన్ మొదట్లో వోటర్ల మెప్పు పొందినమాట వాస్తవం. ప్రభుత్వ రంగంలో 40,000 ఉద్యోగాలు రద్దుచేస్తామని, వలసల విషయంలో కఠినంగా వుంటామని, ఉదార వాద విధానాలైన భిన్నత్వం, అందరినీ కలుపుకొనిపోవటం వగైరాలకు కాలం చెల్లిందని ఆయన పదే పదే ప్రకటించారు. ఆస్ట్రేలియా మొదటి నుంచీ అమెరికా మిత్ర దేశమే. అయినా ట్రంప్ ఏమాత్రం కనికరించలేదు. అందరితోపాటు ఆస్ట్రేలియాపైనా భారీయెత్తున సుంకాలు పెంచుతా మని ప్రకటించారు. ఇవింకా అమల్లోకి రాకపోయినా అమెరికా%-%చైనా వాణిజ్య యుద్ధం కారణంగా అసలే అంతంతమాత్రంగా వున్న ఆర్థిక వ్యవస్థ మరింత అనిశ్చితిలోకి పోయింది. ఈ దశలో డటన్ తనకు ట్రంప్‌తో వున్న వ్యక్తిగత సాన్నిహిత్యం వల్ల ఆస్ట్రేలియా ఆర్థిక వ్యవస్థను సునాయాసంగా గట్టెక్కిస్తానని హామీ ఇచ్చారు. కానీ ట్రంప్ దూకుడు కారణంగా స్టాక్ మార్కెట్లన్నీ బోల్తా కొట్టడంతో డటన్‌కు దిక్కుతోచలేదు. దాంతో ట్రంప్ ప్రస్తావన మానుకున్నారు. కానీ అప్పటికే జరగా ల్సిన నష్టం జరిగిపోయింది. జనం లేబర్ పార్టీకే వోటేయాలన్న నిర్ణయానికొచ్చారు. సింగపూర్ సైతం ఆర్థిక అస్థిరతలో కొట్టుమిట్టాడుతోంది. అసలే వాణిజ్యం దెబ్బతిని వుండగా ట్రంప్ అధిక సుంకాల ప్రకటన మరింత దెబ్బ తీసింది. ఆస్ట్రేలియా మాదిరే ఆ దేశంలోనూ పౌరులకు సొంతిళు సమకూర్చుకోవటం సమస్యగా మారింది. పెరిగిన ద్రవ్యోల్బణం, ఆర్థికమాంద్యం, ఉద్యో గాలు కోల్పోతామన్న భయాందోళనలు ప్రజల్ని వణికిస్తున్నాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో అంచనాల కన్నా జీడీపీ చాలా తగ్గి 3.8 శాతానికొచ్చింది. వచ్చే త్రైమాసికంలో అది 2 శాతం మించక పోవచ్చు. ట్రంప్ సుంకాల బెదిరింపు సరేసరి. అందుకే ఈ అనిశ్చితిలో పాలకపక్షాన్నే మరోసారి గెలిపించటం ఉత్తమమన్న నిర్ణయానికొచ్చారు. కనుకనే పీఏపీ వోట్ల శాతం 61.2 నుంచి 65.67కి పెరి గింది. సింగపూర్ ఎన్నికల్ని విదేశీ మదుపుదార్లు, అంతర్జాతీయ మీడియా, వివిధ దేశాల ప్రభుత్వాలు శ్రద్ధగా గమనించాయి. ఈ అయిదేళ్లూ సింగపూర్ ఎదుర్కొన్న సమస్యలు అలాంటివి మరి. ఏతావతా ఇప్పటికి ఒక్క రుమేనియా మినహాయించి ట్రంప్‌ను చూసి వాతలు పెట్టుకుంటున్న నాయకులంతా ఊహించని ఓటమితో ఖంగుతింటున్నారు. నిరుడంతా మితవాద పక్షాలు ఎక్కడి కక్కడ విజయం సాధించగా, ప్రస్తుతం ఆ పక్షాలకు ఎదురుగాలి

## అక్రమ అడ్మిషన్లు చేస్తున్న ప్రయివేట్
# విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

### ఆర్ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. ఎం. ఓబులేసు యాదవ్



కర్నూలు : : విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే అక్రమ అడ్మిషన్లు చేపడుతున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆర్ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. ఎం. ఓబులేసు యాదవ్, ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు కైపు రామాంజనేయులు, మైనార్టీ నాయకులు మహబూబ్ తార లు డిమాండ్ చేశారు కమలాపురం లో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అక్రమ అడ్మిషన్లకు ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తున్నాయని వారన్నారు ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పాటించకుండా ఇష్టారాజ్యంగా పిఆర్ఓ లను పెట్టి మే నెలలో జాయిన్ అయితే 20% ఫీజు రాయితీ కల్పిస్తామని, తల్లిదండ్రులను అనేక ప్రలోభాల గురి చేస్తూన్నారన్నారు ఇప్పటికే 50% పైగా అడ్మిషన్లు చేశారని అయినా విద్యాశాఖ అధికారులు తమకేమీ పట్టి పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యాలయాల బలోపేతానికి కృషి చేస్తా ఉంటే మరోవైపున విద్యాశాఖ అధికారులు నిబంధనకు విరుద్ధంగా వివరిస్తున్నారని మండిపడ్డారు ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం సమ్మర్ క్యాంపు ల పేరుతో, ట్యూషన్ల పేరుతో, కేరళ టీచర్లతో విద్యాబోధనని, కార్పొరేటర్ స్థాయి విద్యా ని, సాధారణ ఫీజుల మాత్రమే తీసుకుంటామని ఇలా అనేక రకాల తప్పుడు ప్రచారాలతో అడ్మిషన్లు చేస్తున్నారని వారు తెలిపారు తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి అక్రమ అడ్మిషన్లకు అడ్డుకట్ట వేయాలని, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ ఎఫ్నాయకులు మహమ్మద్ హుస్సేన్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు

## డాక్టర్ ధనుంజయ 19వ వర్ధంతి సందర్భంగా.



ఆత్మకూరు : ఆత్మకూర్ : ప్రజా ఆరోగ్యం ప్రభుత్వ లదే బాధ్యత అని పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ డి నాగన్న, డాక్టర్ డి. పి. గౌరీనాథ్, డాక్టర్ రాయుడు డాక్టర్ గోవిందరాజులు, డాక్టర్ అజయ్ కుమార్,సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఏ రాజశేఖర్ లు అన్నారు. మంగళవారం డాక్టర్ ఏ.ధనుంజయ 19వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని డాక్టర్ ఏ ధనుంజయ మీటింగ్ హాల్ నందు సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా ఆరోగ్యం ప్రభుత్వాలదే బాధ్యత అనే అంశంపై సదస్సు నిర్వహించడం జరిగింది. సందర్భంగా డాక్టర్ ధనుంజయ గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ ధనుంజయ ప్రజా వైద్యుడు ప్రజలలో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తూనే ప్రజలకు వైద్య సేవలు అందించేవాడని రెండు రూపాయలకే పేదలకు వైద్యం అందించే మహోన్నత వ్యక్తి అని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని సమాజం మార్పుకు ఆయన చేసిన కృషి నేటికీ మరువలేనిదన్నారు. డాక్టరు ధనుంజయ ప్రజలకు చేసిన వైద్య సేవలు నేటికీ ప్రజల్లో గుండెల్లో చిర స్థాయిగా నిలిచాయి అన్నారు, డాక్టర్ల పట్ల పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉన్నారని వెయ్యి మందికి ఒక డాక్టర్ ఉండాల్సిన పరిస్థితుల్లో 5000 మందికి ఒక డాక్టర్ ఉన్నారని డాక్టర్లకు కలి పించాల్సిన వసతులు కూడా సరిగ్గా కల్పించేటువంటి పరిస్థితిలో ప్రభుత్వాలు లేవని క్యూబా దేశ పద్ధతుల తరహాలోనె మనదేశంలో ప్రభుత్వాలు కూడ వైద్యం అభివృద్ధి కొరకు అభివృద్ధి కొరకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అలాగే మన దేశంలో



వైద్యం వృత్తిని పూర్తి చేసుకున్న వైద్యులు భారత దేశ ప్రజలకు వైద్య సేవ చేసే విధంగా చూడాలని అన్నారు. రానున్న కాలంలో డాక్టర్ ధనుంజయ ఆశయ సాధన కొరకు కృషి చేయాలని వారు కోరారు. ఈ ఈ సందర్భంగా పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగన్న గౌరీనాథ్ రాయుడు గోవిందరాజులు అజయ్ కుమార్ గార్లను సన్మానించడం జరిగింది. ఈ ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు డాల్ వెంకటేశ్వర్లు డాక్టర్ ధనుంజయ గురించి పాటలు పాడి వినిపించడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, పట్టణ సీనియర్ ఏం రజాక్, నాయకులు డి. రామ్ నాయక్,ఏ సురేంద్ర జి నాగేశ్వరరావు, మండల నాయకులు మా భాష, ఎన్ స్వాములు, దాసు, ఏ కిరణ్,వివిధ ప్రజా సంఘాల నాయకులు వెంకట్ స్వామి గౌడ్,మా భాష, రామచంద్రయ్య,నరసింహయ్య రాముడు, కుర్సీ డ్, శంకర్ రెడ్డి, బాబు, కరిముల్లా, అరుణ మెడికల్ స్టోర్ ప్రొప్రైటర్ రామసుబ్బయ్య, కళ్యాణి మెడికల్ స్టోర్ ఓనర్ తిరుపాలయ్య, తో పాటు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## చేనేతల అభివృద్ధి టిడిపి తోనే సాధ్యం.

### డిసిఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరావు యాదవ్



ఎమ్మిగనూరు :ఎమ్మిగనూరులో టెక్స్టైల్స్ పార్కు భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు ఎన్ ఎండి ఫరుక్ , బీసీ చేనేత శాఖ మంత్రి సబితమ్మ , రాష్ట్ర పరిశ్రమ శాఖ మాత్యులు టీజీ భరత్ ,మరియు ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి , మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ , కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు గారు, ఆలూరు మంత్రాలయం ఇన్చార్జిలు రాఘవేంద్ర రెడ్డి, వీరభద్ర గౌడ్, ఎమ్మిగనూరు జనసేన ఇన్చార్జి రేక గౌడ్ గారు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోతురాజు రవి కుమార్ గారు, తదితరులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగ అయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు 50 సంవత్సరాలకే పింఛన్ ఏర్పాటు చేసిన ఘనత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దన్నారు.. మల్లి ఇప్పుడు పింఛన్ 4 వేలు పెంచటం, అలాగే వారి అభివృద్ధి కోసం టెక్సటైల్స్ పార్క్ ఏర్పాటు చేయడం టిడిపి కే సాధ్యమన్నారు... టిడిపి తోనే చేనేతల అభివృద్ధి అన్నారు.. ఎమ్మిగనూరుకు విచ్చేసిన ఆయనకు శాలువా కప్పి బోకే ఇచ్చి స్థానిక ఎమ్మిగనూరు శాసనసభ సభ్యులు జయ నాగేశ్వర్ రెడ్డి ఘనంగ స్వాగతం పలికారు.. అయన వెంట జాతీయ బిసి సంక్షేమ సంఘము జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి రామకృష్ణ, ఉప్పరి శివన్న, పిజి వెంకటేష్, డిసిఎంఎస్ మేనేజర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు



## పరమ పవిత్ర పతివ్రతా మూర్తి సీతామాత....

### విశ్వ హిందూ పరిషత్ జిల్లా మాతృశక్తి కో- కన్వీనర్ మాళిగి పావని

కర్నూలు సిటీ : : విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం 11 గం.లకు ఉల్చాల వై రోడ్డు జంక్షన్ వద్ద గల వాసవి నగర్ లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో "సీతానవమి" సందర్భంగా సీతారాముల పూజ కార్యక్రమం విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ సత్సంగ కన్వీనర్ కృష్ణ పరమాత్మ ఆధ్వర్యంలో నిర్వహించారు అనంతరం ముఖ్య వక్తగా విచ్చేసిన విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి జిల్లా కో కన్వీనర్ పావని మాట్లాడుతూ... మహర్షి వాల్మీకి రచించి నభారతీయ జీవన గ్రంథం శ్రీమద్రామాయణం ఆ రామాయణంలో సామాన్య మానవ జీవనం ఆదర్శవంతంగా ఎలా ఉండాలో నేర్పించినదనీ, భార్యాభర్తల అనుబంధం ఎలా ఉండాలో సుస్పష్టంగా రామాయణ మహాగ్రంథం తెలియజేసిందని అన్నారు. మహా పతివ్రత అయిన సీత తన జీవితాన్ని మొత్తం శ్రీరామునికే అంకితం చేసిందని చిన్నప్పుడే అప్రతిహత శక్తిమంతురాలై శివధనస్సును వంటి చేత్తో కదిలించిన ఆమె అంతే అణుకువతో శ్రీరాముని భార్యగా జీవనాన్ని కొనసాగించింది. 14 సంవత్సరాలు వనవాసం అనుభవించడానికి సిద్ధపడిన రాముని తో పాటు వనవాసానికి తానూ వస్తానని అనగా సీత నువ్వు రాజపుత్రికవు,సుకుమారి వి నారచీరలు ధరించి,అడవిలో కందమూలాలు తింటూ కాలినడకన ప్రయాణిస్తూ జీవించాలని అందువల్ల నీవు ఐయోధ్యలోనే నివశించమన్న శ్రీరాముని మాటకు సీతాదేవి ప్రభూ భర్త ఎక్కడో భార్య కు అక్కడే స్వర్గం,రాజప్రాసాదం, అన్న మాటతో తన పాతివ్రత్యాన్ని ప్రదర్శించిందని,నేటి హిందూ మహిళలు కూడా భర్త కష్టసుఖాల్లో పాలుచుకుంటూ సంసారాన్ని ,పిల్లలను వృద్ధిలోకి తేవాలన్న సందేశం రామాయణంలోని సీతామాత ద్వారా తెలుసుకోవాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో శారద,హేమలత,ఇతర మాతృమూర్తులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ల పితామహుడు సాహు మహరాజ్

కర్నూలు : : యస్సీ,యస్టీ,బీసీ,మైనారిటీ మహిళా ఐక్య వేదిక స్థానిక జిల్లా కార్యాలయంలో సాహు మహరాజ్ 103వ వర్ధంతి సందర్భంగా మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి మరియు పాలెం రాధ సాహు మహారాజ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి మాట్లాడుతూ 1874 జూన్ 26 న రాధబాయి, జయసింగ్ ఆబా సాహెబ్ ఘాట్గే దంపతులకు సాహు మహరాజ్ జన్మించారు. సాహు మహరాజ్ కు తల్లిదండ్రులు పెట్టిన పేరు యశ్వంత్ రావ్,అతనికి యుక్త వయసు రాగానే 1894 ఏప్రిల్ 2 న కొల్హాపూర్ సింహాసనాన్ని అధిష్టించారు. సాహు మహరాజ్ దళిత, బహుజనులకు సామాజిక న్యాయ, ప్రజాస్వామిక తాత్విక పునాది ఏర్పరచి ప్రజల రాజుగా మిగిలిపోయిన మహనీయుడు అని ఆమె అన్నారు. రాజర్షి ఛత్రపతి సాహుమహరాజ్. పితృస్వామ్య ,కుల మత వ్యవస్థల వల్ల స్త్రీల మీద జరుగుతున్న అమానుషంని గ్రహించిన సాహు మహరాజ్ మొదట తన భార్య లక్ష్మీబాయికి యూరోపియన్ టీచర్ల ద్వారా ఆధునిక విద్యను చెప్పించి సంగీతంలో చిత్రలేఖనంలో ఎంబ్రాయిడరీ లో శిక్షణ ఇప్పించారు. కొల్హాపూర్ సంస్థానంలో బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు ప్రారంభం చేసి ఉన్నత విద్యలోకి బాలికలను ప్రోత్సహించేందుకు ఉపకారవేతనాలు ,ప్రోత్సాహక బహుమతులు ఏర్పాటు చేసి కొల్హాపూర్ రాజారామ్ కాలేజీకి బాలికల ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసిన మహోన్నత వ్యక్తి సాహు మహరాజ్ అని ఆమె తెలిపారు. వెనుకబడిన ఆడపిల్లలకు ఉచిత భోజన వసతి సదుపాయాలు కల్పించారు అంతేగాక సాహు మహారాజ్ అంటరానివారికి ఆపద్బాంధవుడు గా మారిన విషయం తెలుసుకున్న బాబాసాహెబ్ అంబేద్కర్ సాహుమహారాజ్ ల మధ్య పరిచయం పెరిగి రాబోయే బ్రిటిష్ చట్టాలు మంచిచెడుల గురించి చర్చించేవారని ఆమె



అన్నారు. అంబేద్కర్ అస్పృశ్యుల హక్కుల సాధన కోసం ఒక పత్రిక పెట్టాలనుకుంటున్నానని అయితే ఆర్థిక ఇబ్బందులతో చేయలేకపోతున్నానని చెప్పడంతో ఆ పత్రికకు కావలసిన ఆర్థిక వనరులను సమకూర్చి మొదట 2,500 రూపాయలు ఇవ్వడంతో మూక్ నాయక్ పత్రిక ప్రారంభమైంది .1920 ఏప్రిల్ 15న నాసిక్ లో అంబేద్కర్ మరియు అతని మిత్రులు అంటరానివారి కోసం ఒక హాస్టల్ కట్టాలి అనుకుంటే ఆ కార్యక్రమ ప్రారంభోత్సవానికి హాజరై ఐదువేల రూపాయలను ఆర్థికంగా సాహు మహరాజ్ సహకరించారని ఆమె తెలిపారు. 1920 లో అంబేద్కర్ ఇంగ్లాండ్ వెళ్లి చదువుకొనుటకు సాహు మహరాజ్ ఆర్థిక సహాయం చేసారని ఆమె అన్నారు. అంబేద్కర్ విదేశాల్లో ఉన్నంతకాలం మూక్ నాయక్ పత్రిక కొనసాగేలా అందుకు అవసరమయ్యే ఆర్థిక సహాయం సాహు మహరాజ్ చేశారని ఆమెతెలిపారు. అంబేద్కర్ తిరిగి భారతదేశం రాగానే సాహు మహరాజ్ తన ఆస్థానం లోనే ఉద్యోగం ఇచ్చారని, అంతేకాకుండా1902 జూలై 26 వ తేదీన భారతదేశ చరిత్రలో ఒక చారిత్రాత్మకంగా ప్రభుత్వము ప్రభుత్వ పాలనా వ్యవహారాలలో ఎవరి జనాభా ఎంతో వారి వాటా అంతా ఉండాలనే ఆలోచనతో ప్రభుత్వ ఉద్యోగాల అన్నింటిలో వెనుకబడిన వర్గాల వారికి 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. రిజర్వేషన్లు మొట్టమొదటి సారిగా అమలుచేసి రిజర్వేషన్ల పితామహుడుగా చరిత్రలో నిలిచిన బహుజనుల ఆశాజ్యోతి సాహు మహరాజ్ అని ఆమె అన్నారు. అంటరానివారు మరియు అన్ని మతాలలో వెనుకబడిన వారు కూడా రిజర్వేషన్ల కిందకే వస్తారని సాహు అన్నారని ఆమె తెలిపారు. అంతేకాక తన ఆస్థానంలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వ్యక్తి వెనుకబడిన వర్గాలలో ఒక్కరు కూడా లేకపోవడం చూసి సాహు మహారాజ్ వెనుకబడిన కులాల వారందరికీ స్కూల్స్ హాస్టల్స్ ప్రారంభించి విద్యను ఒక ఉద్యమంలా నడిపించారు. ఒక రాజు అయిన సాహుమహారాజ్ ఇంత నిబద్ధతతో సామాజిక ఉద్యమాలు నిర్వహించడం నిజంగా అరుదైన విషయం.కేవలం మహారాష్ట్రకే కాకుండా దక్షిణ భారతదేశంలో జస్టిస్ పార్టీ ఉద్యమంతో భారతదేశం మొత్తం మీద ప్రభావం చూపిన సాహుమహారాజ్ 1922 మే 6న మరణించారాని అతని మరణాంతరం అంత్యక్రియలు సైతం బ్రాహ్మణేత్తర పురోహితుల చేత జరిగాయని అంతటి గొప్ప వ్యక్తిని స్మరించుకోవడం, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని ఆమె

## హంద్రీ-నీవా ప్రధాన కాలువకు గుండ్లకొండ దగ్గర సబ్-కెనాల్ ఏర్పాటు చేయాలి.

### ఏపీ రైతు సంఘం,సీపీఐ ఆధ్వర్యంలో

### రైతులతో కలిసి ఆర్డిఓకు వినతిపత్రం.

దేవనకొండ:- హంద్రీ-నీవా ప్రధాన కాలువ కు గుండ్లకొండ దగ్గర సబ్ కెనాల్ ఏర్పాటు చేసి గుండ్లకొండ, కె వెంకటాపురం, మాదాపురం, గుడిమిరాల, బంటుపల్లి, బండపల్లి, బేతపల్లి, చెల్లెల చెల్లెల,పి. కోటకొండ మీదుగా మాచాపురం చెరువుకు నీళ్లు మళ్లించాలని సిపిఐ మండల కార్యదర్శి ఎమ్. నరసరావు, బండపల్లి మాజీ సర్పంచ్ శ్రీరాములు, గుడిమిరాళ్ల తిమ్మప్ప, మాచాపురం వీరన్న, ఏపీ రైతు సంఘం మండల నాయకులు వై. కండప్ప,ఎమ్.వెంకటేశ్వర్లు లు ఆర్డీవో ను కోరారు. మంగళవారం దేవనకొండ తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన పత్తికొండ ఆర్డిఓ భరత్ నాయక్ ను ఏపీ రైతు సంఘం,సీపీఐ ఆధ్వర్యంలో హంద్రీ-నీవా పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు, రైతులు కలిసి సాగునీటి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... దేవనకొండ మండలంలో హంద్రీ-నీవా ప్రధాన కాలువ ద్వారా దాదాపు 46 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సిన లక్ష్యం ప్రభుత్వం పై ఉందన్నారు. ఇప్పటివరకు హంద్రీ-నీవా ద్వారా మండలంలో కొన్ని



గ్రామాల రైతులకు మాత్రమే సాగునీరు అందుతుందన్నారు. దాదాపు 75% గ్రామాల రైతాంగానికి ఇప్పటివరకు హంద్రీ-నీవా ద్వారా సాగునీరు అందడం లేదన్నారు. ప్రధానంగా హంద్రీ-నీవా ప్రధాన కాలువకు గుండ్లకొండ దగ్గర సబ్ కెనాల్ ఏర్పాటు చేసి గుడిమిరాళ్ల, కె.వెంకటాపురం, మాదాపురం, బంటుపల్లి, చెల్లెలచెలిమల, బేతపల్లి,బండపల్లి, పి.కోటకొండ మీదుగా మాచాపురం చెరువుకు హంద్రీ-నీవా ప్రధాన కాలువ ద్వారా సాగునీరు మళ్లించాలని గతంలో అనేకమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. కావున దేవనకొండ మండలం పై ప్రత్యేక దృష్టి సారించి కర్నూలు జిల్లాలోనే అత్యధికంగా హంద్రీ-నీవా నీటిని




ఉపయోగించుకుంటున్న మండలం దేవనకొండ మండలం అయితే మిగులు గ్రామాలకు హంద్రీ-నీవా ద్వారా సాగునీరు కేటాయించాలని కోరారు. ప్రధానంగా హంద్రీ-నీవా ప్రధాన కాలువకు "గుండ్లకొండ దగ్గర సబ్ కెనాల్ ఏర్పాటు చేసి పి.కోటకొండ మీదుగా మాచాపురం చెరువుకు" నీళ్లు మళ్లించాలన్నారు. హంద్రీ-నీవా ప్రధాన కాలువ ద్వారా మండలంలోని రైతుల "పంట పొలాలకు పిల్ల కాలువల" నిర్మాణం చేపట్టాలన్నారు. ఇప్పటివరకు హంద్రీ-నీవా సాగునీటికి నోచుకోని "మిగులు గ్రామాలకు" సాగునీరు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సురేష్, వెంకటేశు,

# రిజర్వేషన్ల పితామహుడు సాహు మహరాజ్ 103వ వర్ధంతి

ఆత్మకూరు : యస్సీ,యస్టీ,బీసీ,మైనారిటీ మహిళా ఐక్య వేదిక స్థానిక జిల్లా కార్యాలయంలో సాహు మహరాజ్ 103వ వర్ధంతి సందర్భంగా మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి మరియు పాలెం రాధ సాహు మహారాజ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి మాట్లాడుతూ 1874 జూన్ 26 న రాధబాయి, జయసింగ్ ఆబా సాహెబ్ ఘాట్గే దంపతులకు సాహు మహరాజ్ జన్మించారు. సాహు మహరాజ్ కు తల్లిదండ్రులు పెట్టిన పేరు యశ్వంత్ రావ్,అతనికి యుక్త వయసు రాగానే 1894 ఏప్రిల్ 2 న కొల్హాపూర్ సింహాసనాన్ని అధిష్టించారు. సాహు మహరాజ్ దళిత, బహుజనులకు సామాజిక







న్యాయ, ప్రజాస్వామిక తాత్విక పునాది ఏర్పరచి ప్రజల రాజుగా మిగిలిపోయిన మహనీయుడు అని ఆమె అన్నారు. రాజర్షి ఛత్రపతి సాహుమహరాజ్. పితృస్వామ్య ,కుల మత వ్యవస్థల వల్ల స్త్రీల మీద జరుగుతున్న అమానుషంని గ్రహించిన సాహు మహరాజ్ మొదట తన భార్య లక్ష్మీబాయికి యూరోపియన్ టీచర్ల ద్వారా ఆధునిక విద్యను చెప్పించి సంగీతంలో చిత్రలేఖనంలో ఎంబ్రాయిడరీ లో శిక్షణ ఇప్పించారు. కొల్హాపూర్ సంస్థానంలో బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు ప్రారంభం చేసి ఉన్నత విద్యలోకి బాలికలను ప్రోత్సహించేందుకు ఉపకారవేతనాలు ,ప్రోత్సాహక బహుమతులు ఏర్పాటు చేసి కొల్హాపూర్ రాజారామ్ కాలేజీకి బాలికల ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసిన మహోన్నత వ్యక్తి సాహు మహరాజ్ అని ఆమె తెలిపారు. వెనుకబడిన ఆడపిల్లలకు ఉచిత భోజన వసతి సదుపాయాలు కల్పించారు అంతేగాక సాహు మహారాజ్ అంటరానివారికి ఆపద్బాంధవుడు గా మారిన విషయం తెలుసుకున్న బాబాసాహెబ్ అంబేద్కర్ సాహుమహారాజ్ ల మధ్య పరిచయం పెరిగి రాబోయే బ్రిటిష్ చట్టాలు మంచిచెడుల గురించి చర్చించేవారని ఆమె అన్నారు. అంబేద్కర్ అస్పృశ్యుల హక్కుల సాధన కోసం ఒక పత్రిక పెట్టాలనుకుంటున్నానని అయితే ఆర్థిక ఇబ్బందులతో చేయలేకపోతున్నానని చెప్పడంతో ఆ పత్రికకు కావలసిన ఆర్థిక వనరులను సమకూర్చి మొదట 2,500 రూపాయలు ఇవ్వడంతో మూక్ నాయక్పత్రిక ప్రారంభమైంది .1920 ఏప్రిల్ 15న నాసిక్ లో అంబేద్కర్ మరియు అతని మిత్రులు అంటరానివారి కోసం ఒక హాస్టల్ కట్టాలి అనుకుంటే ఆ కార్యక్రమ ప్రారంభోత్సవానికి హాజరై ఐదువేల రూపాయలను ఆర్థికంగా సాహు మహరాజ్ సహకరించారని ఆమె తెలిపారు. 1920 లో అంబేద్కర్ ఇంగ్లాండ్ వెళ్లి చదువుకొనుటకు సాహు మహరాజ్ ఆర్థిక సహాయం చేసారని ఆమె అన్నారు. అంబేద్కర్ విదేశాల్లో ఉన్నంతకాలం మూక్ నాయక్ పత్రిక కొనసాగేలా అందుకు అవసరమయ్యే ఆర్థిక సహాయం సాహు మహరాజ్ చేశారని ఆమెతెలిపారు. అంబేద్కర్ తిరిగి భారతదేశం రాగానే సాహు మహరాజ్ తన ఆస్థానం లోనే ఉద్యోగం ఇచ్చారని, అంతేకాకుండా1902 జూలై 26 వ తేదీన భారతదేశ చరిత్రలో ఒక చారిత్రాత్మకంగా ప్రభుత్వము ప్రభుత్వ పాలనా వ్యవహారాలలో ఎవరి జనాభా ఎంతో వారి వాటా అంతా ఉండాలనే ఆలోచనతో ప్రభుత్వ ఉద్యోగాల అన్నింటిలో వెనుకబడిన వర్గాల వారికి 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. రిజర్వేషన్లు మొట్టమొదటి సారిగా అమలుచేసి రిజర్వేషన్ల పితామహుడుగా చరిత్రలో నిలిచిన బహుజనుల ఆశాజ్యోతి సాహు మహరాజ్ అని ఆమె అన్నారు. అంటరానివారు మరియు అన్ని మతాలలో వెనుకబడిన వారు కూడా రిజర్వేషన్ల కిందకే వస్తారని సాహు అన్నారని ఆమె తెలిపారు. అంతేకాక తన ఆస్థానంలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వ్యక్తి వెనుకబడిన వర్గాలలో ఒక్కరు కూడా లేకపోవడం చూసి సాహు మహారాజ్ వెనుకబడిన కులాల వారందరికీ స్కూల్స్ హాస్టల్స్ ప్రారంభించి విద్యను ఒక ఉద్యమంలా నడిపించారు. ఒక రాజు అయిన సాహుమహారాజ్ ఇంత నిబద్ధతతో సామాజిక ఉద్యమాలు నిర్వహించడం నిజంగా అరుదైన విషయం.కేవలం మహారాష్ట్రకే కాకుండా దక్షిణ భారతదేశంలో జస్టిస్ పార్టీ ఉద్యమంతో భారతదేశం మొత్తం మీద ప్రభావం చూపిన సాహుమహారాజ్ 1922 మే 6న మరణించారాని అతని మరణాంతరం అంత్యక్రియలు సైతం బ్రాహ్మణేత్తర పురోహితుల చేత జరిగాయని అంతటి గొప్ప వ్యక్తిని స్మరించుకోవడం, వారి

## కురవ చెంచు గూడెం లో
# మంచినీటి సమస్యను పరిష్కరించాలి.
### - కొమరం భీమ్ గిరిజన సంఘం



శ్రీశైలం :కురవ చెంచు గూడెం లో మంచినీటి సమస్యను పరిష్కరించాలి. కొమరం భీమ్ ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వై ఆశీర్వాదం జిల్లా కలెక్టర్ మరియు అధికారులను కోరారు. ప్రకాశం జిల్లా దోర్నాల మండలం పరిధిలో ఉన్న నందిగూడెం సమీపాన ఎర్ర గురవ చెంచులకు మూడు క్వింటాళ్ల బియ్యాన్ని బట్టలను కొమరం భీం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వై ఆశీర్వాదం. ఎస్సీ ఎస్టీ, బిసి మైనార్టీ రాష్ట్ర కన్వీనర్. పి మల్లికార్జున వారి ఆధ్వర్యంలో చెంచు గిరిజనులకు బియ్యం బట్టలు పంపిణీ చేయడం జరిగింది.అనంతరం గౌరవ అధ్యక్షులు ఆశీర్వాదం మాట్లాడుతూ ఎర్రగురవలో ఉన్న చెంచులకు తాగడానికి నీళ్లు లేక వర్షపు నీరు గుంతల్లో మురికి నీరు తాగుతున్నారని స్థానికంగా ఉండే రెండు బోర్లు చెడిపోయి రెండు సంవత్సరాలు కావస్తున్న అక్కడ నివాసం ఉన్న చెంచులను ఏ అధికారి పట్టించుకోవట్లేదని చెంచు గిరిజనులు వాపోయారు. ఆ గూడెంలో ఇప్పటికీ చెంచులు పూరి గుడిసెలలో వన్య మృగాల అడవి జంతువులు మధ్యన జీవిస్తున్నారని.జిల్లా అధికారులకు సమస్యల గురించి చెప్పిన ఏమాత్రం పట్టించుకోవట్లేదని చెంచు గిరిజనులు వాపోయారు. తక్షణమే ప్రకాశం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులు దోర్నాల మండల తాసిల్దార్ గ్రామపంచాయతీ అధికారులు చెంచులు నీటి సమస్య పరిష్కరించాలని. అధికారులు వారికి తక్షణమే న్యాయం చేయవలసిందిగా మనవి. కొమరం భీమ్ ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం కుడుముల, వెంకటేశం,గురవయ్య,పి గాబ్రెల్, పి కిరణ్,నాగయ్య,అచ్చరెడ్డి,చెంచు గిరిజన యువత మహిళలు పాల్గొన్నారు

## ఉపాధి పనితో గ్రావెల్ రోడ్డు నిర్మాణం



ఆలూరు : ఆలూరు మండలం తుమ్మల బీడు గ్రామ సర్పంచ్ యం. సోమలింగమ్మ ఉపాధి హామీ పనులతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. తుమ్మల బీడు గ్రామంలోని రాములమ్మ అవ్వ గుడి దగ్గర నుండి కర్నూల్ రోడ్డు వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్ మట్టిపని తో గ్రావెల్ రోడ్డు నిర్మాణం కొనసాగుతుంది. తుమ్మల బీడు గ్రామం నుండి కర్నూల్ కి వెళ్లే ప్రజలకు, వాహనదారులకు రహదారి లేక చాలా ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులతోగ్రామ ప్రజలకు, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా ప్రయాణించే వీలుంది. రహదారి గుండా కంపచెట్లు, బండరాళ్లు తొలగించి సర్పంచ్ భర్త యం. మల్లికార్జున దగ్గరుండి రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండడం పట్ల ప్రజలు మల్లికార్జున, సర్పంచ్ సోమలింగమ్మ కు కమ్మరచేడు , హులేబీడు, చుట్టుపక్క గ్రామాల వాహనదారులు అభినందనలు తెలియజేస్తున్నారు. పొలాల గుండా రోడ్డు నిర్మిస్తున్నందుకు గ్రామస్తులు, వాహనాదారులు సంతోషం వ్యక్తపరుస్తున్నారు.

# దండకారణ్యంలో కార్పొరేట్ యుద్ధం!



'మావోయిస్టులపై అంతిమ యుద్ధం' అంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్'ను చేపట్టింది. అడవంతా పోలీసు క్యాంపులతో నింపేసింది. వేలాది పారామిలటరీ బలగాలు, గ్రేహౌండ్స్ దళాలతో దండకారణ్యాన్ని కొన్ని రోజులుగా జల్లెడ పడుతున్నది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆయుధాలతో అడవి అణువణువునూ శోధిస్తున్నది. ఆదివాసీ గూడేలను తగలబెడుతున్నది. నిర్దాక్షిణ్యంగా ఎన్‌కౌంటర్ పేరిట పచ్చని అడవిలో నెత్తురుటేర్లను పారిస్తున్నది. మావోయిస్టులను.. అమాయక ఆదివాసీ తెగలను ఊచకోత కోస్తున్నది. మారణహోమాన్ని సృష్టిస్తున్నది. మానవహక్కుల హననానికి పాల్పడుతున్నది. హింసతో, అణచివేతతో అడవిలో కల్లోలం రేపుతున్నది. గతేడాది జనవరిలో ప్రారంభమైన ఆపరేషన్ కగార్‌లో అధికారిక లెక్కల ప్రకారమే దాదాపు 500 మందికి పైగా మావోయిస్టులు హతమయ్యారంటే ఎంతటి భీతావహ పరిస్థితి నెలకొన్నదో అర్థం చేసుకోవచ్చు. మానవ హక్కుల ఉల్లంఘన ఏ తీరుగా సాగుతున్నదో ఒక అంచనాకు రావచ్చు. మరోవైపు దండకారణ్యంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని, ఆదివాసులపై జరుగుతున్న దాడిని నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని తెలంగాణ పౌరసమాజం నుంచి అంతే స్థాయిలో డిమాండ్ పెల్లుబుకుతున్నది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రజతోత్సవ సభలో లక్షలాది జనం సాక్షిగా వేదికపై నుంచి పిలుపునివ్వడంతో రాజకీయవర్గాల్లోనూ ఒక కదలిక ప్రారంభమైంది. కానీ, కేంద్రం మాత్రం మావోయిస్టు నిర్మూలనే కాదు, అడవిలో మానవ మాత్రుడు ఉండకూడదనే ధ్యేయంతోనే ముందుకు సాగుతున్నట్టుగా స్పష్టంగా తెలిసిపోతున్నది. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతున్నది. మరింతకీ ఈ మావోయిస్టులు ఎవరు? ఎక్కడినుంచి వచ్చారు? అడవుల్లో ఎందుకు మగ్గుతున్నారు? ఆయుధాలు ఎందుకు చేపట్టారు? ఆదివాసులతో వారికి అనుబంధమెక్కడిది? వారికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకున్న వైరమేమిటి? స్వజాతి జనులపై ఎందుకోసం.. ఎవరికోసం ఈ హింస? ఎవరి వికాసానికీ రక్తపాతం? ఆపరేషన్ కగార్ ఆంతర్యమేంటి? ఎవరికి లాభం? మరెవరికి నష్టం? అనే మౌలిక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాటికి జవాబులు కూడా సుస్పష్టం. మావోయిస్టులు దిగంతాల నుంచి ఊడిపడలేదు. శత్రుదేశాల నుంచి వచ్చిన చొరబాటుదారులు కాదు. ఈ భారతావని బిడ్డలే. మన సోదరీ సోదరులే. ప్రభుత్వాలకు, వాళ్లకు, మనకు మధ్య ఉన్నది కేవలం సిద్ధాంత వైరుధ్యమే. అది శాంతిభ్రదతల సమస్య కాదు. ఒక రాజకీయ ఉద్యమం. దశాబ్దాలుగా కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ వివక్షే దానికి కారణం. సూటిగా చెప్పాలంటే భారత రాజ్యాంగంలోని ఆదేశిక స్రూతాల అమలు కోసం ఒక వర్గం తరాలుగా సాగిస్తున్న సాయుధ పోరాటం. బిర్సా ముండా, కుమ్రంభీమ్‌ల ఆశయాల ప్రతిరూపమే నూతన ప్రజాస్వామిక విప్లవం. మరెందుకు మావోయిస్టులపై ఈ ప్రభుత్వాల యుద్ధం అంటారా? దండకారణ్యం గర్భంలో దాగిన లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపద కోసం. దశాబ్దాల కిందటనే మైనింగ్ మొదలైనా అదింకా దండకారణ్యమంతటికీ విస్తరించలేదు. అందుకు ప్రధాన కారణం దండకారణ్యాన్ని పొదివి పట్టుకున్న ఆదివాసీలు. ఆ అడవిబిడ్డలకు ఆలంబనగా నిలుస్తున్న మావోయిస్టులు. అందుకే ఖనిజ సంపద దోపిడీకి ఏ అడ్డు లేకుండా చేసుకునేందుకు కార్పొరేట్‌శక్తులు, వాటి అడుగులకు మడుగులొత్తుతున్న కేంద్ర ప్రభుత్వ పాలకులు ఆ ఆదివాసీలు, మావోయిస్టుల ఏరివేతకు కుట్రపూరిత ప్రణాళికలకు సైతం దశాబ్దాల కిందటే తెరలేపాయి. ప్రపంచంలోనే అపారమైన, అత్యంత అరుదైన ఖనిజ నిల్వలకు చిరునామా మన భారతదేశం. అందులోనూ ప్రధానంగా దండకారణ్య ప్రాంతం. మన దేశంలో అటవీ విస్తీర్ణం 2.29 మిలియన్ చ.కి.మీ. ఆ మొత్తం విస్తీర్ణంలో మధ్య భారతంలోని దండకారణ్యం 9.60 శాతం. ఇక ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్ తదితర అతిపెద్ద రాష్ట్రాల్లో లక్షలాది చదరపు కిలోమీటర్ల పరిధిలో దండకారణ్యం విస్తరించి ఉన్నది. తెలంగాణ ప్రాంతంలో ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలు, ఏపీలో తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఆ పరిధిలోకి వస్తాయి. ఈ అటవీక్షేత్రం లక్షల కోట్ల విలువైన ఖనిజ నిక్షేపాల నిలయం. ఈ దేశ జాతి సంపద. దాని విలువ దశాబ్దాల కిందటనే రూ.9 లక్షల కోట్లని ఒక ప్రాథమిక అంచనా. ఇప్పుడది అంతకు రెట్టింపు. ఆ ఖనిజ సంపదపై దశాబ్దాల కిందటనే సామ్రాజ్యవాదుల కన్ను పడింది. 1968లో జపాన్‌కు చెందిన బైలదిల్లా కంపెనీ మైనింగ్ ప్రారంభించి ఇనుప రజను కొల్లగొట్టడం మొదలుపెట్టింది. ఆ తర్వాత టాటా పోస్కో, ఎస్సార్ జిందాల్, రియో టింటో, బీహెచ్‌బి, మిట్టల్, వేదాంత రిసోర్సెస్ వంటి విదేశీ కార్పొరేట్ సంస్థలు జతకలిశాయి. ఇప్పుడు ఆ ఖనిజ సంపద దోపిడీకి అదానీ, అంబానీ తదితర దేశీయ కార్పొరేట్ శక్తులు క్యూ కట్టాయి. ఆయా కంపెనీలకు జాతి సంపదను గంపగుత్తగా దోచిపెట్టేందుకు ఢిల్లీ పెద్దలు ఒప్పందాలు చేసుకున్నారు, చేసుకుంటూనే ఉన్నారు. రాబోయే మూడు దశాబ్దాల్లోగా అక్కడి ఖనిజసంపద యావత్తును కొల్లగొట్టే లక్ష్యంతో బడా పారిశ్రామికవేత్తలు, వారి కనుసన్నల్లో నడుస్తున్న కేంద్రం ముందుకు సాగుతున్నట్టు స్పష్టంగా తెలిసిపోతున్నది. అదిప్పుడు మరింత విశ్వరూపం దాల్చింది. కాంగ్రెస్ హయాంలో 90వ దశకంలో జన జాగరణ్ పేరిట మొదలైన ఊచకోత ఆ తర్వాత 2005లో సల్వాజుడుంగా రూపాంతరం చెందింది. ఆపై గ్రీన్‌హంట్‌గా, ఆపరేషన్ సమాధాన్ పేరిట ముందుకువచ్చింది. ఇప్పుడు ఆపరేషన్ కగార్ పేరిట కేంద్రం ఏకంగా అంతిమయుద్ధం ప్రకటించింది. యుద్ధరీతులు మారాయేమో కానీ దమనరీతి మాత్రం మారలేదు. రూపమేదైనా వాటి లక్ష్యం ఒక్కటే. మైనింగ్ విస్తరణ. అందుకే అడవి పొత్తిళ్ల నుంచి ఆదివాసీల తరిమివేత. మావోయిస్టుల ఏరివేత. అదిప్పుడు విశ్వరూపం దాల్చింది. కార్పొరేట్ శక్తుల కోసం సాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, శాంతిచర్చలకు తాము సిద్ధమని మావోయిస్టులు ఇప్పటికే ప్రకటించారు. ఆ శాంతి కోసం దేశ మేధావివర్గం కూడా గళం విప్పుతున్నది. తాజాగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటనతో రాజకీయవర్గాల్లోనూ కదలిక వచ్చింది. అయినప్పటికీ కేంద్రం మాత్రం శాంతిచర్చల ఊసే ఎత్తడం లేదు. ఈ నేపథ్యంలోనే దండకారణ్యంలో శాంతి కోసం ఇప్పుడు పౌర సమాజం కూడా డిమాండ్ చేయాలి. ఎందుకంటే ఆదివాసీల విస్థాపన తర్వాత.. మావోయిస్టులను ఏరివేశాక జరగబోయేది ప్రకృతి వినాశనమే. దండకారణ్యాన్ని ఛిద్రం చేయడమే. పోయేది అడవే కదా? అడవిబిడ్డలే కదా? అని అనుకుంటే అంతకంటే పొరపాటు మరొకటి ఉండదు. భారతదేశంలో ఎక్కడా లేని జీవ వైవిధ్యానికి ఆలవాలం దండకారణ్యం. అనేక నదుల జన్మస్థానం. విస్తారమైన వర్షపాతానికి మూలాధారం. భూగర్భజలాల పెంపులోనూ ఈ పర్వతశ్రేణులే కీలకం. లక్షల ఏండ్ల పర్యావరణ సమతుల్యతకు కేంద్రం. మరి ఖనిజ వనరుల కోసం అడవిని నరికేసి, పర్వతాలను పిప్పిచేశాక మిగిలేదంతా క్షామం. అంతేనా మైనింగ్ వ్యర్థాలతో నీరు, గాలి కాలుష్యం. వెరసి అడవంచు గ్రామాల్లో మానవ మనుగడే ఒక ప్రశ్నార్థకం. ఇదేమీ ఊహాజనితం కాదు. అమెజాన్ అడవిని నాశనం చేసుకొని నేడు తీవ్ర కరువు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న బ్రెజిల్ దేశం ఓ సజీవ సాక్ష్యం. కరువు కాటకాలతో అల్లాడుతున్న ఆఫ్రికా ఖండంలో ఒక్కొక్క దేశం చరిత్ర చెప్పిన సత్యం. మన దేశ నడిబొడ్డులో ఆ వినాశం ఇప్పటికే మొదలైంది. అది క్రమంగా విశ్వరూపం దాల్చుతున్నది. అందుకే ఇప్పుడు శాంతికోసమే కాదు, భవిష్యత్తు తరాల భద్రత కోసమూ గళం విప్పాలి. కదం కదపాలి. అడవిని, ఆ అడవిని వెన్నంటి కాపాడుతున్న అడవి బిడ్డల పోరాటానికి బాసటగా నిలవాలి. అది అత్యావశ్యం. మరీ ముఖ్యంగా తెలంగాణ కర్తవ్యం. ఎందుకంటే రాష్ట్ర వరదాయినిగా నిలిచే గోదావరి జలాలకు ప్రాణాధారం. ప్రాణహిత జన్మస్థానం ఆ దండకారణ్యమే.

# ఉగ్రవాదం.. కలసికట్టుగా ఉంటేనే అంతం



కశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడిని యావత్ ప్రపంచంలోని పౌరులందరూ ఖండించారు. ఆ దాడిలో మరణించిన అమాయక ప్రజలకు అశ్రు నివాళులర్పించారు. అలా చేయని వారిని మనం మనుషులుగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. ఈ ఉగ్రదాడిని దేశ సార్వభౌమత్వం మీద జరిగిన దాడిగా మనం పరిగణించాల్సిన అవసరం ఉన్నది. ఈ దాడులకు ప్రత్యక్షంగా, లేదా పరోక్షంగా కారకులైన ప్రతీ వ్యక్తిని కఠినంగా శిక్షించాలి. శవాలపై పేలాలు ఏరుకునే వ్యక్తులు ప్రతీ చోట ఉంటారు. అట్లాగే ఈ ఉగ్రదాడి నుంచి రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్న కొందరు దురాశావాదులు ఒక మతం, మరో మతంపై జరిపిన దాడిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి ఈ దురాశావాదులే ఉగ్రవాదుల పన్నాగంలో చిక్కినట్టుగా అర్థమవుతున్నది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రుల గృహ నిర్బంధం నుంచి నెలల తరబడి ఇంటర్నెట్ సౌకర్యాన్ని నిలిపివేసేదాకా భారత ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల కశ్మీర్ నిస్తేజంగా మారింది. ఈ క్రమంలో మొన్న జరిగిన ఎన్నికల తర్వాత కశ్మీర్ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నది. కశ్మీరీల జీవనాధారమైన పర్యాటకరంగం ఇప్పుడిప్పుడే ఆశాజనకంగా మారుతున్నది. ఈ సమయంలో ఉగ్రవాదులు దాడులు చేయడం, ఆ దాడుల్లో పదుల సంఖ్యల్లో ప్రాణాలు పోవడం అత్యంత ఖండనీయం. దీంతో కశ్మీర్ మళ్లీ అగాధంలోకి వెళ్లిపోతుందనడంలో సందేహం లేదు. దాడులు జరిపిన ఉగ్రవాదులు మతం అడిగి మరీ కాల్పులు జరిపారని కొందరు చెప్తున్నారు. దేశంలో మతపరమైన అలజడి సృష్టించి, భారతీయ సమాజాన్ని విచ్ఛిన్నం చేయాలన్నదే ఉగ్రవాదుల పన్నాగం. ఈ కుటిల పన్నాగాన్ని పసిగట్టని కొందరు మేధావులు దేశం మీద దాడి జరిగిందనే విషయాన్ని పలుచన చేస్తున్నారు. కేవలం హిందువులపై జరిగిన దాడులుగానే ప్రచారం చేస్తున్నారు. కానీ, తను తప్పించుకునే అవకాశం ఉన్నప్పటికీ హిందూ బంధువులను కాపాడాలనే ఉద్దేశంతో సయ్యద్ ఆదిల్ హుస్సేన్‌షా అనే ఒక ముస్లిం యువకుడు ఉగ్రవాదిని నిలువరించాడు. ఈ క్రమంలో తను ప్రాణాలను కోల్పోయాడు. కానీ, కొందరు మేధావులు సయ్యద్ దేశభక్తిని, త్యాగాన్ని గుర్తించకపోవడం శోచనీయం. ఈ ఉగ్ర దాడిలో గాయపడిన హిందూ పర్యాటకులను కశ్మీర్ ముస్లింలు తమ భుజాలపై మోసుకెళ్లి కాపాడారు. వారి మానవత్వమూ ఈ మేధావులకు కనిపించడం లేదు. మన దేశంతో సంబంధం లేని ఉగ్రవాది, మతం అడిగి మరీ చంపాడని ఆక్రోశిస్తున్న మేధావులకు మన దేశ పౌరుడు, రైల్వే కానిస్టేబుల్ అయిన చేతన్ సింగ్ ముంబై రైలులో కలియతిరుగుతూ అమాయకులైన తోటి దేశ పౌరులు, ముస్లిం ప్రయాణికులను ఒక్కొక్కరిని కాల్చిచంపిన సంఘటన గుర్తుండే ఉంటుంది. మళ్లీ నేను గుర్తుచేయాల్సిన అవసరం లేదనుకుంటాను. 'జై శ్రీరాం' అనలేదని కొట్టిచంపిన ఉగ్రవాదులు, 'కలిమా' చదువలేదని కాల్చిచంపిన ఉగ్రవాదులు ఒకే రాక్షస సంతతికి చెందినవారుగా మనం గమనించాలి. మతోన్మాదం, మత ఉగ్రవాదంగా మారితే ఎంత ప్రమాదమో%ౌ% తక్కువ కులానికి చెందిన వ్యక్తి గుర్రం ఎక్కినాడని, బుల్లెట్ బండి నడుపుతున్నాడని దాడులు చేస్తూ ప్రాణాలు తీసే కుల ఉగ్రవాదం కూడా దేశ సమగ్రతకు ప్రమాదకరం అన్న విషయాన్ని మనం గుర్తెరగాలి. మత, కుల ఉగ్రవాదులను నేలమట్టం చేసేందుకు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అయితే 2019 ఫిబ్రవరి 14వ తేదీన వందల కిలోల ఆర్డీఎక్స్‌తో దేశంలోకి చొరబడి 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను చంపినవారిని ఇంతవరకు శిక్షించలేదు. అందుకే ఉగ్రదాడులు జరుగుతున్నాయి. వీళ్లేం చేయలేరనే ధైర్యంతో ఉగ్రవాదులు విర్రవీగిపోతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఒక సభలో.. 'కేంద్ర ప్రభుత్వ మిలిటరీ అధీనంలో ఉండే సరిహద్దులు దాటుకొని పేలుడు పదార్థాలు, ఆయుధాలు దేశంలోకి ఎట్లా వస్తున్నాయి? ఉగ్రవాదులు దేశంలోకి ఎట్లా చొరబడుతున్నారు? ఉగ్రవాదుల సంభాషణలు, ఇమెయిల్స్‌ను పసిగట్టడంలో టెలి కమ్యూనికేషన్ శాఖ ఎందుకు విఫలమవుతున్నది? ఇది కేంద్ర నిఘా సంస్థల వైఫల్యం కాదా? ప్రధానమంత్రి వైఫల్యం కాదా?' అని ప్రశ్నించారు. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడు వైరల్ అవుతుండటం గమనార్హం. ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఒక సభలో.. 'కేంద్ర ప్రభుత్వ మిలిటరీ అధీనంలో ఉండే సరిహద్దులు దాటుకొని పేలుడు పదార్థాలు, ఆయుధాలు దేశంలోకి ఎట్లా వస్తున్నాయి? ఉగ్రవాదులు దేశంలోకి ఎట్లా చొరబడుతున్నారు? ఉగ్రవాదుల సంభాషణలు, ఇమెయిల్స్‌ను పసిగట్టడంలో టెలి కమ్యూనికేషన్ శాఖ ఎందుకు విఫలమవుతున్నది? ఇది కేంద్ర నిఘా సంస్థల వైఫల్యం కాదా? ప్రధానమంత్రి వైఫల్యం కాదా?' అని ప్రశ్నించారు. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడు వైరల్ అవుతుండటం గమనార్హం. ఈ ప్రశ్నలన్నింటికి సమాధానాలు ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ చెప్పాలని దేశ ప్రజలు కోరుతున్నారు. పెద్ద నోట్లు రద్దుచేస్తే ఉగ్రవాదం నశించిపోతుందన్నారు, దొంగ నోట్లు ముద్రించలేక తీవ్రవాదులు అడుక్కుతింటారని భ్రమలు కల్పించారు. 370 ఆర్టికల్ రద్దు చేస్తే ఉగ్రవాదులు ఆకలితో అలమటించి ఆత్మహత్యలు చేసుకుంటారని, కశ్మీర్‌లో శాంతి నెలకొంటుందన్నారు. అంతేకాదు, ఇక మనం కూడా కశ్మీర్‌లో భూములు కొనుక్కోవచ్చని గోదీ మీడియా చేసిన ప్రచారాలను నమ్మినవారిలో నేనూ ఒకడిని. అగ్నిపథ్ స్కీం పేరిట భద్రతాదళాల కుదింపు, పర్యాటకులకు భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వ నిఘా వర్గాలు వైఫల్యం చెందడం వల్లనే ఈ ఉగ్రదాడి జరిగిందనేది జగమెరిగిన సత్యం. కానీ, ఈ విషయాన్ని పక్కదారి పట్టించేందుకు కొందరు మేధావులు, గోదీ మీడియా మతం రంగు పులుపుతున్నది. బీజేపీయేతర ప్రభుత్వాలేవీ దేశాన్ని కాపాడలేవని, హిందూ మతాన్ని రక్షించేది ఒక బీజేపీనే అని, హిందువులకు రక్షకుడు మోదీ మాత్రమేనని బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ ప్రచారం చేస్తున్నది. కానీ, బీజేపీ నేతృత్వంలో వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడే కాందహార్ హైజాక్ జరిగింది. కార్గిల్ చొరబాటు జరిగింది. అమర్‌నాథ్ యాత్రికులపై, అక్షరధాం మందిరంపై దాడులు జరిగాయి. వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడే పార్లమెంటు మీద దాడులు జరిగాయి. అంతెందుకు, మన మోదీ ప్రధాని అయ్యాకనే పఠాన్‌కోట్, యూరి సైసిక్టర్, పుల్వామా దాడులు జరిగాయి. కానీ, వీటిగురించి ఈ వాట్సాప్ యూనివర్సిటీ ఏ చర్చ చేయదు. బీజేపీయేతర ప్రభుత్వాల చేతకానితనం వల్లనే ఉగ్రదాడులు జరిగాయని చెప్తున్న వాట్సప్ యూనివర్సిటీ, గోదీ మీడియా%ౌ% మరి ధర్మ రక్షకుడైన మోదీ పాలనలో ఉగ్రవాదులు ఎందుకు యథేచ్ఛగా దాడులు చేయగలుగుతున్నారో చెప్పకపోవడం కడు శోచనీయం. మతోన్మాదం, మత ఉగ్రవాదంగా మారితే ఎంత ప్రమాదమో%ౌ% తక్కువ కులానికి చెందిన వ్యక్తి గుర్రం ఎక్కినాడని, బుల్లెట్ బండి నడుపుతున్నాడని దాడులు చేస్తూ ప్రాణాలు తీసే కుల ఉగ్రవాదం కూడా దేశ సమగ్రతకు ప్రమాదకరం అన్న విషయాన్ని మనం గుర్తెరగాలి. మత, కుల ఉగ్రవాదులను నేలమట్టం చేసేందుకు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. దేశంలో ఒక నేరం జరిగినప్పుడు, ఆ నేరం వల్ల ఎవరు లబ్ధి పొందారనే విషయాన్ని శోధించి వారిని కూడా ఆ నేరంలో భాగం చేయాలి. చట్టం ప్రకారం ఆ ప్రక్రియ అనివార్యం. ఉగ్రదాడుల వల్ల కశ్మీరీలకు కాని, భారత ముస్లిం సమాజానికి కాని జరిగే లాభం ఏమీ లేదు. కశ్మీర్‌ను ఒక సజీవ సమస్యగా ఉంచితే పాకిస్థాన్ రాజకీయ నాయకులకు ఓట్లు పడుతాయి. రాజకీయ లబ్ధి చేకూరుతుంది. భారతీయ సమాజం మతం పేరిట విచ్ఛిన్నమైతే వారికి సంతోషం కలుగుతుంది. ఇలాంటి దుశ్చర్యల వల్ల, మతపరమైన విభజనల వల్ల ఎవరికి లాభం చేకూరుతుందో ఇకనైనా ప్రజలు గమనించాలి. ఉగ్రవాదుల దాడుల్లో 26 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని యావత్ దేశం శోకసంద్రంలో మునిగితే, బీహార్ ఎన్నికలే ప్రధానం అనుకొని ప్రచారం చేసిన ప్రధాని మోదీని ఏమనాలో కూడా ప్రజలే నిర్ణయించాలి. భారత జాతిపిత మహాత్మాగాంధీని చంపిన హంతకుడు నాథూరాం గాడ్సే మొదటి తీవ్రవాది. ఆయన బ్రాహ్మణుడు అయినంత మాత్రాన బ్రాహ్మణ సమాజం మొత్తాన్ని తీవ్రవాదులు అనలేం కదా? ఇందిరా గాంధీని సిక్కు తీవ్రవాదులు హత్యచేసినంత మాత్రాన సిక్కులందరినీ ఖలిస్థానీలు అనలేం కదా? రాజీవ్ గాంధీని తమిళ ఈలం తీవ్రవాదులు చంపినంత మాత్రాన తమిళులందరి మీద ఉగ్రవాద ముద్ర వేయలేం కదా? మణిపూర్‌లో క్రైస్తవులను చంపిన తీవ్రవాదులు హిందువులైనంత మాత్రాన హిందువులందరు ఉగ్రవాదులనడం ఎంత తప్పో, దాయాది దేశ ఉగ్రవాదులు చేసిన దుశ్చర్యలను మొత్తం ముస్లిం సమాజానికి అంటకట్టడం కూడా అంతే తప్పు. అందుకే, విదేశీ ఉగ్రవాదులు చేస్తున్న దుశ్చర్యలకు మన భారతదేశ ముస్లింలను బాధ్యులను చేయడం నిజంగా సిగ్గుచేటు. భారత సమాజం మొత్తం

# సుమతీ శతకంలో చేరని పద్యాలు

సుమతీశతకం యొక్క తాళపత్ర ప్రతులలో ఉన్న, ముద్రిత సంచికల్లో లేకపోయిన పద్యాలను భట్టు వెంకటరావు ఎంపిక చేసి భావవివరణతో అందించారు. ఈ పద్యాలు 1811లో కరుటూరి అచ్చన రాసిన తాళపత్ర ప్రతిలో లభించాయి, వాటిలో కొన్నింటి చివరి పాదాలు మాత్రమే నష్టపోయినవిగా ఉన్నాయి. ఇప్పుడు మనకి దొరికే 'సుమతీశతకం' పుస్తకం లోని 100 లేక 107 పద్యాలను పంతొమ్మిదవ శతాబ్దం పూర్వార్థంలో నాటి పండితులు తాళపత్రాలలో దొరికిన 150 పైచిలుకు పద్యాలలోంచి ఏరి ఒకచోట కూర్చారు. ఇందులో చేరని పద్యాలు కొన్ని ఇప్పటికీ ఆ తాళపత్ర గ్రంథాలలోనే ఉండిపోయాయి. చెన్నైలోని 'ప్రభుత్వ ప్రాచ్య లిఖిత భాండాగారం'లో 'సుమతీశతకం' పూర్వ ప్రతులు మూడు ఉన్నాయి. వాటిల్లో ఒకటి తాళపత్ర ప్రతి. మిగతావి రెండు రాత ప్రతులు. ఈ రెండు రాతప్రతులు సిపి బ్రౌన్ తయారు చేయించినవి. ఇందులోని ఒక ప్రతిలో 'సుమతీశతకం' పద్యాలకు బ్రౌను ఆంగ్లానువాదం కూడా ఉంది. రెండవది 'సుమతీశతకం' పద్యాల పద సూచి. ప్రమోదూత నామ సంవత్సరం, ఫాల్గుణమాసం, బహుళ పంచమీ శుక్రవారం వరకు కరుటూరి అచ్చన రాయడం పూర్తి చేసిన తాళపత్ర ప్రతిలో 115 పద్యాలు ఉన్నాయి (ప్రమోదూత సంవత్సరాలు మనకు 1990%-91, 1930-31, 1870-71, 1810-11, 1750-%51... ఇలా వచ్చాయి. వాటిల్లో ఫాల్గుణమాసం, బహుళ పంచమి శుక్రవారానికి 1811 ఫిబ్రవరి 15వ తేదీ సరిపోతుంది). బ్రౌను తయారు చేయించిన 'సుమతీశతకం' రాత ప్రతికి ఆధారమైన మూల ప్రతి ఏదో తెలియదు. బ్రౌను 'సుమతీశతకం' రాత ప్రతిలో 150 పద్యాలు ఉన్నాయి. ఈ రెండు ప్రతులలోని పద్యాలను పోల్చి చూసుకుంటే బ్రౌను రాతప్రతిలో లేని పద్యాలు కొన్ని అచ్చన రాసిన తాళపత్ర ప్రతిలో ఉన్నాయి. అలాగే అచ్చన తాళపత్ర ప్రతిలో లేని పద్యాలు కొన్ని బ్రౌను రాతప్రతిలో ఉన్నాయి. అయితే, ప్రస్తుతానికి బ్రౌను తయారు చేయించిన 'సుమతీ శతకం' రాత ప్రతిలో లేకుండా, కరుటూరి అచ్చన 1811 ఫిబ్రవరిలో రాసిన తాళపత్ర ప్రతిలో ఉన్న పద్యాలను ఎంచి చూపించడం ముఖ్యమని నాకు అనిపించింది. కారణం%-% ఆ పద్యాలు ఇప్పటి దాకా ఆ తాళపత్ర ప్రతిలోనే ఉండిపోయాయి.

ఆ పద్యాల్లో కూడా కొన్ని పద్యాలు పరిష్కరణకు వీలుకాకుండా ఉన్నాయి. కారణం ఏమిటంటే, తాళపత్ర ప్రతిలో రెండు పత్రాలు పద్యం అంతమయ్యే వైపు మూలల్లో పురుగుపట్టి, పద్యంలో చివరి పాదం మూడు వంతులు కనపడకుండా అయిపోయాయి. అలా కొన్ని పద్యాలు పోగా, పూర్తిగా కొత్తవైన పది పద్యాలను స్వల్ప భావ వివరణతో ఇక్కడ ఇస్తున్నాను. ప్రతి పద్యం నాల్గవపాదం చివరన బ్రాకెట్లలో ఉన్నది తాళపత్ర ప్రతిలోని పద్య సంఖ్య.

కం. భూమీశు చిత్త మెరుగక ప్రేమముతో మనవి జెప్ప బెడగుట లెల్లం పాముకు వాకట్టెరుగక సాముున చెయిచాచినట్టి చందము సుమతీ! (104) 'వాకట్టు' అంటే పాము విషానికి విరుగుడైన 'వాకట్టువేరు'. రాజు సంతోష చిత్తుడై ఉన్నాడో లేడో గ్రహించకుండా ఉల్లాస పరిచే సంగతులు చెబుతూ మధ్యలో తన కోరికను వెళ్ళబుచ్చడం ఎలాంటిదంటే%-% ఆ వాకట్టువేరు దగ్గర లేకుండా పాము ముందు సాహసంతో చేయి చాచడం వంటిది, అని భావం.

కం. తప్పునకు తగిన దండన యప్పుడు శాయంగవలయు నవనీశుకున్ నిప్పునుచీర జుట్టిన యాపగిదిని శాయవలయు నారను సుమతీ! (112) కట్టుకున్న చీరకు నిప్పు అంటుకుంటే ఆర్పడానికి ఎంత తొందరగా పూనుకుంటామో, అంతే తొందరను తప్పు చేసిన వ్యక్తిని దండించడంలోనూ చూపించాలి అని భావం.

కం. నగజాతకు హరుమేనను సగబాలిప్పించె మరుడుబీ చచ్చిన పిదపన్ పగసాధింపని మనుజుడు మగవాడా మగువగాక మహిలో సుమతీ! (105) శివపార్వతులకు జన్మించిన పుత్రుడి వలనే తారకాసురుడి బాధ తొలగుతుందని తెలిసిన ఇంద్రుడు, మన్మథుడిని శివపార్వతుల వద్దకు పంపాడు. కఠోర తపస్సులో ఉన్న శివుడు మూడవకన్ను తెరిస్తే మన్మథుడు భస్మం అయ్యాడు. చివరకు పార్వతి అభ్యర్థనతో మన్మథుడు అనంగుడవగా, పార్వతి శివుడిని చేరింది. వారి పుత్రుడు కుమారస్వామి తారకా సురుడి బాధను తొలగించాడు. ఈ కథ ఆధారంగా%-% మన్మథుడు మరణించి అనంగుడై నప్పటికీ పార్వతిని శివుడిలో సగ భాగం చేసి తన పగ తీర్చుకున్నాడు కదా! అని ఈ పద్యం చమత్కరిస్తుంది. మరణించినప్పటికీ పగసాధించడమే పురుష లక్షణం అని ఇందులో భావం.

# కార్మిక వర్గ ఆశాజ్యోతి కార్ల్ మార్క్స్



కర్నూలు సిటీ : ప్రపంచ కార్మిక వర్గపు ఆశాజ్యోతి కార్ల్ మార్క్స్ అని చైతన్య పార్టీ రాష్ట్ర అధ్యక్షు, కార్యదర్శులు శివ శంకర్ ,క్రాంతి కుమార్ లు పేర్కొన్నారు. నగరంలోని ధర్మ పేట అంబేద్కర్ సర్కిల్ లో కార్ల్ మార్క్స్ 207వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని దోపిడీ నుంచి విముక్తి చేసే గొప్ప సిద్ధాంతాన్ని మార్క్స్ రూపొందించారని తెలిపారు. పెట్టుబడిదారీ సమాజంలో నిరుద్యోగం, పేదరికం రోజురోజుకు తీవ్రమవుతున్నాయని చెప్పారు. ఒక మనిషిని ఇంకొక మనిషి దోపిడీ చేసే వ్యవస్థకు వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని కార్ల్ మార్క్స్ ఉధృతం చేశారని పేర్కొన్నారు. సమాజంలో అందరికీ తిండి, ఇల్లు, బట్ట లాంటి కనీస సౌకర్యాలు అందుబాటులోకి రావాలని, దానికి అనుగుణంగా కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారన్నారు. సమాజంలో రోజురోజుకు పేదల సంఖ్య పెరుగుతోందని, అదే స్థాయిలో కార్పొరేట్ల సంపద కూడా తీవ్రంగా పెరుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ధనిక, పేదల మధ్య అంతరాలు తగ్గించేందుకు మార్క్సిజం కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. శ్రామిక వర్గం కులం, మతం ప్రాతిపదికన కాకుండా శ్రమ ఆధారంగా ఏకం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మార్క్స్ జీవితంలో అనేక త్యాగాలు మనకు స్ఫూర్తిదాయకమని, ఆ త్యాగాల స్ఫూర్తితో సమ సమాజ స్థాపన కోసం సిపిఎం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. మార్క్స్, ఎంగిల్స్ కార్మిక వర్గం కోసం తమ యావదాస్తిని త్యాగం చేయడంతో పాటు కుటుంబంలో అనేక రకాల ఇబ్బందుల్ని ఎదుర్కొని ముందుకు సాగారని అన్నారు. అలాంటి త్యాగ స్ఫూర్తితో దోపిడీ సమాజానికి వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని సమరశీల పోరాటాలకు సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా చైతన్య పార్టీ కార్యకర్తలు మల్యాల నాగరాజు,మహేంద్ర,ప్రసాద్,మోజేష్, రాజేంద్ర ప్రసాద్,ప్రాతకోట పులామారాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టి కార్పొరేషన్ రుణాలను మంజూరు చేయండి. ఎ ఐ బి ఎస్ ఎస్ రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్. ఎస్ కె బాలునాయక్



నంద్యాల. : నంద్యాల. పేదల అభివృద్ధి దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ బాలునాయక్ అన్నారు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ కార్పొరేషన్ నిధులు ఎస్సీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేశారన్నారు ఎస్ టి కార్పొరేషన్ ద్వారా కూడా రుణాలు మంజూరు చేసి గిరిజనులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా పేదలకే కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో మైదాన ప్రాంతంలోని ఏజెన్సీ ప్రాంతంలోఅనేకమంది గిరిజనులు డిగ్రీలు చేసినప్పటికీ ఉద్యోగాలు రాక వయోపరిమితి దాటిపోయి అనేక ఇబ్బందుల గురవుతున్నారని అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వం రుణాలు అందించాలని ఆయన అన్నారు. వ్యవసాయంపై ఆధారపడి ఉన్న గిరిజన రైతులకు సబ్సిడీ నిధులతో ఆదుకోవాలని రైతులకు కావాల్సిన పనిముట్లు కూడా వారికి అందించి వారి అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వానికి కోరారు.

## గ్రామస్తులు నీటి కొరతతో ఇక్కట్లు...

# పరిష్కరించిన హైకోర్టు న్యాయవాది.

-తిప్పే పల్లిలో గత 6 నెలలుగా చేతి పంపు రిపేరీ, నీటి కొరతతో ప్రజలు ఇక్కట్లు.

-నీటి సమస్యను పరిష్కరించిన న్యాయవాది అంజన్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు.



ధర్మవరం రూరల్ : ధర్మవరం మండల పరిధిలోని తిప్పేపల్లి గ్రామంలో గ్రామస్తులు నీటి కొరతతో ఎన్నో తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. దీంతో హైకోర్టు న్యాయవాది అంజన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు చేతి బోరు రిపేరు చేశారు. గత 6 నెలలుగా చేతి బోరు చెడిపోయి గ్రామస్తులు నీటి కొరకు ఎన్నో ఇక్కట్లకు గురి అయ్యే వారిని గ్రామ పూర్వ పిన్న పెద్ద వెంకటనారాయణ రెడ్డి, సాకే కాశి విశ్వనాథ్ తెలిపారు. చేతిపంపు రిపేరీ కావడంతో గ్రామములోని నాగభూషణ, కృష్ణారెడ్డి, పాలన్న,రాజారెడ్డి ,నారాయణస్వామి, చిన్న కేశప్ప, గ్రామ ప్రజలు హైకోర్టు న్యాయవాది అంజన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## వాసవి కన్యకా అమ్మవారి

# మహోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం.

-వాసవి కన్యకా పరమేశ్వరి దేవి జయంతి మహోత్సవ వేడుకలను విజయవంతం చేయండి.


-మే 7వ తేదీ నుండి జయంతి మహోత్సవ వేడుకలు నిర్వహణ.

-ఆర్యవైశ్య సంఘము, వాసవి ఆలయ కమిటీ.



ధర్మవరం రూరల్ : ధర్మవరం పట్టణంలోని కెపిటి వీధిలోగల వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఈనెల 7వ తేదీ బుధవారం వాసవి కన్యకా పరమేశ్వరి దేవి జయంతి మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘము, వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ కమిటీ పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ...... ఈ కార్యక్రమం ఉదయం 5:30 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఉదయం నుంచి సుప్రభాత సేవ, గణపతి పూజ, నవగ్రహ ఆరాధన ,కలశ స్థాపన పంచామృతాభిషేకం, పాండురంగ స్వామి దేవాలయం నుండి మంగళ వాయిద్యాలతో వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలచే కలశములు ఊరేగింపుగా ఆలయమునకు చేర్చుట, వాసవి మాత ఉత్సావ విగ్రహానికి పాలాభిషేకం, శాశ్వత ఉభయదాతలచే వాసవి మాత హోమం, భక్తి గీతాలాపన, ఉయ్యాలోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉయ్యాలో సవం పూజకు శాశ్వత ఉభయ దాతలుగా వాసవి మహిళా మండలి వారు వ్యవహరించడం జరుగుతోందని తెలిపారు. అదేవిధంగా వాసవి జయంతి వేడుకలకు పరోక్షంగా ప్రత్యక్షంగా పరోక్షంగా, నగదు, వస్తు రూపేనా ఇచ్చిన వారందరికీ పేరుపేరునా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా అమ్మవారి రుసుములు బకాయి ఉన్నవారు వెంటనే చెల్లించి రసీదు పొందవలెనని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం, వాసవి మహిళా మండలి, వాసవి భజన మండలి, వాసవి నగర సంకీర్తన బృందం తదితర అనుబంధ సంస్థలు పాల్గొన్నారు.

## 5 నుంచి 18 సం: పిల్లలకు ప్రజా యోగ శిక్షణ.



ధర్మవరం రూరల్ : ధర్మవరం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇంట్యూషన్ ప్రాసెస్-ప్రజా యోగ శిక్షణ ఇస్తోంది. బుధవారం నుండి నిర్వహించనున్నట్టు ఆర్ట్ ఆప్ లిమింగోల్ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుంది. 17 రోజుల పాటు ఈ యోగా శిక్షణ ఉంటుందన్నారు. 5 నుంచి 18 సంవత్సరాల వయస్సుగల పిల్లల కోసం నిర్వహిస్తున్నామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ హాల్ ప్రతినిదులు తెలిపారు. ఈ శిక్షణ వల్ల పిల్లల దృష్టిని పెంచేందుకు, ఒత్తిడిని తగ్గించడానికి ఉపయోగ పడుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9042070246, 9642254375 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# ఆశా వర్కర్ల డిమాండ్ సాధనకు కృషి.

-ఈనెల 20వ తేదీన ఆశ వర్కర్స్ కు ఒక్కరోజు సమ్మె పిలుపు మేరకు

-మెడికల్ ఆఫీసర్ కు వినతి పత్రం అందజేసిన ఆశా వర్కర్లు.



ధర్మవరం రూరల్ : ధర్మవరం రూరల్ మండల పరిధిలోని దర్శనమల పీహెచ్సీలో మంగళవారం మెడికల్ అధికారులకు ఆశ వర్కర్లుకు ఈనెల 20 తేదీన అఖిలభారత కేంద్రం కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో ఒక్కరోజు సమ్మెకు పిలుపునివ్వడం జరిగింది. ఈ సమ్మెలో భాగంగా మెడికల్ ఆఫీసర్ దిలీప్ కుమార్కు, సి హెచ్ ఓ. సాంబశివమ్మకు, సూపర్వైజర్ రాజశేఖర్ రెడ్డికి, ఆశ నోడల్ ఆఫీసర్ జై తుమ్మి కి ఆశ వర్కర్స్ వినత పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ...... ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26, వేలు ఇవ్వాలని కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ను ఆశలుగా మార్పు చేయాలని ఒప్పంద జీవోలు విడుదల చేయాలని, నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని, లేబర్ కోర్స్ రద్దు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, డిమాండ్స్ సాధనకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు మే 20 న జరుగుతున్న దేశవ్యాప్తంగా ధర్నా లో ఆశ వర్కర్ అందరూ పాల్గొంటారని తెలియజేశారు. అదేవిధంగా కార్మికులను యజమానులకు కట్టు బానిసలాగా మార్చే లేబర్ కోర్సును రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ, 26, వేలు చెల్లించాలని ఒప్పంద జీవోలు విడుదల చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు తెలియజేశారు. గత 20 సంవత్సరాలుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నాము. ప్రభుత్వం మా సేవలు గుర్తించి కార్మికులుగా గుర్తించాలని ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నామన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరియు ఆరోగ్యంతో ఆశా వర్కర్లు అర్ధాంతరంగా మరణిస్తే ప్రభుత్వం ఆశ వర్కర్స్ కు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఏజెన్సీలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ను ఆశలుగా మార్పు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుష్ప, సుజాత, ఆదినారాయణమ్మ, సావిత్రమ్మ, భాను బికాశా పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కారానికి చర్యలు

ప్రజాదర్బార్"లో ప్రజా సమస్యలపై వినతి పత్రాల స్వీకరణ

రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ

మంత్రివర్యులు పయ్యావుల కేశవ్



అనంతపురం, : అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచిఅనంతపురం నగరంలోని రాంనగర్ లో ఉన్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ నిర్వహించారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో వివిధ రకాల ప్రజా సమస్యలపై ప్రజల నుంచి వినతి పత్రాలను మంత్రి స్వీకరించారు.ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాంటివని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు, నాయకులు, ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించి, ఎలాంటి ఆలస్యం కాకుండా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తక్షణం చర్యలు తీసుకుంటామని తెలిపారు

# ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి

జూమ్ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్

డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్



అనంతపురం, : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన సందర్భంగా ఏర్పాట్లను త్వరితగతిన, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా పర్యటన నేపథ్యంలో ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం వద్దనున్న హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను పరిశీలించడానికి వస్తున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై జిల్లాలోని ఆయా శాఖల జిల్లా అధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..గౌరవ ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ప్రాంతాలలో ఎక్కడా చెట్లను తొలగించరాదని, న్యాచురల్ గా ఉండాలని, అనవసరమైన ఖర్చులు చేయరాదని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. అనవసర బ్యారికెడ్ లను ఏర్పాటు చేయరాదని, అలాగే సభా ప్రాంగణంలో ఆ గ్రామానికి చెందినవారే ఉండే విధంగా చూడాలని, 14 నియోజకవర్గాల పరిధిలో ఒక్కొక్క నియోజకవర్గ నుండి 10 మంది ఆయకట్టు లబ్ధిదారులు, మొత్తం దాదాపు 3000 మంది మాత్రమే వచ్చేవిధంగా చూడాలని పిడి డిఆర్డిఏ అధికారులకు సూచించారు. హెలిప్యాడ్, కాన్వాయ్, సభా ప్రాంగణం, తదితర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని, కూబింగ్ ఆపరేషన్ త్వరితగతిన పూర్తిచేయాలని, అనుమానితులను గుర్తించాలని, అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల ద్వారా మానిటరింగ్ చేయాలని, అలాగే అవసరం ఉన్నచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వీటిని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లను పూర్తి చేయాలని పోలీస్ శాఖ వారిని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన కాన్వాయ్ గుడ్ కండిషన్ వాహనాలను ఏర్పాటుచేసి వాటిని పరిశీలించి సర్టిపై చేయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. గుంతకల్, కొనకొండ్ల మీదుగా ఉరవకొండ వచ్చే రోడ్డును ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా దారి మళ్లించడం ( డైవర్ట్) చేయడం జరుగుతుందని, దానిని గుంతకల్ నుండి వజ్రకరూరు మీదుగా ఉరవకొండకు చేరుకునే విధంగా చూడాలని తెలిపారు. హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లకు సంబంధించి ఒక టీం వచ్చిందని, వారితో సమన్వయం చేసుకొని ఏర్పాట్లను పూర్తి చేయాలని, అలాగే ఒక తహసీల్దార్ ను లైజాన్ ఆఫీసర్ గా నియమించాలని ఆర్డీఓ అనంతపురం వారికి ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద బ్యారికేడ్ ను, టెంట్, టెంపరరీ టాయిలెట్స్ ను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని వాటిని పూర్తి చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద వాహనాలు పార్కు చేయుటకు ఆర్అండ్బి ఎస్ఈ మరియు పంచాయతీరాజ్ ఎస్ఈ ఏర్పాట్లు చేసుకోవాలని, హెలిప్యాడ్ వద్ద నిరంతరం విద్యుత్ సౌకర్యం ఉండే విధంగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, ఒక ఏఈ, లైన్మెన్ ను ఆర్అండ్బి ఎస్ఈ వారితో సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేయాలని ఎస్పీడీసీఎల్ ఎస్ఈ వారికి ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ త్రాగునీరు, బయో స్టాయిలెట్స్ ను హెలిప్యాడ్ మరియు సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చూడాలని, మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని, డిస్టిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ వారు ప్రోటోకాల్ అరేంజ్మెంట్స్, బ్లాక్ కమాండోస్, స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్, తదితరులకు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఏర్పాట్లను చూసుకోవాలని, శానిటేషన్ పనులను సంబంధించి గుత్తి, గుంతకల్ మున్సిపల్ కమిషనర్లు మరియు డిపిఓ ఇంచార్జిగా ఉంటారని, గ్రీవెన్స్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, దీనికి సంబంధించి డిఆర్ఓ మరియు పిజిఆర్ఎస్ తహసీల్దార్ ఇన్చార్జిగా ఉంటారని, చాలామంది ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమానికి విచ్చేయడం జరుగుతుందని, వారికి సంబంధించి బస చేయడానికి గుంతకల్లులో ఏర్పాట్లను చేయాలని గుంతకల్లు మరియు గుత్తి తహసీల్దార్ లను ఆదేశించారు.అత్యవసర మందులను, అత్యవసర పరికరాలను, డాక్టర్లను, నర్సులను, అంబులెన్సులు, బ్లడ్ డోనర్స్ ను, మెడికల్ టీంలు, పారామెడికల్ స్టాఫ్, హెలిప్యాడ్ మరియు సభ ప్రాంగణం వద్ద క్యాంపులను, కాన్వాయ్ నందు మెడికల్ వాహనాన్ని, ఇతర చోట్ల 108 వాహనాన్ని ఏర్పాటు చేయాలని డిఎంహెచ్వో, డిసిహెచ్ఎస్, జిజిహెచ్ మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బందికి హెలిప్యాడ్, కాన్వాయ్, సభా ప్రాంగణం వద్ద తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ జూమ్ వీడియో కాన్ఫరెన్స్ లో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## నసనకోట దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాల ఏర్పాట్లలో

# పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

గ్రామ పెద్దలు, నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన సునీత, శ్రీరామ్

పరిటాల శ్రీరామ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన డీసీఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేష్

వెంకటాపురంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన సునీత, శ్రీరామ్



రాప్తాడు : రామగిరి మండలం నసనకోట సమీపంలో ఈనెల 14వ తేదీ నుంచి జరగనున్న దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాల ఏర్పాట్లలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ నిమగ్నమయ్యారు. మంగళవారం వారు గ్రామ పెద్దలు నాయకులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు 50 ఏళ్ల తర్వాత ఈ ఉత్సవాలు జరుగుతుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. కోటి 50 లక్షలతో సీసీ రోడ్లు, ఆలయానికి మెట్లు నిర్మాణం, ఆలయం ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులు ఇప్పటికే పూర్తి చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు నిర్వాహకులకు సూచించారు. మరోవైపు ఇటీవల డిసిఎంఎస్





చైర్మన్ గా నియమితులైన నెట్టెం వెంకటేష్ పరిటాల శ్రీరామ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీరామ్ ను ఘనంగా సత్కరించారు. పార్టీలో ఎంతో సీనియర్ నాయకుడుగా ఉన్న వెంకటేష్ కు పార్టీ అధిష్టానం తగిన గుర్తింపు ఇచ్చినందుకు ఆనందంగా ఉందని ఈ సందర్భంగా శ్రీరామ్ అన్నారు. మరోవైపు రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలకు సంబంధించిన టిడిపి నాయకులు పెద్ద ఎత్తున వెంకటాపురం తరలివచ్చారు. పరిటాల సునీతను, పరిటాల శ్రీరామ్ ను పలు కార్యక్రమాలకు ఆహ్వానించారు. నాయకులందరితో సమావేశమై పార్టీకి సంబంధించిన అంశాలను వారు చర్చించారు. సభ్యత్వ నమోదు కార్డులు పంపిణీని వేగవంతం చేయాలని, కే.ఎస్.ఎస్ నియామకాలను త్వరగా పూర్తి చేయాలని వారు సూచించారు.

## శ్రీ అక్కమ్మ గార్ల జాతరలో పాల్గొన్న

# ఎమ్మెల్యే దగ్గుపాటి కుటుంబ సభ్యులు

అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

చిన్ననాటి నుంచి అమ్మవారిని కొలుస్తున్నామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం అర్బన్: ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం కరుట్లపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీ అక్కమ్మ గార్ల జాతర మహోత్సవంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు. జాతర మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే దగ్గుపాటి కి గ్రామస్తులు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఉరుములు వాయిస్తూ అమ్మవారి ఆలయం వరకు వచ్చారు. అనంతరం అమ్మవారికి వెండి గొడుగులు సమర్పించి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆయన సతీమణి దగ్గుపాటి శ్రీలక్ష్మి, కుమార్తె దగ్గుపాటి అశ్రిత, కుమారుడు దగ్గుపాటి మణిహాస్ లు మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులందరిని ఎమ్మెల్యే ఎంతో ఆప్యాయంగా పలుకరించారు. చిన్ననాటి నుంచి అక్కమ్మ అమ్మవారిని కొలుస్తుంటామని ఇవాళ ఎమ్మెల్యే అయ్యాక జాతరలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి కృపా కటాక్షాలు ఈ ప్రాంతంపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరుట్లపల్లి మాజీ సర్పంచ్ బోయపాటి శ్రీనివాస్ నాయుడు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ సోమర జయచంద్ర నాయుడు, టిడిపి నాయకులు సింగమనేని రామాంజనేయులు, బోయపాటి అశోక్, సుందర్, బోయపాటి శ్రీధర్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కుటుంబసభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గృహనిర్మాణ ప్రాజెక్టులను వేగవంతం చేయండి

డివిజన్ స్థాయిలో ఆర్డీవోల ఆధ్వర్యంలో గృహ నిర్మాణ పనులపై సమీక్షించాలి

జిల్లాలో గృహాల పురోగతిని నిర్ధారించడానికి, క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించడానికి

సంబంధిత అధికారులతో హౌసింగ్ పీడీ సమీక్ష సమావేశాలు నిర్వహించాలి

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం



పుట్టపర్తి, : గృహనిర్మాణ ప్రాజెక్టులను వేగవంతం చేయండి అని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మిని కాన్ఫరెన్స్ హాలు నందు గృహ నిర్మాణ పనులకు సంబంధించి పురోగతిపై హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, హౌసింగ్ డిఇలు, ఈ ఈలు, ఏ ఈ ఈ, సి ఎల్ టి సి అధికారుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జూన్లో సామూహిక 'గృహప్రవేశం' నిర్వహించి, మూడు లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలనే ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రణాళికను జిల్లా కలెక్టర్ గుర్తు చేశారు జిల్లాలో జూన్ 12 తేదీ నాటికి 10 368 ఇళ్లు పూర్తి చేయాలి, వాటిలో 7020 ఇళ్లు ఇంకా పూర్తి కాలేదు. గృహనిర్మాణ ప్రాజెక్టుల నిర్మాణానికి వేసవి అనుకూలంగా ఉన్నందున వారి లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవోల ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డీఈ ఈ లు సమీక్ష సమావేశాలు నిర్వహించుకోవాలని ఆదేశించారు మండల స్థాయిలో కూడా సంబంధిత మండల అధికారులుఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశాలు నిర్వహించుకోవాలని తెలిపారు స్వర్ణాంధ్ర 2047 విజన్ లో భాగంగా 2029 నాటికి అందరికీ ఇళ్లు నిర్మాణ కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు.

# సజావుగా ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షలు

## డిఆర్ఓ విజయ సారథి



పుట్టపర్తి.: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షలను సజావుగా నిర్వహించాలని డిఆర్ఓ విజయ సారధి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని డిఆర్ఓ ఛాంబర్ నందు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షలు ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి ఐ ఈ ఓ, సయ్యద్ మౌలా, డి.ఎస్.పి, విజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ మే నెల 12వ తేదీ నుండి జరగబోవు ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఎలాంటి పొరపాటులకు తావివ్వకుండా జాగ్రత్తగా మీకు కేటాయించిన విధులు సక్రంగా నిర్వర్తించాలని తెలిపారు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీ సయ్యద్ మౌలా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉదయం 36 సెంటర్ ల యందు, మధ్యాహ్నం 22 సెంటర్ల యందు పరీక్షలు జరుగును. 20 పోలీస్ స్టేషన్ల యందు ప్రశ్నాపత్రాల నిలువ చేయబడుతున్నాయి. పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ లు, సిటింగ్ స్క్వాడ్ లు ఏర్పాటు చేయబడ్డాయి. జిల్లా పరీక్ష నిర్వహణ కమిటీ మెంబర్లుగా శ్రీ రామరాజు, శ్రీ చెన్నకేశవ ప్రసాద్ మరియు శ్రీనివాసులు నియమించబడ్డారు. డిస్ట్రిక్ట్ బల్క్ ఇన్చార్జిగా వెంకటేశ్వర ప్రసాద్ నియమించబడ్డారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని, సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు త్రాగునీటి, ఫస్ట్ ఎయిడ్ సెంటర్, పరీక్షల సమయంలో ఎ విద్యార్థి కూడా సెల్ ఫోన్లు తీసుకొని రాకూడదు, పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి జిరాక్స్ షాపులు అనుమతించబడవు, పటిష్టమైన బందోబస్తు ద్వారా పరీక్షలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు, పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ ఉండే విధంగా విద్యుత్ శాఖ అధికారులు కృషి చేయాలని తెలిపారు. సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారి సంపత్ కుమార్, లేబర్ అధికారి సూర్యనారాయణ, విద్యాశాఖ అధికారి లింగన్న, పోస్టల్ శాఖ అధికారి విజయ్, రవాణాశాఖ అధికారి హీనయతుల్లా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# అనంతపురం సర్వజనాసుపత్రిని 1200 పడకులకు విస్తరిస్తాం

సర్వజనాసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నాం

ఆర్ఓ ప్లాంట్ ప్రారంభోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి

సప్తగిరి క్యాంపర్ సేవా కార్యక్రమాలను అభినందించిన ఎమ్మెల్యే

స్వచ్ఛంద సంస్థల సహకారం చాలా అవసరమన్న ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం అర్బన్ : అనంతపురం సర్వజనాసుపత్రిని 1200 పడకల ఆసుపత్రిగా త్వరలో విస్తరిస్తామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరంలోని జేఎన్టీయూ రోడ్ లో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సప్తగిరి క్యాంపర్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్లతో పాటు వైద్యాధికారులు, సప్తగిరి క్యాంపర్ ప్రతినిధులు మరియు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు. ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ సప్తగిరి క్యాంపర్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఇప్పటికే సర్వజనాసుపత్రితో పాటు సిడి హాస్పిటల్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలలో 25 లక్షలతో ఆర్.ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయడం రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వీల్ చైర్లు, ఫ్యాన్లు, కూలర్లు తదితర వాటిని అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పేదలకు వైద్య సేవలు అందించే ఆసుపత్రులలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం వలన ఎంతో మందికి ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి వాటిని కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మరోవైపు అనంతపురం సర్వజనాసుపత్రిలో అవసరమైన భవనాల నిర్మాణానికి 38 కోట్ల తో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా వైద్య ఆరోగ్యశాఖ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివరించారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సన్మానించారు.

మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL



## భూ భారతి చట్టంతో భూ సర్వే చేసి పూర్తి వివరాలను సేకరించాలి - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్...



కామారెడ్డి : మంగళవారం నాడు కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం నల్లమడుగు, ముంబాజీపేట గ్రామంలో భూ భారతి సర్వే టీమ్ లు క్షేత్ర పర్యటన చేసి సర్వే భూ వివరాలు, పాసు పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్న వాటి వివరాలను కలెక్టర్ పరిశీలించారు. భూ భారతి చట్టం ప్రకారం భూ సర్వే చేసి పూర్తి వివరాలను సేకరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టం ప్రకారం సాగు చేస్తున్న భూముల వివరాలు, ఎన్ని సంవత్సరాల నుండి సాగు చేస్తున్నారు, సర్వే నెంబర్, భూ విస్తీర్ణం, సాగు చేస్తున్న రైతుల సంఖ్య, తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అటవీ ప్రాంతమా లేక పట్టా భూమా అనే వివరాలు అటవీ శాఖ అధికారులు, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేయాలని సూచించారు. ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూ వివరాలను సంబంధిత రైతులను అడిగి తెలుసుకున్నారు. చట్టం ప్రకారం భూముల వివరాలు సేకరించి ఎలాంటి సమస్యలకు తావులేనట్లయితే పట్టాలకు సిఫారసు చేయాలని సూచించారు. అనంతరం లింగంపేట్ మండలం భవానీపేట్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను జిల్లా కలెక్టర్ సందర్శించి, కొనుగోళ్ల వివరాలు, రైతుల వివరాలు, కేంద్రాల్లో వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, భూ భారతి ప్రత్యేక అధికారి రాజేందర్, రెవిన్యూ, పౌరసరఫరాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి రోజు కార్యాచరణ ప్రణాళికతో నాణ్యత గల దర్యాప్తు చేయాలి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర...

కామారెడ్డి : సోమవారం నాడు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర కామారెడ్డి జిల్లా బీర్కూర్ మరియు బాన్సువాడ



పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్ టీమ్, ఎస్హెచ్ఓ, మెన్ రెస్ట్‌రూమ్, లాక్ అప్ రూమ్, స్టేషన్ పరిసరాలు, పార్కింగ్ స్థలాలను సుదీర్ఘంగా పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది విధి నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు కార్యాచరణ ప్రణాళికతో నాణ్యత గల దర్యాప్తు చేయాలని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి రోజు స్పష్టమైన ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఆధారంగా పని చేయాలని, ప్రతి కేసులో దర్యాప్తు నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలు పోలీస్ స్టేషన్‌కు నమ్మకంతో వస్తారన్న విషయాన్ని గమనించి, ఆ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పోలీసులు సేవలు చేయాలన్నారు. అత్యవసర సేవలైన డయల్ - 100 కాల్స్‌కు బ్లూ కోల్ట్స్ సిబ్బంది తక్షణమే స్పందించాలన్నారు. ఆన్లైన్ బెట్టింగ్స్, సైబర్ క్రైమ్‌లపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల సమన్వయంతో పని చేయాలని సూచించారు. అదేవిధముగా రోడ్డు భద్రత నియమ నిబంధనలపై ప్రజలకు అవగాహణ కల్పించాలన్నారు. విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. గస్తీ బందోబస్తును పగడ్బందీగా నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న అందరితో మాట్లాడి తగు సూచనలు సలహాలు చేయడం జరిగింది. అలాగే స్టేషన్ పరిసరాల్లో శుభ్రత, ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించి దొంగతనాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కేటాయించిన గ్రామాలను సంబంధిత పోలీసు అధికారి తరచూ సందర్శించి సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు, యస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భేష్..సవితమ్మ

కర్నూలు : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత మరోసారి మానవత్వాన్ని చూపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యాన్ డ్రైవర్, క్లీనర్ కు దగ్గరుండి ప్రాథమిక వైద్యమందించి, సపర్యలు చేయించారు. 108 వాహనానికి ఫోన్ చేసి, క్షతగాత్రులను తరలించారు. మంత్రి సవిత సహాయక చర్యలను స్థానికులు, వాహనదారులు కొనియాడారు. మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత డోన్ లో నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని పెనుకొండకు తిరిగి పయనమయ్యారు. అదే సమయంలో డోన్ సమీపంలో బుచ్చయ్యగారిపల్లె నుంచి హైదరాబాద్ కు మామిడి కాయల లోడ్ తో వెళుతున్న వ్యాన్ ఓబిలాపురం సమీపంలో టైర్ పేలిపోవడంతో బోల్తా పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ కు గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న మంత్రి సవిత...తన కాన్వాయ్ ను ఆపి క్షతగాత్రులను పరామర్శించారు. 108 వాహనంలో వచ్చేలోగా, తన కాన్వాయ్ లో ఉన్న ప్రథమ చికిత్స కిట్ తో క్షతగాత్రులకు తన సిబ్బందితో వైద్య సాయమందించారు. డోన్ ప్రభుత్వాసుపత్రి వైద్యులతో మాట్లాడి, మెరుగైన వైద్యమందించాలని మంత్రి ఆదేశించారు. స్వల్ప గాయాలయ్యాయని, ప్రమాదం ఏమీ లేదని క్షతగాత్రులను ఓదార్చి విజయవాడకు మంత్రి సవిత పయనమయ్యారు. ప్రమాదం జరిగిన విషయాన్ని గుర్తించిన వెంటనే, కాన్వాయ్ ను ఆపి క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించిన మంత్రి సవితపై స్థానికులు, వాహనదారులు ప్రశంసలు కురిపించారు.



## ఏసీబీకి చిక్కిన జిల్లా పరిషత్ జూనియర్ అసిస్టెంట్...

ములుగు : ములుగు జిల్లా పరిషత్‌లో జూనియర్ అసిస్టెంట్‌ను ఏసీబీ చాకచక్యంగా పట్టుకుంది. ఏసీబీ



అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా ప్రధాన కార్యనిర్వహణాధికారి కార్యాలయం, జిల్లా ప్రజా పరిషత్ సూపరింటెండెంట్ సానికొన్ను సౌమ్య ఫిర్యాదుదారుడి వైద్య సెలవుల కోసం జీతం బిల్లులను సిద్ధం చేయడానికి మరియు ములుగు జిల్లా ట్రెజరీ కార్యాలయానికి సమర్పించడానికి అధికారిక అనుకూలంగా వ్యవహరించినందుకు ఫిర్యాదుదారుడి నుండి 25,000 వేల రూపాయలు లంచం డిమాండ్ చేసి స్వీకరించినందుకు తెలంగాణ యాంటీ కరప్షన్ బ్యూరో అధికారులు పట్టుకున్నారు. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగిన సందర్భంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి ఏసీబీ తెలంగాణ టోల్ ఫ్రీ నంబర్ 1064 ను ప్రజలు సంప్రదించాలని అభ్యర్థించారు. ఏసీబీని వాట్సాప్ - 9440446106, ఫేస్ బుక్ (తెలంగాణ ఏసీబీ) మరియు వెబ్‌సైట్ ద్వారా కూడా సంప్రదించవచ్చు, ఫిర్యాదుదారు / బాధితుడి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

## కారు డోర్లో తరలిస్తున్న 23 కిలోల గంజాయి సీజ్ చేసిన పోలీసులు

### విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,

### మంగళపాలెం కూడలి వద్ద వాహన తనిఖీలు చేపట్టి, గంజాయి పట్టుకున్న కొత్తవలస పోలీసులు

### చాకచక్యంగా పట్టుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,



విజయనగరం : విజయనగరం జిల్లా కొత్తవలస పోలీసు స్టేషను పరిధిలోని మంగళపాలెం కూడలి వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టి, పక్కా సమాచారంతో 23 కిలోల గంజాయిని, ఒక కారు డోరులో పెట్టి అక్రమ రవాణకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను కొత్తవలస పోలీసులు అరెస్టు చేసినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మే 6న తెలిపారు.వివరాల్లోకి వెళ్ళితే.. కొత్తవలస పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో కొత్తవలస సిఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో ఎస్ఐ మన్మధరావు పోలీసు సిబ్బంది మే 5న మంగళపాలెం కూడలి వద్ద వాహన తనిఖీలు చేపట్టగా,కొత్తవలస వైపు నుండి విశాఖపట్నం వైపు ఒక వ్యక్తి ఎపి 39 ఏఈ 7502 నెంబరు పల్సర్ మోటారు సైకిల్ పై వస్తూ పోలీసులను వాహన తనిఖీలు చేస్తుండగా మోటారు సైకిల్ వదిలి అక్కడ నుండి పరారైనట్లు, ఆ వెనుకనే వస్తున్న ఒక స్విఫ్ట్ డిజైర్ ఎపి 39 ఎఫ్ పి 9061 నెంబరు గల కారు 50 అడుగుల దూరంలో డ్రైవరు పోలీసులను చూసి వెనక్కి త్రిప్పే ప్రయత్నం చేయగా వెంటనే ఎస్సై మన్మధరావు తన సిబ్బందితో సదరు కారును స్వాధీనం చేసుకొని, కారు డ్రైవరుతో పాటు మరోక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారన్నారు. కారును క్షుణ్ణంగా పరిశీలించగా కారు యొక్క డోరులో 23 కేజీల బరువుగల 48 గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారన్నారు. పట్టుబడిన ఇద్దరు నిందితులను విచారణ చేయగా ఒరిస్సా నుండి హైదరాబాద్కు తరలించేందుకు గంజాయిని కొనుగోలు చేసి, ఎవ్వరికీ అనుమానం రాకుండా కారు యొక్క డోరులో గంజాయి ప్యాకెట్లు పెట్టి, హైదరాబాదు తరలిస్తుండగా పట్టుబడ్డారన్నారు. నిందితులు రేగిడి సమీపంలోని పెద్దచర్ల గ్రామానికి చెందిన ఎ-1 పి.జనార్ధనరావు, ఎ-2 పి.రాంబాబులు గా గుర్తించామని జిల్లా ఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద నుండి 23 కిలోల గంజాయి, స్విఫ్ట్ డిజైర్ కారు, ఒక పల్సర్ బైక్ను రెవిన్యూ అధికారుల సమక్షంలో సీజ్ చేసి, కేసు నమోదు చేసి ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండుకు తరలించారని జిల్లా ఎస్పీ తెలిపారు.పట్టుబడిన 23 కిలోల గంజాయి విలువ రూ. 2లక్షలు ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. విచారణలో ఈ కేసులో గంజాయి అక్రమ రవాణాకు బైక్పై పైలట్గా వ్యవహరించి పరారైన వ్యక్తికి సంబంధం ఉన్నట్లుగా గుర్తించామని, అతన్ని కూడా త్వరలో అరెస్టు చేస్తామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు జిల్లాలో ఏర్పాటు చేసిన ఐదు చెక్ పోస్టులు మరియు ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో ఎప్పటికప్పుడు నిరంతరం డైనమిక్ వాహన తనిఖీలు చేపడుతున్న కారణంగా ఇటీవల గంజాయి పట్టుకోగలుగు తున్నామన్నారు. గంజాయి పట్టుకోవడంలో సమర్ధవంతంగా పని చేసిన కొత్తవలస సిఐ షణ్ముఖరావు, ఎస్సై మన్మధరావు మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు.

## వర్షాల వేళ ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలి.


### జిల్లాలో పలు చోట్ల పిడుగులు పడే అవకాశం

### ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేప్పుడు చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ ఉండరాదు

### సురక్షితమైన భవనాల్లో ప్రతి ఒక్కరూ ఆశ్రయం పొందాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,

అనంతపురం, : వర్షాల వేళ ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సూచించారు. ఏపీ విపత్తుల సంస్థ సూచనల మేరకు జిల్లాలో పలు చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేపుడు చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ ఉండరాదన్నారు. సురక్షితమైన భవనాల్లో ప్రతి ఒక్కరూ ఆశ్రయం పొందాలని, వర్షాల వేళ అందరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.



**ఉరుములు, పిడుగుపాటు సమయంలో పాటించవలసిన జాగ్రత్తలు :**

**చేయవలసినవి..:**

వాతావరణ సూచనలను గమనించి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు బయట పనులు, కార్యక్రమాలు వీలైనంత వరకు ఆపుకోవలెను.పొలాల్లో పనిచేసే రైతులు. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు, పశుకాపరులు, గొర్రెల కాపరులు, సురక్షితమైన భవనాలలోకి వెళ్ళాలి.బహిరంగ ప్రదేశాలలో ఉన్నట్లయితే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. లేకుంటే రబ్బరు చెప్పులను ధరించి చెవులను మూసుకొని మోకాలిపై కూర్చోవాలి.ఇంట్లో ఉన్నట్లయితే కిటికీలు, తలుపులు మూసివేయాలి. ఉరుముల శబ్దం ఆగిపోయిన తర్వాత కూడా 30 నిమిషాల వరకు ఇంట్లోనే ఉండి రక్షణ పొందండి.పిడుగు భాదితుడిని సత్వరమే దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తరలించవలెను.

**చేయకూడనివి :**

ఉరుములు, మెరుపులు సంభవించినప్పుడు చెట్ల క్రింద, చెట్ల సమీపంలో, టవర్లు, చెరువుల దగ్గర ఉండరాదు.బహిరంగ ప్రదేశాలలో ఉన్న షెడ్లు, ఇంటి పైన ఇతర చిన్న నిర్మాణాలలో ఉండరాదు.ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర పరికరాలు, చార్జ్ ఫోన్లు/మొబైల్స్ వినియోగించరాదు.పిడుగుల సమయంలో స్నానం చేయడం, చేతులను కడగటం, నీటిలో ఉండటం లాంటివి చేయరాదు.మోటరు సైకిళ్ళు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, ట్రాన్స్ ఫార్మర్స్ కు వ్రేలాడుతున్న విద్యుత్ తీగలకు మరియు ఇతర ఇనుప వస్తువులకు దూరంగా ఉండాలి

## చేనేతలకు స్వర్ణయుగం

### నేతన్నలకు 365 రోజులు పని కల్పించాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం

### రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత



కర్నూలు, : మన ప్రభుత్వంలో చేనేతలకు స్వర్ణయుగం వచ్చిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు..మే ఒకటవ తేదీన నెల్లూరు జిల్లాలో 175 నియోజకవర్గాలకు ఒకటి చొప్పున 175 ఎమ్మె ఏం ఈ పార్కులకు వర్చువల్ గా భూమి పూజ నిర్వహించిన సందర్భంగా ఎమ్మిగనూరు నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం ఎమ్మిగనూరు మండలం బనవాసి లో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు చేనేతల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారన్నారు. గత ప్రభుత్వం చేనేతలకు ఎటువంటి మేలు చేకూర్చలేదన్నారు... మంగళగిరిలో చేనేతలు పడుతున్న ఇబ్బందులు దగ్గరుండి చూసినందువల్ల తాను చేనేత జౌళి శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తనని పిలిచి చేనేతలను బాగా చూసుకోవాలని చెప్పారన్నారు..మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం పవర్ లూమ్ కి 500 యూనిట్లు, హ్యాండ్లూమ్ కి 200 యూనిట్లు ఉచిత కరెంట్ అమలు పరుస్తున్నామన్నారు.అంతే కాకుండా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి నెల ఒక్కొక్క చోట ఎగ్జిబిషన్ లను ఏర్పాటు చేసి వారికి సౌకర్యంగా అన్ని సదుపాయాలు కూడా ఏర్పాటు చేసి వారికి కావాల్సిన ఏర్పాట్లు కూడా చేస్తున్నామన్నారు..ముఖ్యమంత్రి చేసిన కృషి వల్ల రాష్ట్రానికి చాలా క్లస్టర్లు మంజూరు చేసి రూ.348 కోట్లు కేటాయించారన్నారు.. చేనేతలకు లేటెస్ట్ డిజైన్ల శిక్షణ ఇచ్చేందుకు గాను స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లను ఏర్పాటు చేయబోతున్నామని, ఎమ్మిగనూరు లో కూడా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్రేమ్ లూమ్స్ కావాలనుకునే వారందరికీ వారికి అర్హత ప్రకారం 90 శాతం సబ్సిడీతో ఫ్రేమ్ లూమ్స్ కూడా చేనేతలకు ఇస్తామన్నారు. ఇచ్చిన హామీ మేరకు త్రిఫ్ట్ ఫండ్ కూడా 5 కోట్ల రూపాయలు అందచేస్తామన్నారు..అంతేకాకుండా విశాఖలో 172 కోట్ల రూపాయలతో నిర్మించిన యూనిటీ మాల్ ను కూడా ప్రధానమంత్రి ప్రారంభి ంచారన్నారు.. అందులో మన చేనేతలు తయారుచేసిన వస్త్రాలు ఎగ్జిబిషన్స్ లో నిరంతరంగా పెట్టుకో వచ్చునన్నారు. ప్రతి చేనేతకు 365 రోజులు పని కల్పించాలనదే రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల లక్ష్యమన్నారు.రానున్న రోజుల్లో చేనేతలకు హెల్త్ పాలసీ కూడా ఇవ్వబోతున్నామన్నారు... అదే విధంగా ఇచ్చిన మాట ప్రకారం చేనేతలకు పెన్షన్ కూడా పెంచామన్నారు... మెగా టెక్స్టైల్ పార్క్ ను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు... 25 ఎకరాల్లో హ్యాండ్లూమ్ పార్క్, మిగతా భూమిలో ఇండస్ట్రియల్ టెక్స్టైల్ పార్క్ తీసుకొని వచ్చి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు పెంచామని, న్నా క్యాంటీన్ లు ప్రారంభించామని, దీపం 2 పథకం కింద ఉచిత సిలిండర్లు అందించామని, ఉచిత ఇసుక అందించామని మంత్రి తెలిపారు. పల్లె పండుగ ద్వారా రోడ్ల మీద గుంతలను పూడ్చామన్నారు.. ఇచ్చిన మాట ప్రకారం కర్నూలు కు హై కోర్టు బెంచ్ తీసుకొని వస్తున్నామని, అదే విధంగా డ్రోన్ హబ్ ను కూడా తీసుకొని వస్తున్నామని మంత్రి సవితమ్మ పేర్కొన్నారు.

## రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల వద్ద భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించండి

### రైలు కార్యకలాపాలలో భద్రతను నిర్ధారించండి

### దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ అరుణ్ కుమార్ జైన్

విజయవాడ : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ అరుణ్ కుమార్ జైన్ అన్ని లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద ప్రామాణిక భద్రతా విధానాలను ఖచ్చితంగా పాటించాలని మరియు రైలు కార్యకలాపాలలో భద్రతను నిర్ధారించాలని అధికారులు మరియు సిబ్బందికి సూచించారు. ఈరోజు,అనగా మే 6, న సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో భద్రతపై వివరణాత్మక సమీక్షా సమావేశం జరిగింది.ఈ సమీక్షా సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ శ్రీ నీరజ్ అగ్రవాల్, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతోపాటు మొత్తం 6 డివిజన్లు అనగా సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు మరియు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డి.ఆర్.ఎమ్ లు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.జనరల్ మేనేజర్ రైలు కార్యకలాపాల భద్రతను నొక్కి చెబుతూ, రైలు కార్యకలాపాలలో సమన్వయాన్ని ఖచ్చితంగా పాటించాలని మరియు రైళ్లను నడుపుతున్నప్పుడు అన్ని భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైళ్లు మరియు రోడ్డు ప్రయాణికుల భద్రతను నిర్ధారించడానికి జోన్ వ్యాప్తంగా లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద ప్రామాణిక భద్రతా ప్రోటోకాల్‌లను ఖచ్చితంగా పాటించాలని ఆయన సిబ్బంది/అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక భద్రతా చర్యలు, ట్రాక్ భద్రత, విద్యుత్ మరియు సిగ్నలింగ్ అంశాలు మొదలైన వాటిపై కూడా ఆయన సమీక్షించారు మరియు పొగమంచు భద్రతా పరికరాల లభ్యతపై కూడా చర్చించారు. రైళ్లలో అగ్నిమాపక యంత్రాలను సరిగ్గా బిగించాలని మరియు అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులు అనుసరించాల్సిన భద్రతా సూచనలు/మార్గదర్శక బోర్డులు/పోస్టర్‌లను ప్రదర్శించాలని ఆయన అధికారులను ఆదేశించారు.శ్రీ అరుణ్ కుమార్ జైన్ ఆర్‌యుబిల (రోడ్ అండర్ బ్రిడ్జిలు) వద్ద నీరు నిలిచే ప్రదేశాలను ప్రాధాన్యతపై గుర్తించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమన్వయంతో నీరు నిలువకుండా చేయాలని ఆయన అధికారులకు సూచించారు. జనరల్ మేనేజర్ ట్రాక్ వెంట కంచె (ఫెన్సింగ్) పనుల పురోగతిపై చర్చిస్తూ అధికారులను పశువులు ట్రాక్‌లపైకి ప్రవేశించే సున్నిత ప్రదేశాలను గుర్తించి, పశువుల రాకను తగ్గించడానికి వెంటనే ఫెన్సింగ్ పనులను చేపట్టాలని ఆదేశించారు. పశువుల రన్‌ఓవర్‌లపై రైతులకు అవగాహన కల్పించాలని మరియు అవాంఛనీయ సంఘటనలను నివారించడానికి ట్రాక్ పెట్రోలింగ్‌ను బలోపేతం చేయాలని ఆయన సూచించారు.తరువాత, జనరల్ మేనేజర్ అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అన్ని స్టేషన్లలో జరుగుతున్న స్టేషన్ పునరాభివృద్ధి పనులను సమీక్షించాలని డివిజనల్ రైల్వేమేనేజర్లను ఆదేశించారు. ప్రయాణీకుల భద్రత చాలా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో నిర్మాణ సమయంలో అన్ని భద్రతా చర్యలను ఖచ్చితంగా పాటించాలని మరియు భద్రతా నిబంధనలను పాటించడంలో రాజీ పడకూడదని ఆయన అధికారులను ఆదేశించారు. 12 మీటర్ల వెడల్పు గల పాదచారుల వంతెనల నిర్మాణ నాణ్యతపై దృష్టి పెట్టాలని మరియు అవసరమైనచో మెరుగైన భద్రత కోసం అవసరమైన డిజైన్ అంశాన్ని సమీక్షించాలని కూడా ఆయన ఆదేశించారు.



# జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గా కన్నూరి సాయి తేజ..



రామగుండం:: మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రియమైన శిష్యుడు, జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కన్నూరి సాయి తేజ రామగుండం నియోజకవర్గం కార్పొరేషన్ 14వ డివిజన్ చైతన్యపురి కాలనీ చెందిన కన్నూరి సాయి తేజను నియమానిస్తూ నేషనల్ కాంగ్రెస్ వర్కింగ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కన్నూరి సాయి తేజను గుల్వెందర్ మెహతా ఉత్తరాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కన్నూరి సాయి తేజ మాట్లాడుతూ తన నియామకాన్ని సహకరించిన మల్లికార్జున కార్గే సోనియా గాంధీ రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ మీనాక్షి నటరాజ సచిన్ పైలెట్ గులివేందర్ మెహతా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బట్టి విక్రమార్క దుద్దిల్ల శ్రీధర్ బాబు కు ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ కృతజ్ఞతలు తెలిపారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



శేరిలింగంపల్లి:: శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా శేరిలింగంపల్లి డివిజన్ అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ లోగల స్ప్రింగ్ వ్యాలీ లో సుమారు రూ. 80 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు



పనులకు పిఏసీ ఛైర్మెన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరేఖపూడి గాంధీ తో కలిసి శంకుస్థాపన చేసిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ . ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ లో దశల వారిగా సీసీ రోడ్ల పనులను చేస్తున్నామని రోడ్డు నిర్మాణ పనుల్లో స్థానిక కాలనీవాసులు సహకరించాలని కోరారు. కాలనీలలో ఎటువంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమం జోడేడ్ల మాదిరి సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, పద్మారావు, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, మల్లేష్, స్ప్రింగ్ వ్యాలీ ప్రెసిడెంట్ సాయి చౌదరి, వైస్ ప్రెసిడెంట్ మనోజ్, జనరల్ సెక్రటరీ చైతన్య, ట్రెజరర్ నర్సింహా రెడ్డి, జాయింట్ సెక్రటరీ రాజేష్, అడ్వైసరీ వైభవ్, శ్రీనివాస్, లక్ష్మి ప్రసన్న, లక్మి ప్రియా, రమణి, సమీర, స్ప్రింగ్ వ్యాలీ సొసైటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య బాంధవుడు మన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి..

## నీలిమ హాస్పటల్లో రూపాయి ఖర్చు లేకుండా మండల ప్రజలకు నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా వైద్యం.

## ఎమ్మెల్యే పల్లా రాజశేఖర్ రెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసిన బిఆర్ఎస్ నాయకులు



బచ్చన్నపేట: ప్రజల ఆపద బాంధవుడు , ఆరోగ్య బాంధవుడు మన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అని మండల బిఆర్ఎస్ నాయకులు ఇర్రి రమణారెడ్డి, బోడిగం చంద్రారెడ్డి, చల్ల శ్రీనివాసరెడ్డి, గంగం సతీష్ రెడ్డి, పులిగిల్ల పూర్ణచందర్, జితేందర్ రెడ్డి, ఈదులకంటి ప్రతాప్ రెడ్డి, కనకయ్య గౌడ్ లు అన్నారు. ఈ సందర్భంగా ఘట్కేసర్ లో ఉన్న నీలిమ ఆసుపత్రిని సందర్శించి అందులో చికిత్స పొందుతున్న బచ్చన్నపేట మండల ,జనగామ నియోజకవర్గం ప్రజలను పరామర్శించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా మండల ప్రజలకు నియోజకవర్గ ప్రజలకు లక్షల వైద్యమును ఉచితంగా అందిస్తున్నందుకు నీలిమ మేడంకు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి బిఆర్ఎస్ నాయకులు అందరూ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచులు, మండల సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


# శేరిలింగంపల్లి నూతన జోనల్ కమీషనర్ హేమంత్ భోర?డే ని, డిప్యూటీ కమీషనర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన హేమంత్ భోర?డే ఐఏఎస్ ని, డిప్యూటీ కమీషనర్ ప్రశాంతి ఎల్ఎల్బి , ఎంబీఏ ని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలబొకే ఇచ్చి సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి డివిజన్ లో నెలకొన్న పలు సమస్యలను, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై జోనల్ కమీషనర్ తో చర్చించామని తెలిపారు. అసంపూర్తిగా మిగిలిపోయిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

# 2025 మే 20 దేశవ్యాపిత కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

శేరిలింగంపల్లి: బహుజన, వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ (ఏ ఐసీటుయూ, ఏఐఎఫ్టియు , బి ఎల్ టి యు , ఐ ఎఫ్ టి యు ,బి ఎఫ్ టి యు , టి ఎఫ్ టి యు , టి యు సి ఐ , కె ఎస్ పి ఎస్ , టిబిఎన్సీకేయు ,టి ఎస్ కే పి ఎస్ ,అసంఘటీత కార్మిక సంఘాల



బహుజన, వామపక్ష కార్మిక సంఘాల (జె.ఎ.సి.)

సమ్మె నోటీసు

శ్రీయుత గౌరవనీయులైన లేబర్ కమిషనర్ గారికి
అంజయ్య భవన్, ఆర్టీసి క్రాస్ రోడ్స్,
హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.

విషయం : తేది 20 మే 2025 నాడు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనడం గురించి -

అయ్యా!

బహుజన, వామపక్ష పార్టీల (జెఎసి) తరపున తమరికి మనవి చేయునది ఏమనగా, కేంద్ర, రాష్ట్ర, బహుజన, వామపక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు తేది 20 మే 2025 నాడు జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో మన తెలంగాణ రాష్ట్రంలోని అసంఘటిత, సంఘటిత కార్మికులు సమ్మెలో పాల్గొనెదరు.

ఇట్టి విషయాన్ని తమరికి ఈ నోటీసు ద్వారా తెలియజేయడం జరుగుతున్నది.

నమస్కారములు

ఇట్లు

AICTU AICCTU AIFTU BLTU IFTU BFTU

TFTU TUCI TBNCKU TSKPS అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య

06 MAY 2025




సమాఖ్య) ఆధ్వర్యంలో లేబర్ కమిషనర్ ,అంజయ్య భవన్, హైదరాబాద్ గారికి తేదీ 20 మే 2025 నాడు జరిగే దేశవ్యాపిత కార్మిక సమ్మె నోటీసును ఇవ్వడం జరిగింది .ఈ సందర్భంగా అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం (ఏ.ఐ.సి.టి.యు ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తుడుం అనిల్ కుమార్ మాట్లాడుతూ కార్మికులు కొట్లాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 యాజమాన్య అనుకూల కోడులుగా మార్చి శ్రమ దోపిడీకి పాల్పడుతూ, దేశ సంపదనంతా కార్పొరేట్, పెట్టుబడిదారులకు కట్టపెట్టుతున్నది . కార్మిక వర్గానికి కనీస కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం, కనీస భద్రత కనుమరుగై పోతున్నది. భారతదేశంలో 99% కార్మిక వర్గం బహుజన శ్రామిక జాతులకు చెందిన బిసి, ఎస్సీ, ఎస్టీ, మత మైనారిటీలు మారో1%అగ్రకులపేదలతో 100% బహుజన శ్రామిక వర్గం వారైతే, 99% ఆధిపత్య కులాలకు చెందిన పిడికెడు మంది పెట్టుబడిదారలే.నాడు కాంగ్రెస్, నేడు బిజెపి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను నడుపుతున్నది అంబానీ,ఆదాని ఆధిపత్య కులాలకు స్వదేశీ పెట్టుబడిదారుల తోపాటు, వందల సంఖ్యలో అమెరికన్ సామ్రాజ్యవాద విదేశీ పెట్టుబడిదారులతో కలిసి దేశ సంపదను లూటి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 90% ఉన్న బహుజన శ్రామిక వర్గ కార్మిక వర్గానికి ప్రస్తుత సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా కార్మిక రక్షణ చట్టాలను రూపొందిచపోగా బిజెపి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన కార్మిక చట్టాలను కాలరాస్తూ దేశ సంపద సృష్టికర్తలైన బహుజన కార్మికుల శ్రమను కారు చౌకగా దోపిడి చేస్తున్న ఆధిపత్య వర్గ కార్పోరేట్ పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయల సబ్సిడీల రూపంలో దోచిపెడున్నది. దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సమానపనికి సమాన వేతనం రూ 26 వేలు అమలు చేయాలని తీర్పు చెప్పింది. అయినా సరే బిజెపి కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు బుట్టదాఖలు చేసింది. మే 20న వివిధ కేంద్ర కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో బహుజన వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ బహుజన కార్మిక వర్గానికి కనీస వేతనం రూ 30 వేలు అమలు చేయాలని, ఈపిఎఫ్ పెన్షన్ 15 వేలలు అమలు చేయాలని, బహుజన కార్మిక వర్గానికి వ్యతిరేకంగా బిజెపి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో బహుజన కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం విజ్ఞప్తి చేసశారు.. ఈ కార్యక్రమంలోఅఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం ఏఐసిటియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తుడుం అనిల్ కుమార్ ,బహుజన వామపక్ష కార్మిక సంఘాల జె ఏ సి నాయకులుప్రసాద్ ,కర్ర దానయ్య,,రవి ,సిద్ది రాములు ,ఖలీల్ ప్రసాద్ చంద్రమౌళి,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# తీరొక్క 'సౌందర్యం'

సౌందర్యపోషణ... ప్రపంచవ్యాప్తంగా మహిళలు అందంగా కనిపించేందుకు ఎన్నో మార్గాలను అన్వేషిస్తుంటారు. చర్మం సున్నితంగా ఉండాలంటే... ముఖం మీద మచ్చలు పోవాలంటే... కళ్ల కింద నల్లచారలు కనుమరుగు కావాలంటే... కేశాలు ఒత్తుగా పెరగాలంటే... మార్కెట్ మాయ ఎలాగూ అన్నిచోట్ల కనిపిస్తుంది. అయితే కొన్ని నమ్మకాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టి, అందరికీ వాటిని పరిచయం చేస్తున్నాయి. ప్రయోగాలకు ఉసిగొల్పుతున్నాయి. అలాంటి కొన్ని విచిత్రమైన, విలక్షణమైన సౌందర్యపోషణ నమ్మకాలివి... ఈ వార్తను కూడా చదవండి: %ఐతీఅంష్ట్రు%: పెళ్లి గురించి బాధ లేదు..

## వెన్నతో కేశ సంరక్షణ

సౌందర్య ఉత్పత్తుల్లో వెన్నకు చాలాకాలం నుంచి చోటుంది. అయితే ఇథియోపియాలో వెన్నను పూర్తిగా కేశ సౌందర్యానికి వినియోగిస్తారు. ఈ ఆఫ్రికా నేలపై నేరుగా పడే సూర్యకిరణాల నుంచి రక్షణకు ఓ మార్గంగా దీనిని వాళ్లు పేర్కొంటారు. కేశాలకు వెన్నను దట్టంగా పట్టించి గంట తరవాత తలస్నానం చేస్తారు ఇథియోపియన్లు. దీనివల్ల జుట్టుకు బలం చేకూరి, బాగా పెరుగుతుందట కూడా. అంతేకాకుండా వెన్నలోని ఫ్యాటీ ఆసిడ్లు, విటమిన్లు జుట్టుకు తేమను, చక్కటి పోషణతో పాటు కండిషనర్‌గా కూడా సహాయపడతాయి. ఆఫ్రికన్లకు ఉండే గిరిజాల జుట్టు చిక్కుపడకుండా, మరింతగా రింగులు తిరిగేలా కూడా తోడ్పడుతుందని అక్కడి పరిశోధనలు తెలియజేస్తున్నాయి.

## భలే... బియ్యపు నీళ్లు

వయసు తెలియకుండా సౌందర్యాన్ని సంరక్షించుకునే వాళ్లలో జపనీయులు ముందుంటారు. జపాన్ ఇళ్లలో మగువలు ఆచరించే సౌందర్య సాధనాలలో ముఖ్యమైనది బియ్యపు నీళ్లు అంటే ఆశ్చర్యమేస్తుంది. బియ్యాన్ని అరగంట పాటు నీళ్లలో నానబెట్టి, ఆ నీటిని వడగట్టి ముఖానికి, మెడకూ, చేతులకూ, కాళ్లకు పట్టిస్తారు. ఈ నీళ్లలోని యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, అమైనో ఆసిడ్లు, కార్బోహైడ్రేట్లు చర్మంలోని తేమని పరిరక్షిస్తాయి. ముడతలను అరికడతాయి. ఈ నీటిని కేశ సంరక్షణకూ ఉపయోగించడం విశేషం. బియ్యం నీళ్లలోని విశేషణాల వల్ల కురులు పొడవుగా పెరుగుతాయని, శిరోజాలు తెల్లబడకుండా నివారించవచ్చని జపాన్ మగువలు నమ్ముతారు. సహజ కండిషనర్‌గా కూడా ఈ నీళ్లని పేర్కొంటారు. అక్కడ అన్నం గంజిని కూడా ఇలాగే వినియోగిస్తారు. నేడు మార్కెట్‌లో లభించే సౌందర్య ఉత్పత్తుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు... బియ్యం నీళ్లలో ఉండడం విశేషం. అందుకే బియ్యం కడిగిన నీటిని ఓ సీసాలో పోసి ఫ్రిజ్‌లో పెట్టి, వారం రోజుల పాటు వాడుతుంటారు.

## రాయితో సున్నితంగా మర్దన

చైనాలో మగువలు సౌందర్య సాధనంగా 'గ్వా షా' ను ఉపయోగిస్తున్నారు. సాధారణంగా ముఖానికి నూనె రాసి చేతులతో మర్దన చేస్తారు. కానీ చైనాలో చేతులకు బదులుగా ప్రత్యేక రాయిని వాడతారు. అదే గ్వా షా. మాండరిన్ భాషలో 'షా' అంటే కమిలిన గాయం లేదా మచ్చ. 'గ్వా' అంటే పోగొట్టడం అని అర్థం. ఈ గ్వా షా వల్ల రక్త ప్రసరణ బాగా జరుగుతుందని చెబుతున్నారు. ఈ ప్రక్రియ



వల్ల ముఖ కండరాల మధ్య ఒత్తిడి తగ్గుతుంది. తద్వారా చర్మం కాంతులీనుతుంది. ముడతలూ తగ్గుతాయి. మలినాలు తొలగేందుకూ ఈ సుతిమెత్తని మర్దన ఉపయోగపడుతుంది.అయితే ముఖమ్మీది చర్మం చాలా సున్నితంగా ఉంటుంది కాబట్టి గ్వా షాను జాగ్రత్తగా వినియోగించాలి. లేకపోతే చర్మం కందిపోతుంది. పచ్చ, క్వార్జ్, పాల రాయి తదితరాలను గ్వా షా కోసం ఉపయోగిస్తున్నారు. వాస్తవానికి చైనాలో నాలుగు వేల ఏళ్ల నుంచే గ్వా షాను సాంప్రదాయేతర వైద్య విధానంగా ఉపయోగిస్తున్నట్టుగా పరిశోధనలు చెబుతున్నాయి. అక్కడ ప్రత్యేకంగా గ్వా షా నిపుణులూ లేకపోలేదు. అయితే సోషల్‌మీడియా వల్ల నేడు గ్వా షా ముఖ మర్దన చైనాను దాటి అంతటా విస్తరిస్తోంది.

## బురద మంచిదే...

ప్రాచీన రోమన్లు బురద స్నానాలు చేసేవారని చారిత్రక గ్రంథాలు తెలియజేస్తున్నాయి. ఈ ఆధునిక యుగంలో 'మడ్ బాత్'లకు ప్రసిద్ధి చెందిన నేల టర్కీ. అక్కడి 'దాల్యాన్' బురద నేలలో మునిగి తేలేందుకు ప్రపంచ వ్యాప్త టూరిస్టులూ క్యూ కడుతుంటారు. చక్కటి ఫలితాల కోసం బురద నేలల్లో కనీసం 15 నిమిషాల పాటు కూర్చోవాలంటారు సౌందర్య నిపుణులు. ఇలా బురదలో స్నానం చేయడం వల్ల ఆరోగ్యపరంగా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని చెబుతారు. బురదలోని ఖనిజ లవణాల వల్ల చర్మం కొత్త కాంతిని పొందుతుంది. ఇంకా కీళ్ల నొప్పులు, కండరాల మధ్య ఒత్తిడి కూడా తగ్గుతాయి. శరీరంతో పాటు మనసు కూడా రిలాక్స్ అవుతుందని టర్కీయుల నమ్మకం. ముల్తానా మట్టిని శరీరానికి పూసుకోవడం మనదగ్గర కూడా ట్రెండ్‌గా ఉంది.

## చింతపండుతో ప్రయోగాలు

థాయి సుందరీమణుల అందం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే వాళ్ల సౌందర్య సాధనాల్లో చింతపండుది అగ్రస్థానం అంటే ఆశ్చర్యమేస్తుంది. థాయ్ రుచుల్లో చింతపండుని విరివిగా వాడతారు. ఇంకా చింతపండును చక్కని చిక్కని స్క్రబ్‌గా కూడా వాళ్లు వినియోగించడం విశేషం. థాయి మగువలు వారంలో



ఓసారి నానబెట్టిన చింతపండు, రాక్‌సాల్ట్‌ను కలిపి శరీరానికి పట్టిస్తారు. ఆ తర్వాత కొద్దిసేపటికి శుభ్రంగా కడిగేస్తారు. దీనివల్ల మృతకణాలు తొలగిపోయి, చర్మం కాంతిలీనుతుందని వాళ్లు భావిస్తారు. చింతపండులోని కొల్లాజెన్ వల్ల ముడతలు తొలగిపోయి, చర్మానికి దృఢత్వం చేకూరుతుంది. తేనె, అలోవేరా తదితరాలను కూడా చింతపండుకు కలిపి ప్రయోగాలు చేస్తుంటారు థాయి మగువలు. సౌందర్య సాధన కోసం ప్రత్యేక చింతపండు పేస్టుకు థాయిలాండ్‌లో గిరాకీ ఎక్కువే.

## సముద్ర తీరంలోని ఇసుకతో...

ఎప్పుడైనా బీచ్‌కి వెళ్లినప్పుడు సముద్రాన్ని, నీలాకాశాన్ని, చల్లని గాలిని ఆస్వాదించడమే కాకుండా... అక్కడి మెత్తటి ఇసుకతో కాళ్లూచేతుల్ని మర్దన చేసుకోవడం మర్చిపోకండి. ఈ 'బీచ్ సాండ్ స్క్రబ్'ను ఎక్కువగా వినియోగిస్తారు బ్రెజీలియన్లు. వాళ్లు బీచ్‌కు ఓ చిన్నపాటి బ్యాగ్‌తో వెళతారు. ఓ కప్పులో రెండు స్పూన్ల ఇసుక, మరో రెండు స్పూన్ల మసాజ్ ఆయిల్ ను కలిపి కాళ్లూచేతులకు పట్టిస్తారు. అరగంట తరవాత సముద్ర అలలలో కడిగేస్తారు. ఇలా చేయడం వల్ల చర్మం మెత్తగా, కాంతిమంతంగా అవుతుందని బ్రెజిల్ మహిళలు ఆచరణలో చేసి చూపెడుతున్నారు.

## టీ పొడి పేస్ట్...

అర్జెంటీనాలో 'యేర్బా మాటే' టీ ఓ సాంస్కృతిక చిహ్నం. ఆ దేశంలో యేర్బా పాపులర్ పానీయం. యేర్బా మాటేని ప్రస్తుతం సూపర్‌ఫుడ్‌గా పేర్కొంటున్నారు. సౌందర్యసాధనలో విరివిగా వినియోగిస్తున్నారు. ఇందులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ప్రాపర్టీలు ఎక్కువ. కెఫీన్ స్థాయులు అధికం. కళ్ల చుట్టూ డార్క్ సర్కిల్స్‌ని నివారిస్తుందని, చర్మాన్ని తాజాగా ఉంచుతుందని, ముడతలు లేని చర్మాన్ని అందిస్తుందని అర్జెంటీనా మహిళలు చెబుతారు. ఇంటి దగ్గర తాజాగా చేసుకోలేని వారి కోసం రెడీమేడ్ యేర్బా మాటే పేస్టులూ అందుబాటులోకి వచ్చేశాయి.

# కూటమి స్కామ్‌లతో ఖజానా ఖాళీ

## బీసీలను ఆదుకున్నది వైఎస్సార్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే

## స్కీమ్ కాదు.. అదో పెద్ద స్కామ్

## శ్రీకాకుళం జిల్లా వైయస్సార్సీపి అధికార ప్రతినిధి కోట గోవిందరావు



ఆమదాలవలస నియోజకవర్గం : బీసీ రుణాల పేరుతో కూటమి నేతలు జేబులు నింపుకుంటున్నారు అని శ్రీకాకుళం జిల్లా వైయస్సార్సీపి అధికార ప్రతినిధి కోట గోవిందరావు అన్నారు. అలాగే ఆమదాలవలస మున్సిపాలిటీ లో ఉన్న తన కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూమహిళా దినోత్సవం నాడు ప్రారంభించిన కుట్టుమిషన్ల శిక్షణ స్కీమ్ లో రూ.150కోట్లు స్కామ్ చేయడం అన్యాయమన్నారు. వాస్తవానికి ఒక్కో మహిళకు కుట్టుమిషన్ ఇచ్చేందుకు రూ.4300, శిక్షణకు రూ.3 వేలు మొత్తం రూ.7300 అవ్వగా టెండర్‌లో మాత్రం ఏకంగా రూ.21500 చూపించడం దారుణమన్నారు.అవినీతితో రెండోసారి మోసం చేస్తున్నారు. అన్ని వ్యవస్థల్లో అవినీతికి పాల్పడుతూ గుట్టు చప్పుడు కాకుండా కోట్లాది రూపాయలు కాజేయడం చంద్రబాబు నైజం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

## -బచ్చన్నపేట మండల అభివృద్ధికి కృషి చేస్తాను..

## -సమస్యల పరిష్కారంకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటాను

## బచ్చన్న పేట ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే డా.పల్లా సమావేశం



బచ్చన్నపేట: ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాను. బచ్చన్న పేట మండల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తాను..సమస్యల పరిష్కారంకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఘట్కేసర్ లో బచ్చన్న పేట మండల నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ బిఆర్ ఎస్ రజ తోత్సవ సభ విజయవంతానికి కృషి చేసిన మండల నాయకులకు ముందుగా కృతజ్ఞతలు తెలిపారు.గ్రామాల్లో ప్రతి పేదోడికి సంక్షేమ పథకాలు అందేలా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com